

బిట్రగుంటలోని కేజీబీవీలో మొక్కనాటి నీరు పోస్తున్న మంత్రి స్వామి



మార్కాపురంలోని జడ్పీ పాఠశాలలో తల్లులకు పాదాభివందనం చేస్తున్న విద్యార్థినులు

కోలాహలంగా..

2,955 పాఠశాలలు, 188 కళాశాలల్లో పండుగలా మెగా పీటీఎం

- కళకళలాడిన విద్యా సంస్థలు
- సభలు, సమావేశాలు, తల్లిదండ్రులకు పలు పోటీలు..
- ప్రశంసాపత్రాల అందజేత
- ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల హాజరు
- కె.బిట్రగుంటలో పాల్గొన్న మంత్రి డాక్టర్ స్వామి
- భారీగా మొక్కలు నాటిన విద్యార్థులు

విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో జిల్లాలో ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలు గురువారం కళకళలాడాయి. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన పీటీఎం (పేరెంట్స్, టీచర్స్ మీటింగ్) కోలాహలంగా సాగింది. విద్యాశాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని భారీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయగా తదనుగుణంగా జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పరిధిలోని 2,955 పాఠశాలలు, 188 కళాశాలల్లో ఉత్సాహంగా జరిగింది. మెగా పీటీఎంలలో పలు ప్రాంతాల్లో వివిధ స్థాయిల్లోని ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ రంగాల్లో ఉన్నత శిఖరాలకు ఎదిగిన పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ప్రతి విద్యార్థీ ఒక మొక్క నాటి పచ్చదనానికి తోడ్పడ్డారు.



కొండపిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టగ్గాఫ్‌వార్ ఆటలో దామచర్ల సత్య

ఒంగోలు, జూలై 10 (ఆంధ్రజ్యోతి/విద్య) : ప్రతిష్టాత్మకమైన గిన్నిస్ బుక్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం మెగా పీటీఎం కార్యక్రమాన్ని నిర్వహించతలపెట్టి నెలరోజులుగా అందుకు సన్నద్ధత చర్యలు తీసుకుంది. ఆ ప్రకారమే జిల్లాలోనూ విద్యాశాఖ చర్యలు చేపట్టగా గురువారం ఈ కార్యక్రమం జిల్లాలో విజయవంతమైంది. ఇదేరోజు గురుపూర్ణిమ కూడా కావడంతో కార్యక్రమానికి మరింత ప్రత్యేకత చేకూరింది. ప్రభుత్వ ఆదేశాలతో మెగా పీటీఎంలలో జిల్లాలోని వివిధ స్థాయిల్లోని ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

- జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి తన యోజకవర్గ పరిధిలోని జరుగుమల్లి మండలం కె.బిట్రగుంటలోని కేజీబీవీలో జరిగిన పీటీఎంలో పాల్గొన్నారు. ఆ నియోజకవర్గ కేంద్రమైన కొండపి ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు తూర్పునాయుడుపాలెం హైస్కూలులో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ పాల్గొన్నారు.
- ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర

మిగతా 6లో...

ఏసీబీ వలలో...



ఏసీబీకి పట్టుబడిన సబ్‌రిజిస్ట్రార్ క్రిష్ణమోహన్‌రావు

రూ.35వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్

గిద్దలూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరు ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఎన్.కృష్ణమోహన్‌రావు రూ.35వేలు లంచంగా తీసుకుంటూ ఏసీబీకి అడ్డంగా దొరికిపోయారు. ఈ ఘటన గురువారం సాయంత్రం 4.30 సమయంలో గిద్దలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చోటుచేసుకుంది. ఇన్‌చార్జి ఏసీబీ డీఎస్పీగా పనిచేస్తున్న కర్నూలు ఏసీబీ డీఎస్పీ డి.సోమన్న ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. డీఎస్పీ కథనం ప్రకారం.. గిద్దలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎన్.కృష్ణమోహన్‌రావు సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ గత కొన్నాళ్లుగా ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా వ్యవహరిస్తున్నారు. గిద్దలూరు పట్టణానికి చెందిన షేక్ ఖాదర్‌బాషా అనే కార్పెంటర్ తన తల్లికి చెందిన ఇంటిని తన పేరు మీద మార్చుకునేందుకు గిఫ్ట్ డీడ్ కోసం స్లాట్ బుక్ చేశాడు. అయితే రిజిస్ట్రేషన్ చేయాలంటే రూ.50వేలు లంచంగా ఇవ్వాలని ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ కృష్ణమోహన్‌రావు డిమాండ్ చేశారు. తన చేయి విరిగిందని, అవిటితనంతో కార్పెంటరీ పనిచేయలేక కూలీకి వెళుతున్నానని, అంత ఇచ్చుకోలేనని బతిమలాడగా చివరకు రూ.35వేలు ఇస్తే తప్ప రిజిస్ట్రేషన్ చేయనని కృష్ణమోహన్‌రావు కరాఖండిగా తేల్చిచెప్పారు. దీంతో ఖాదర్‌భాషా ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఖాదర్‌భాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిఘా పెట్టామని, బాధితుడి నుంచి రూ.35వేలు కృష్ణమోహన్‌రావు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు డీఎస్పీ సోమన్న తెలిపారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మొత్తం తనిఖీ చేశామని, మరే ఇతర డబ్బు లభించలేదని పేర్కొన్నారు. రికార్డులు పరిశీలిస్తున్నామన్నారు. గిద్దలూరు, చీరాలలోని ఇళ్లలో కూడా సోదాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. లంచం తీసుకుంటూ పట్టుబడిన కృష్ణమోహన్‌రావును శుక్రవారం నెల్లూరులోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో అవినీతి జరుగుతున్నట్లయితే స్థానిక ఏసీబీ అధికారులను గాని, ఏసీబీ టోల్‌ఫ్రీ నెంబరు 1064 నెంబరు గాని లేదా ఏసీబీ మొబైల్ నెంబరు 9440440057 ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. ఏసీబీ దాడుల్లో సీఐలు శేషు, రమేష్‌బాబు, ఎస్సైలు ప్రసాద్, షరీఫ్ పాల్గొన్నారు.

లోపల వద్దు.. బయట తీసుకుంటా

- అడ్డంగా బుక్కయిన ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్
- గిద్దలూరులో ఒక్కసారిగా కలకలం

6

విషాదాంతం

- మంగళవారం కిడ్నాప్‌నకు గురైన బాలుడు లక్షిత్ మృతదేహం లభ్యం
- గురువారం తెల్లవారుజామున చంపి పొలాల్లో పడవేసిన దుండగులు
- కిడ్నాప్ ఎవరు, ఎందుకు చేశారు?



గుండెలు పగిలేలా రోదిస్తున్న లక్షిత్ తల్లి, అమ్మమ్మ, బంధువులు

కంభం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): బాలుడు అదృశ్యం వ్యవహారం విషాదాంతమైంది. మండలపరిధిలో లింగోజీపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం నుంచి మంగళవారం ఉదయం 11.30 గంటలకు బయటకు వచ్చి కనిపించకుండా పోయిన లక్షిత్ (4) గురువారం ఉదయం పొలంలో మృతదేహమై కనిపించడం సంచలనం కలిగించింది. మంగళవారం నుంచి కనిపించకుండా పోయిన బాలుడిని ఎవరైనా కిడ్నాప్ చేసి ఉంటారని, ఎక్కడో చోట సురక్షితంగా ఉండి ఉంటాడని అందరూ భావించారు. ఈ కేసును సవాలుగా తీసుకున్న పోలీసులు బాలుడి ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పగిస్తారన్న ఆశతో వేచిచూస్తున్నారు. గురువారం ఉదయం 8 గంటల ప్రాంతంలో సూరేపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ పొలంలో పుల్లలు ఏరుకుంటుండగా బాలుడు బోర్లాపడి ఉండటాన్ని గమనించి వెంటనే విషయాన్ని గ్రామస్థులకు తెలిపింది. దీంతో పోలీసులు, లక్షిత్ కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఘటనా స్థలానికి తరలివెళ్లారు.

బాలుడిని ఎవరు ఎందుకు కిడ్నాప్ చేశారు?

జిల్లాలో సంచలనం సృష్టించిన లక్షిత్ విషయంలో ఎవరు, ఎందుకు కిడ్నాప్ చేశారు? ఎందుకు చంపారనేది ప్రశ్నార్థకంగా మారింది. బాలుడి తండ్రి కోటీశ్వరుడని, ఆస్తి కోసమో, లేదా డబ్బులకు డిమాండ్ చేయడానికో బాలుడిని తెలిసిన వారే కిడ్నాప్ చేసి చివరకు ఏమి చేయాలో పాలుపోక, విషయం తెలిస్తే ఎక్కడ పట్టుబడతామోనన్న భయంతో గురువారం ఉదయం చంపి పొలాల్లో పడవేసినట్లు అనుమానిస్తున్నారు.



పి.లక్షిత్ (ఫైల్)

రెండు రోజులు బాలుడిని ఎక్కడ దాచారు?

లక్షిత్‌ను మంగళవారం ఉదయం కిడ్నాప్ చేసిన దుండగులు లింగోజీపల్లి, సూరేపల్లి గ్రామాల మధ్య ఉన్న వ్యవసాయ పొలాల వెంట, వాగుల వెంట తిప్పినట్లు తెలుస్తోంది. బుధవారం ఉదయమే బాలుడి కోసం గాలిస్తున్న పోలీసులు, గ్రామస్థులకు గ్రామానికి 2 కిలోమీటర్ల దూరంలో నల్లవాగు సమీపంలో చెప్పులు దొరకడం, పోలీసు జాగిలం కూడా ఈ రెండు గ్రామాల

మిగతా 6లో...

అన్నదాత సుఖీభవకు ఎల్లుండి దాకా అర్జీల స్వీకరణ

ఒంగోలు కలెక్టరేట్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత ఉండి పేర్లు లేని రైతులు ఈనెల 13వతేదీ వరకు రైతుసేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం ద్వారా అర్హత గల ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.20వేలు ఆర్థిక సహాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 5,31,369 మంది రైతులను పరిశీలించగా అందులో 4,38,251 మంది అర్హులైన జాబితాలను పంపగా, వాటిని పరిశీలించి 2,72,824 మందిని లబ్ధిదారులుగా గుర్తించారన్నారు. ఆ రైతుల ఈకేవైసీని కూడా పూర్తిచేయాల్సి ఉండగా ఇప్పటివరకు 2,65,272 మంది రైతుల ఈకేవైసీ పూర్తి చేశారని పేర్కొన్నారు. మిగిలిన వారు ఈకేవైసీ పూర్తి చేయాల్సి ఉందన్నారు. అర్హత ఉండి జాబితాలో పేరు లేకపోతే దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తామని తెలిపారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 1,410 మంది రైతులు గ్రీవెన్స్‌సెల్ దరఖాస్తు చేసుకోగా 69మంది వివరాలు సంబంధిత తహసీల్దార్లకు పరిశీలనకు పంపామని చెప్పారు.

సమస్య రాసెయ్... బాక్సులో వేసెయ్..!

- ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నేతృత్వంలో నూతన విధానం
- ప్రజా సమస్యల పరిష్కారానికి నగరంలో ఏర్పాటు



ఫిర్యాదుల బాక్సు

ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం పలికారు. నగరంలోని ప్రధాన సెంటర్‌లలో ప్రజా ఫిర్యాదుల బాక్స్‌లను ఏర్పాటు చేశారు. ప్రజలు తనను నేరుగా కలిసి చెప్పలేని సమస్యలు, నగర అభివృద్ధికి అవసరమైన సలహాలతోపాటు ఏ ఇతర సమస్యలనైనా తెల్లకాగితంపై రాసి బాక్సులో వేయడం ద్వారా మూడురోజుల కొకసారి దామచర్లకు ఆ లెటర్లు చేరుతాయి. దీంతో సమస్యలను తెలుసుకుని పరిష్కరించే దిశగా వీటిని ఏర్పాటు చేశారు. *- ఒంగోలు, కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)*

రైతులకు తీపి కబురు



- వారసత్వ భూములకు గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్
- రూ.వంద మాత్రమే ఫీజు
- ప్రక్రియ ప్రారంభానికి ప్రభుత్వం చర్యలు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రైతు కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం శుభవార్త చెప్పింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో నామమాత్రపు ఫీజులతో వారసత్వ భూములను రిజిస్ట్రేషన్ చేసేందుకు కసరత్తు ప్రారంభించింది. జిల్లాలోని 597 గ్రామ సచివాలయాలు, 122 వార్డు సచివాలయాల్లో వారసత్వ భూములను కేవలం రూ.100కే రిజిస్ట్రేషన్ చేయనుంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిర్ధారించిన మార్కెట్ విలువ ప్రకారం ఆ ఆస్తి విలువ రూ.10లక్షలలోపు ఉంటే రూ.100, ఆపైన ఉంటే రూ.వెయ్యి ఫీజును స్టాంపు డ్యూటీ కింద పరిగణిస్తారు. ఆస్తి యజమానులు మరణించిన అనంతరం వారసులకు సంక్రమించే ఆస్తులకు మాత్రమే గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేస్తారు. మిగిలిన

మిగతా 6లో...



సాగర్ కాలువలో ప్రవహిస్తున్న నీరు

సాగర్ ఆయకట్టులో వరిసాగుపై ఆశలు

- జలాశయానికి పుష్కలంగా చేరుతున్న నీరు
- మాగాణి రైతుల్లో వెల్లివిరిసిన ఆనందం

దర్శి, జూలై 10(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం, సాగర్ జలాశయాలకు పుష్కలంగా నీరు చేరుతుండటంతో సాగర్ ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ ఏడాది వరిసాగుకు సానుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు. ఇప్పటికే శ్రీశైలం జలాశయం నిండటంతో రెండు రోజుల క్రితం సీఎం చంద్రబాబు సాగర్ డ్యామ్‌కు నీరు విడుదల చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం శ్రీశైలం నుంచి 1.45 లక్షల క్యూసెక్కుల నీరు సాగర్ డ్యామ్‌కు చేరుతోంది. ఇలాగే నీటి ప్రవాహం కొనసాగితే కొన్ని రోజులకు సాగర్ డ్యామ్ కూడా నిండుతుంది. 25 సంవత్సరాలుగా పరిశీలిస్తే ఇంత ముందుగా శ్రీశైలం డ్యామ్ నిండి సాగర్ జలాశయంకు నీరు చేరటం ఇదే ప్రథమం. ఈ ఏడాది ముందుగానే జలాశయాలకు నీరు పుష్కలంగా చేరుతుండటంతో సాగర్ ఆయకట్టు రైతులు ఆనందంతో ఉన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఖరీఫ్ పంటలు కూడా పెద్దగా సాగు చేయలేదు. మేనెలలో కురిసిన వర్షాలకు పెసర, మినుము సాగు చేసినప్పటికీ ఆ తర్వాత వర్షాలు లేక ఆ పైర్లు వాడు పడుతున్నాయి. ఇప్పటికీ అధికశాతం మాగాణి భూములు దుక్కులు దున్ని వదిలేశారు. కొన్ని భూములు బీడుగానే ఉన్నాయి. ప్రస్తుతం సాగర్ జలాశయానికి నీరు చేరుతుండటంతో మాగాణి భూములను ముమ్మరంగా దుక్కులు దున్నుతున్నారు. సాగర్ జలాశయం నుంచి సాగునీరు విడుదల కాగానే వరిపైరు సాగుకు వీలుగా రైతులు వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. జిల్లాలో 4.5 లక్షల ఎకరాలు సాగర్ ఆయకట్టు భూమి ఉంది. దర్శి పరిధిలో లక్ష

మిగతా 6లో...

కొండపి, మంగమూరు పంచాయతీలకు ఎన్నికలు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : వివిధ కారణాలతో ఆగిపోయిన కొండపి, సంతనూతలపాడు మండలం మంగమూరు గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. అందుకోసం తీసుకోవాల్సిన చర్యలపై గురువారం ఎన్నికల కమిషనర్ నీలం శాల్విని ఉత్తర్వులు జారీ చేశారు. కొండపి, మంగమూరు గ్రామ పంచాయతీల్లో గురువారం ఓటర్ల జాబితాతోపాటు పోలింగ్ కేంద్రాల వివరాలు ప్రచురించి, 14వ తేదీన ఫిర్యాదుదారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో అభ్యంతరాలను స్వీకరిస్తారు. వాటిని ఈనెల 16వ తేదీన పరిష్కరిస్తారు. 17వ తేదీన ఓటర్ల జాబితాతో పాటు పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ప్రచురించాలి. ఈ మేరకు షెడ్యూల్ విడుదలైంది. తదనుగుణంగా జిల్లా పంచాయతీ అధికారులు తగిన చర్యలు చేపట్టారు.

జీరో అడ్మిషన్లపై ఇంటెలిజెన్స్ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఒంగోలు విద్య, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో జీరో అడ్మిషన్లపై ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీశారు. 'జీరో అడ్మిషన్లు' పేరుతో బుధవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. జిల్లాలోని 89 పాఠశాలల్లో 1వ తరగతిలో ఒక్క విద్యార్థీ చేరలేదు. 138 పాఠశాలల్లో ఒక్కొక్కరే చేరారు. 168 పాఠశాలల్లో ఇద్దరు చొప్పున, 91 పాఠశాలల్లో ముగ్గురేసి చొప్పున, 227 పాఠశాలల్లో నలుగురు చొప్పున, 145 పాఠశాలల్లో ఐదుగురు చొప్పున, 120 పాఠశాలల్లో ఏడుగురు చొప్పున చేరారు. ఇంటెలిజెన్స్ ఆరా తీయగా వారు ఒంగోలులోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి వచ్చి జీరో అడ్మిషన్లపై అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. జిల్లాలోని పాఠశాలలు, విద్యార్థుల నమోదు వివరాలను, పాఠశాలల జాబితాలను డీఈవో కార్యాలయం నుంచి అధికారులు తీసుకున్నారు. పాఠశాలల్లో పిల్లలు చేరకపోవడానికి గల కారణాలు డీఈవో కార్యాలయ సిబ్బంది చెప్పలేకపోయినట్లు తెలిసింది. ఇంటెలిజెన్స్ అధికారులు సేకరించిన వివరాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు పంపనున్నట్లు తెలుస్తోంది.

రైతులకు తీపి కబురు

(5వపేజీ తరువాయి)

భూములను యథావిధిగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేస్తారు. గ్రామ, వార్డు సచివాయాల ద్వారా మరణ ధ్రువీకరణ పత్రం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేస్తున్నారు. యజమాని మరణించిన అనంతరం వచ్చిన ఆస్తులను వారసులు భాగాలు చేసుకొని లిఖితపూర్వకంగా ఏకాభిప్రాయంతో వస్తే గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే డిజిటల్ అసిస్టెంట్ల ద్వారా రిజస్ట్రేషన్ చేసే విధంగా ప్రణాళికలు రూపొందించారు. సచివాలయాల్లో అది కూడా నామమాత్రపు ఫీజులతో రిజస్ట్రేషన్ చేయడం ద్వారా వారసులు ముందుకు వస్తారని అధికారులు భావిస్తున్నారు. రిజస్ట్రేషన్ చేయడం వల్ల భూముల రికార్డుల్లో వివరాలు నమోదు (మ్యుటేషన్) ఆటోమెటిక్‌గా జరిగి ఈ-పాస్‌బుక్ కూడా జారీ అవుతుంది. వారసులుగా ఉన్నవారి నుంచి ఈకేవైసీ సైతం అధికారులు తీకుంటారు. ఈ రిజస్ట్రేషన్ ప్రక్రియ స్థానిక సబ్ రిజస్ట్రార్ కార్యాలయాల పర్యవేక్షణలో జరగనుంది. ఈ విధానం అమలులోకి వస్తే జిల్లాలోని లక్షలాది కుటుంబాలకు మేలు చేకూరనుంది.

సాగర్ ఆయకట్టులో వరి సాగుపై ఆశలు

(5వపేజీ తరువాయి)

ఎకరాల సాగర్ ఆయకట్టు ఉంది. ఇందులో 60వేల ఎకరాల్లో వరిసాగు చేస్తారు. మిగిలిన ఆయకట్టు భూమిలో ఆరుతడి పంటలు వేస్తారు. ఇప్పటివరకు వర్షాలు పడలేదని బెంగ పెట్టుకున్న సాగర్ ఆయకట్టు రైతులు సాగర్ జలాశయంకు పుష్కలంగా నీరు చేరుతుండటంతో ఆ దిగులు వదిలి ఆనందంతో వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు.

మార్గదర్శకులను ఆగస్టు 15లోపు గుర్తించాలి

ఒంగోలు(రూరల్), జూలై10(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించటానికి, పేదరిక నిర్మూలనకు పీ4 పథకానికి సీఎం చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారని, పేదరికంలో ఉన్న బంగారు కుటుంబాలను అభివృద్ధి చేయటానికి మార్గదర్శికులను ఆగస్టు 15వ తేదీ లోపు గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.విజయానందరావు ఆదేశించారు. గురువారం విజయవాడలోని రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో మాట్లాడారు. పేదలను ఆర్థిక అసమానతల నుంచి ఉన్నత స్థితికి చేర్చేలా చూడాలన్నారు. ఇందుకోసం మార్గదర్శకులను అధికారులు గుర్తించాలని సూచించారు. జిల్లాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు వైద్యశాఖ సిద్ధంగా ఉండాలని చెప్పారు. సంక్షేమ వసతిగృహాలలో పారిశుధ్య నిర్వహణ కచ్చితంగా ఉండాలన్నారు. మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతంగా జరిగేలా చూడాలని చెప్పారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ, జడ్పీసీఈవో చిరంజీవి, డీపీవో వెంకటనాయుడు, నగర కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఈవీఎంల గోడౌన్ పరిశీలన



ఈవీఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం మామిడిపాలెంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎం)ల గోడౌన్ ను ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ గురువారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ముందుగా గోడౌన్‌కు వేసిన సీళ్లను, అక్కడి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో వింత

డీఈఈ స్థాయి అధికారే ఇన్‌చార్జి ఏడీఈగా విధులు
నాలుగేళ్లుగా ఆ పోస్టు ఖాళీ
అంతా తానై వ్యవహరిస్తున్న ఆ ఆఫీసర్
అమానిగుడిపాడులో సిబ్బంది తొలగింపులోనూ కీలక పాత్ర
నేడు పుల్లలచెరువుకు రానున్న విద్యుత్ మంత్రి గొట్టిపాటి



వై పాలెంలోని ఏడీఏ కార్యాలయం

ఎర్రగొండపాలెం రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం 11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో చిత్రవిచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ సబ్ స్టేషన్ పరిధిలో ఒక ఏఈ, ఒక అసిస్టెంట్ డివిజన్ ఇంజనీరింగ్ అధికారి ఉండాలి కానీ, ఇక్కడ కేవలం ఒక ఏఈ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇక ఏడీఏ పోస్టు ఐదేళ్లుగా ఖాళీగానే ఉంది. ఈ పోస్టుకు సంబంధించి రెండుసార్లు ఏడీఏలను నియమించినప్పటికీ.. డివిజన్ స్థాయి అధికారి అప్పటి వైసీపీ పాలనలో రాజకీయ పలుకుబడితో ఇక్కడ విధులలో చేరకుండా చేశారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆ పోస్టుకు ఆయనే ఇన్‌చార్జిగా ఉంటున్నారు.

● డివిజన్ స్థాయి నుంచి అసిస్టెంట్ డివిజన్ స్థాయికి

ఏ ప్రభుత్వ ఉద్యోగులైనా మండల స్థాయి నుంచి డివిజన్ స్థాయికి, లేదా డివిజన్ స్థాయి నుంచి జిల్లా స్థాయికి వెళ్లాలని లేదా ఎదగాలని చూస్తారు. కానీ అందుకూ పూర్తి విరుద్ధంగా ఎర్రగొండపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో జరుగుతోంది. మార్కాపురం డివిజన్ స్థాయిలో విధులు నిర్వహిస్తున్న ఆ అధికారి ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి ఏడీఏగా విధులు నిర్వహిస్తూ అంతతానై కింద స్థాయి సిబ్బందిని బెదిరిస్తూ పైసా వసూల్ చేస్తున్నట్లు ఆ శాఖ సిబ్బందే గుసగుసలాడుతున్నారు. డివిజన్ స్థాయి అధికారి కావడంతో చేసేది లేక ఆయన చెప్పినట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. మార్కాపురం సబ్‌స్టేషన్ పరిధిలో కొన్ని పనులకు సంబంధించి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అదేశించిన పనుల్లో కూడా జాప్యం చేస్తున్నారని తెలుస్తుంది. ప్రభుత్వం మారినా వైసీపీ నాయకులు, కాంట్రాక్టర్ల పనులే చేపడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.

● నలుగురిని పక్కనపెట్టారు

అమానిగుడిపాడు గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న(షిఫ్ట్ ఆపరేటర్లుగా) నలుగురు సిబ్బందిపై రైతులకు విద్యుత్ స్తంభాలు అమ్ముకున్నారని ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టి ఆ స్తంభాలను రికవరీ చేశారు. ఇదే విషయంలో ఓ కాంట్రాక్టు లబ్ధి కోసం అదే డివిజన్ స్థాయి అధికారి వారిని విధుల నుంచి పక్కనపెట్టారని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఈ విషయంలో ఆ నలుగురూ ఉన్నతాదికారుల దృష్టికి తీసుకెళ్లినా ఆ కాంట్రాక్టర్, ఆధికారి చక్రం తిప్పారని ఆ శాఖ సిబ్బందే అప్పట్లో అనుకోవడం విశేషం.

● చిన్న పనికీ మార్కాపురం వెళ్లాల్సిందే

11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఏ పని కావాలన్నా మార్కాపురంలోని ఆయన కార్యాలయానికి వెళ్లాల్సిందే. వారోనికో, పది రోజులకో ఎర్రగొండపాలెం వస్తారు. అది కూడా ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళతారో ఆయనకు తప్ప సిబ్బందికి కూడా సమాచారం తెలియదని ప్రజలు, రైతులు అంటున్నారు. జిల్లా స్థాయి అధికారులు స్పందించి ఎర్రగొండపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని రెగ్యులర్ ఏడీఏని నియమించి అమానిగుడిపాడులో సిబ్బంది తొలగింపుపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని పలురువు అంటున్నారు

నల్లబర్లీ కొనుగోళ్లలో వేగం పెంచాలి

రైతుకు నష్టం లేకుండా చివరి ఆకువరకు కొనుగోళ్లు
పంగులూరులో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి గొట్టిపాటి

పంగులూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లలో అధికారులు వేగం పెంచాలని రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. పంగులూరు మార్కెట్‌యార్డ్ లోని పొగాకు కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన స్థానిక రైతులతో కలిసి పరిశీలించారు. పొగాకు కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయని, రైతులు కొనుగోలు కేంద్రానికి తెచ్చిన పొగాకు బేళ్లను నాణ్యత పేరుతో వెనక్కి పంపుతున్నారన్నారు. రైతుల ఇబ్బందులను గుర్తించడం లేదని పలు గ్రామాల రైతులు తమ సమస్యలను మంత్రి గొట్టిపాటికి వివరించారు. పంగులూరు కొనుగోలు కేంద్రంలో రోజుకు ఐదు వందల పొగాకు బేళ్లను కొనుగోలు చేసేవిదంగా తక్షణ చర్యలు చేపట్టాలని మంత్రి గొట్టిపాటి అధికారులను ఆదేశించారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని మార్కెట్ యార్డ్ కార్యదర్శి సూర్యప్రకాశ్‌రెడ్డిని అదేశించారు. తేమశాతం విషయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి రైతులకు సూచించారు. నాణ్యత పేరుతో రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన బేళ్లను అధికారులు వెనక్కు పంపడంపై అసహనం వ్యక్తం చేశారు.

● కొరిశపాడులో కేంద్రం ఏర్పాటు చేయండి : మంత్రి గొట్టిపాటి

రైతుల నుంచి నల్లబర్లీ పొగాకు వేగంగా కొనుగోలు చేసేందుకు కొరిశపాడులో వెంటనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని మంత్రి గొట్టిపాటి అధికారులను ఆదేశించారు. గోడౌన్లను గుర్తించామని, కొనుగోలుకు అవసరమైన ప్లాట్‌ఫాం ఎంపిక చేసి వెంటనే ప్రారంభిస్తామని మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ తెలిపారు. పంగులూరు కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు 83 మంది రైతుల నుంచి 1250 బేళ్లను 10 రోజుల వ్యవధిలో కొనుగోలు చేసినట్లు ఆమె మంత్రికి వివరించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న సమయాన్ని బట్టి రైతుల పేర్లు నమోదు చేస్తున్నామన్నారు.



.పంగులూరులో కొనుగోళ్లను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి

నెమ్ముశాతం, మిక్సింగ్, పట్టల నాణ్యతపై దృష్టిసారించాలి

కొనుగోలు కేంద్రానికి బేళ్లను తెచ్చే రైతులు నెమ్ముశాతం 20కి మించకుండా చూడాలని, మిక్సింగ్ లేకుండా బేళ్లను తేవడంతో పాటు పట్టల విషయంలో జాగ్రత్తలు పాటించాలని అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు.మంత్రి గొట్టిపాటి ఆదేశాలను అనుసరించి 600 బేళ్ల వరకు కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో బయ్యర్ రమేష్, తహసీల్దార్ సింగారావు, ఎంపీడీవో స్వరూపారాణి, ఏవో సుబ్బారెడ్డి, సీఈవో నాగబోయిన లక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, కేవీ సుబ్బారావు, బాలిన రామసుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, గుర్రం ఆదిశేఖర్, అల్లంనేని బ్రహ్మానంద స్వామి, ఎర్రం శ్రీనివాసరెడ్డి, జేకేసీ శింగర్, ఎనికపాటి శ్రీను, ఓబుల్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి త్రివేణి, చౌదరిబాబు, చంద్రశేఖర్, రాచపూడి మాజీ సర్పంచ్ తలపనేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

లోపల వద్దు.. బయట తీసుకుంటా

అడ్డంగా బుక్కయిన ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్
ఏసీబీకి చిక్కిన అధికారి
గిద్దలూరులో ఒక్కసారిగా కలకలం

గిద్దలూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఎస్.కృష్ణమోహన్‌రావు ఏసీబీ వలలో చిక్కడంతో గిద్దలూరులో కలకలం రేగింది. తన తల్లి పేరు మీద ఉన్న ఇంటిని గిఫ్ట్‌డీడ్ ద్వారా తన పేరు మీదకు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు పట్టణానికి చెందిన కార్పెంటర్ షేక్ ఖాదర్‌బాషా ఒక స్టాంప్ రైటర్ ద్వారా సబ్ రిజిస్ట్రార్‌ను సంప్రదించాడు. రూ.50వేలు డిమాండ్ చేయగా రూ.35వేలకు బేరం కుదిరింది. సాధారణంగా చలానాతోపాటు లంచం డబ్బును కూడా డాక్యుమెంట్ రైటర్లకే ఇస్తారు. కానీ కృష్ణమోహన్‌రావు మాత్రం లంచం మొత్తాన్ని నేరుగా తనకే ఇవ్వాలని డిమాండ్ చేసి చివరకు అడ్డంగా బుక్కయ్యాడు. గురువారం మధ్యాహ్నం 3.15 గంటలకు స్లాట్ బుక్ చేసుకుని ఏసీబీ అధికారులు సమకూర్చిన కెమికల్ నోట్లను తీసుకుని వెళ్లి కార్యాలయం లోపలికి వెళ్లారు. డబ్బులు ఇచ్చే ప్రయత్నం చేయగా ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ కృష్ణమోహన్‌రావు కార్యాలయంలో డబ్బు తీసుకునేందుకు నిరాకరించాడు. 'ముందు బయటకు వెళ్లు నేనే బయటకు వస్తాను' అంటూ చెప్పి పంపాడు. దాంతో చేసేదేమీ లేక ఖాదర్‌బాషా డబ్బుతో బయటకు రాగా ఇదేంటి కేసు అడ్డం తిరిగిందని ఆ ప్రాంతంలో నిఘా వేసిన ఏసీబీ అధికారులు కొద్దిసేపు గందరగోళానికి గురయ్యారు. సుమారు 4.30 ప్రాంతంలో కృష్ణమోహన్‌రావు కార్యాలయం నుంచి బయటకు వచ్చి వెనుక వైపునకు వెళ్ళి మూత్ర విసర్జన చేస్తూ సిగరేట్ తాగుతూ ఖాదర్‌బాషాను అక్కడికి పిలిచాడు. దాంతో అతను రూ.35వేలను కృష్ణమోహన్‌కు అందించగా వంటనే ఆ డబ్బును వెనుక పాకెట్‌లో పెట్టుకున్నాడు. ఆ ప్రాంతంలో సాధారణ ప్రజలలాగా ఉన్న ఏసీబీ డీఎస్పీ సోమన్న, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆ వెంటనే అతని చేతులకు ప్యాంటు జేబుకి కెమికల్ టెస్టులు నిర్వహించగా పాజిటివ్‌గా తేలడంతో అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. తొలి నుంచి కృష్ణమోహన్‌రావు రైటర్లతో డాక్యుమెంట్ వరకు రాయించుకోండని, పైన ఇచ్చే లంచాలు నేరుగా తనతోనే మాట్లాడుకుని తనకే ఇవ్వాలని డిమాండ్ చేసేవాడని, చాలా సందర్భాలలో ఇలాగే తీసుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. డాక్యుమెంట్ రైటర్ల ద్వారా తీసుకుంటే వారికి కూడా లంచం డబ్బులో కొంత ముట్టజెప్పాల్సి వస్తుందని, నేరుగా తీసుకుంటే ఎవరికీ ఇవ్వాల్సిన పని లేదన్న భావనతో ఆయన ఇలా వ్యవహరించేవాడని తెలియవచ్చింది. కృష్ణమోహన్‌రావు గిద్దలూరుకు బదిలీ అయి వచ్చినప్పటి నుంచి భారీ ఎత్తున లంచాలు డిమాండ్ చేసేవాడని, వారితో వీరితో చెప్పిస్తే కొంత తగ్గిస్తాడే తప్ప చివరకు పాపం పండిందని ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఐదారు నెలల్లో రిటైర్డ్ కాబోతున్న కృష్ణమోహన్‌రావు చివరన ఏసీబీ వలలో చిక్కుకోగా గత నాలుగైదు రోజులుగా సెలవులో ఉన్న ఈయన గురువారం ఉదయమే విధుల్లోకి వచ్చి చివరకు జైలు పాలయ్యాడు. ఇటీవల కాలంలోనే కృష్ణమోహన్‌రావు తాను ఇంట్లో ఉన్న సమయంలో రాత్రివేళ కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అతనిపై దాడి చేసి గాయపరిచారు. ఈ దాడికి గల కారణాలు, దాడి చేసింది ఎవరో కూడా తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలోనే తాజాగా లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడం చూస్తుంటే ఈ రెండు ఘటనలకు ఏమైనా సంబంధం ఉందా లేదా వేర్వేరు సంఘటనలా అని పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు.



మాట్లాడుతున్న డీఎస్పీ సోమన్న

● వరుసగా 7వ కేసు

గిద్దలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ దాడి జరిగినట్లు వార్తలు రావడంతో గిద్దలూరు ప్రాంతంలోని అవినీతి ఉద్యోగుల గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. గతంలో ఇలాగే ఇద్దరు రెవెన్యూ సర్వేయర్లు, మున్సిపల్ మేనేజర్, టౌన్ ప్లానింగ్ అధికారి, పోలీసు శాఖలోని హెడ్ కానిస్టేబుల్, రైల్వే ఇంజనీర్ ఏసీబీ కేసుల్లో లంచం తీసుకుంటూ పట్టుబడగా తాజాగా ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ అడ్డంగా బుక్కయ్యారు. గతంలో కూడా అవినీతి ఆరోపణలు రావడంతో గిద్దలూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడి చేసినప్పటికీ అప్పట్లో ఏమీ దొరకకపోవడంతో విచారించి వెళ్ళిపోయారు. మొత్తం మీద ఏసీబీ దాడి పట్టణంలో సంచలనం సృష్టించింది.

అనారోగ్య బాధితులకు అండగా సీఎంఆర్‌ఎఫ్

అవీఇవీ

టంగుటూరు, కొండపి, జూలై10 (ఆంధ్రజ్యోతి): ఆనారోగ్య బాధితులకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్ నిలుస్తున్నదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. మంత్రి స్వామి తూర్పు నాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 57 మందికి బాధితులకు 27 లక్షల రూపాయల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా మంత్రి స్వామి లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని కార్యక్రమాలు చేపడుతున్నదన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యసాయంతోపాటు ప్రైవేటు వైద్యశాలల్లో వైద్య సాయం పొందిన వారికి కూడా సీఎం చంద్రబాబు ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. చంద్రబాబుకు పేదలు అండగా నిలవాలని మంత్రి కోరారు.



చెక్కులు పంపిణీ చేసిన మంత్రి స్వామి

క్షయ రహిత సమాజం కోసం పాటుపడాలి



ర్యాలీలో పాల్గొన్న ఎంఎల్‌ఏ బీఎన్

నాగులుప్పలపాడు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): క్షయ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ కోరారు. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం నాగులుప్పలపాడులో నిర్వహించిన టీబీ ముక్త్ అభియాన్ అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్షయ వ్యాధిపై అవగాహన కలిగిఉండాలని సూచించారు. ఇందుకోసం అనుమానితులు వైద్యపరీక్షలు చేయించుకోవాలని కోరారు. క్షయ నిర్మూలన అధికారి సాయిచరణ్మయి, సూపర్‌వైజర్ చంద్రమౌళి, శౌరయ్య, ఎన్‌ఎం కె.వినోలియా, టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, సర్పంచ్ మందా హెప్సీబా, ఎంపీటీసీ మారెళ్ల మహాలక్ష్మి, నాయకులు మారెళ్ల వెంకటశేషయ్య, కిరణ్, జనసేన నాయకులు కొంజేటి ధనుష్, సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా..

(5వపేజీ తరువాయి)

నరసింహారెడ్డి... కనిగిరి మండలం కంచర్లవారిపల్లి జడ్పీ హైస్కూలులో, కనిగిరి నగర పంచాయతీలోని హైస్కూలులో పాల్గొన్నారు.

- సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ నాగులుప్పలపాడు జడ్పీ హైస్కూలులో పాల్గొన్నారు.
- మార్కాపురంలోని జడ్పీ హైస్కూలులో జరిగిన కార్యక్రమంలో అక్కడి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, సబ్‌కలెక్టర్ త్రినాగ్‌లు పాల్గొన్నారు.
- కొమరోలు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ఎం.అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.
- కొత్తపట్నం మండలం ఈతముక్కల జడ్పీ హైస్కూలులో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జీ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ పాల్గొన్నారు.
- సింగరాయకొండలోని గురుకుల పాఠశాలలో ఎస్పీ ఏఆర్ దామోదర్ పాల్గొన్నారు.
- దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ పాల్గొన్నారు.
- త్రిపురాంతకం మండలం దూపాడులోని గురుకుల పాఠశాలలో వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు పాల్గొన్నారు.
- ఒంగోలులోని పీవీఆర్ బాలికల పాఠశాలలో పీటీఎంకు టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ హాజరయ్యారు. ప్రతి పాఠశాలలోనూ ఈ సందర్భంగా తల్లుల పేరుతో ప్రతి విద్యార్థీ ఒక మొక్కను నాటేలా ఏర్పాటు చేసి నాటించారు.

విషాదాంతం

(5వపేజీ తరువాయి)

మధ్యన తిరగడం గమనిస్తే బాలుడిని దుండగులు చుట్టుపక్కల ఎక్కడో దాచి ఉంచినట్లు తెలుస్తోంది. మార్కాపురం డీఎస్పీ నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు 10 బృందాలుగా ఏర్పడి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టడంతో కిడ్నాపర్లకు దిక్కుతోచక గురువారం తెల్లవారుజామున బాలుడిని పొలంలో బాలుడి మొలతాడుతో కాళ్లు కట్టి గొంతు పిసికి చంపి పడవేసి వెళ్లినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే లక్షిత్ మృతదేహం వద్దకు గురువారం ఒంగోలు నుంచి వచ్చిన పోలీసు జాగిలం పరిసరాలను వాసన చూసి నేరుగా నల్లవాగు దగ్గరకు వచ్చి తిరిగి వెనుదిరిగింది. పోలీసులు లక్షిత్ పోస్టు మార్టం పొలాల్లోనే చేసి తల్లిదండ్రులకు అప్పగించారు.

బాలుడి మృతిపై ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి విచారం

కంభం మండలం లింగోజీపల్లి గ్రామానికి చెందిన లక్షిత్ అనుమానాస్పద మృతిపై ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాలుడు అదృశ్యం కావడం, గురువారం శవమై కనిపించడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఘటనా స్థలానికి చేరుకుని బాలుడి మృతదేహాన్ని పరిశీలించి ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై సీఐ మల్లికార్జున నుంచి వివరాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధ్యులపై చట్టపరంగా శిక్ష పడేలా చూస్తామని తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్, ఆయాల నిర్లక్ష్యమే బలి తీసుకుంది

అంగన్‌వాడీ టీచర్ గోవిందమ్మ, ఆయా క్రిష్ణకుమారి నిర్లక్ష్యమే తన కొడుకును బలి తీసుకుంది. ఉదయం 9.30కు తన చెల్లెలు లక్షిత్‌ను అంగన్‌వాడీ స్కూలులో వదిలిపెట్టి వచ్చింది. 11 గంటలకు బాబు బయటకు వెళ్తున్నా వారు పట్టించుకోకపోవడం వల్లే ఎవరో ఎత్తుకెళ్లి చంపారు.

– సురేఖ, లక్షిత్ తల్లి

ప్రాణవాయువు కోసం ప్రపంచ సైకిల్ యాత్ర..!

కోయంబత్తూరుకు చెందిన ముత్తు సెల్వన్ సాహసం

సోషల్ మీడియాలో రీల్స్ కోసం పోటీ పడే నేటి సమాజంలో పర్యావరణ పరిరక్షణ, ప్రాణవాయువు కోసం ప్రపంచ సైకిల్ యాత్రకు శ్రీకారం పలికాడు తమిళనాడుకు చెందిన యువకుడు ముత్త సెల్వన్. 2021 డిసెంబరు 21వ తేదీన కోయంబత్తూరు నుంచి అతను చేపట్టిన సైకిల్ యాత్ర అనేక దేశాలు, ప్రాంతాలను చుట్టివస్తూ గురువారం ఒంగోలు చేరింది. ఈ సందర్భంగా ముత్తసెల్వన్ మీడియాతో మాట్లాడుతూ ఎంబీఏ చదువుకుని బయో ఇంజనీర్‌గా పనిచేస్తున్న తాను, కోవిడ్ సమయంలో తన ఇద్దరు ప్రాణస్నేహితులు చనిపోయారన్నారు. ఆ దృశ్యాలను కళ్లతో చూసిన ఆ యువకుడు ప్రతి ఒక్కరికీ ప్రాణవాయువు అవసరమని గుర్తించినట్లు చెప్పారు. ఈ కారణంగా సైకిల్ ర్యాలీ ఫర్ ఆక్సిజన్ పేరుతో ర్యాలీ చేపట్టినట్లు సెల్వన్ తెలిపారు. ఇప్పటి వరకు సుమారుగా 23 రాష్ట్రాలకు పైగా యాత్రను పూర్తి చేయగా, ఇంకో పదకొండు రాష్ట్రాల్లో యాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. 576వ జిల్లాగా ఒంగోలు అడుగుపెట్టడం సంతోషంగా ఉందన్నారు. ఈ యాత్రలో గిన్నిస్ రికార్డు సాధించడమే లక్ష్యమని చెప్పారు. ఐదేళ్లలో 8 దేశాలలో 45 వేల కిలోమీటర్ల దూరం ప్రయాణించి, 2027 డిసెంబరు 21 నాటికి ఢిల్లీలోని ఇండియా గేట్ వద్ద యాత్రను ముగించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి రాత్రి 8గంటల వరకు ప్రయాణిస్తున్నట్లు చెప్పారు. యాత్రలో ఇప్పటివరకు ఎనిమిదిసార్లు రోడ్డు ప్రమాదాలు జరిగినా వెనుకడుగు వేయలేదన్నారు. యాత్రలో భాగంగా నేపాల్, బంగ్లాదేశ్, ఇండియాలో ప్రయణించానని, వెళ్లిన ప్రతి ప్రాంతంలోని మండలాలలోని ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు పెంపకం, ఆక్సిజన్ ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. యాత్ర



ముగిసే నాటికి 11లక్షల 11వేల, 11 మొక్కలు నాటడమే లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా ఒంగోలులో శాసనసభ్యులు దామచర్ల జనార్దన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. దీంతో దామచర్ల ముత్తు సెల్వంకు తగిన సహకారం అందించారు.

– ఒంగోలు, కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)

కొండపి ఏఎంసీ చైర్మన్‌గా కర్ణా తిరుపతమ్మ

- వైస్ చైర్మన్‌గా మార్బూరి వెంకటేశ్వరరావు
- మరో 13 మంది మెంబర్లకు ప్రతిపాదనలు
- ప్రభుత్వ ప్రకటన లాంఛనమే



తిరుపతమ్మ, వెంకటేశ్వరరావు

కొండపి, జూలై 10, (ఆంధ్రజ్యోతి) : కొండపి ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, మరో 13 మంది సభ్యుల పేర్లను కొండపి నియోజకవర్గ నాయకులు ఏకాభిప్రాయంతో ప్రతిపాదించారు. ఆ మేరకు జాబితాను మంత్రి స్వామి, మారిటైం బోర్డు చైర్మన్ సత్యలు ప్రభుత్వానికి పంపారు. ఇక ప్రకటన లాంఛనమేనని పార్టీ వర్గాలు తెలిపాయి. కొండపి ఏఎంసీ చైర్మన్‌గా పొన్నలూరు మండలానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు కర్ణా కోటిరెడ్డి భార్య తిరుపతమ్మ పేరును అధిష్టానం ప్రతిపాదించింది. అదేవిధంగా వైస్ చైర్మన్‌గా బీసీ వర్గానికి చెందిన కొండపి మండలం పెరిదేపి గ్రామానికి చెందిన మార్బూరి వెంకటేశ్వరరావుతోపాటు మరో 13 మందిని మెంబర్లుగా ప్రతిపాదించారు. కర్ణా కోటిరెడ్డి పొన్నలూరు మండలంలోని ఫైరెడ్డిపాలెం సర్పంచ్‌గా, ఎంపీటీసీ మెంబర్‌గా, కొండపి ఏఎంసీ మెంబర్‌గా గతంలో పనిచేశారు. కోటిరెడ్డి భార్య తిరుపతమ్మ గడచిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఫైరెడ్డిపాలెం పంచాయతీ సర్పంచ్‌గా పోటీ చేసి ఓడిపోయారు. అదేవిధంగా వైస్ చైర్మన్ మార్బూరి వెంకటేశ్వరరావు పెరిదేపి గ్రామానికి చెందిన దివంగత టీడీపీ నాయకుడు మార్బూరి శేషయ్య కొడుకు. శేషయ్య సేవలకు గుర్తింపుగా వెంకటేశ్వరరావుకు వైస్‌చైర్మన్ పదవిని కేటాయిస్తూ అధిష్టానం ప్రతిపాదించింది.

మెంబర్లుగా... నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 13 మందిని మెంబర్లుగా ప్రతిపాదించారు. జె. శ్రావణి, మల్లవరపు శ్రీదేవి. బి. ఏసుదాసు, జి. నాగరాజు, ఎస్‌కె. హబీబా, ఉన్నం బసవయ్య, సిహెచ్. వెంకటేశ్వర్లు, సారెడ్డి సాయమ్మ, కె. శ్రీరంగనాయకులు, ఎం. మల్లికార్జునరావు, తోకల భారతి, డి. నరసమ్మ, కంచర్ల శ్రీనులను మెంబర్లుగా ప్రతిపాదించారు. నియోజకవర్గంలో నాయకుల ఏకాభిప్రాయం తర్వాత కొండపి ఏఎంసీ కమిటీ ప్రతిపదనలు మూడు నెలల క్రితం పార్టీకి, రాష్ట్ర అధినాయకత్వానికి పంపారు. అనేక తర్జనభర్జనల అనంతరం, వివిధ సమీకరణాల వడపోత అనంతరం ఈ జాబితాను రూపొందించారు. ప్రభుత్వ ప్రకటన త్వరలో వెల్లడికానుందని ఆపార్టీ నియోజకవర్గ బాధ్యులు అంటున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం



దగ్ధమవుతున్న పెంకుటిల్లు

నాగులుప్పలపాడు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధమైన ఘటన ఈదుమూడిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఈదుమూడి గ్రామంలోని శివాలయం పక్కన కొణికి కోటేశ్వరరావు ఇంట్లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న పూసపాటి కృష్ణమూర్తి అద్దెకు నివసిస్తున్నారు. గురుపౌర్ణిమ సందర్భంగా గురువారం ఉదయం కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు ఉప్పుగుండూరులోని సాయిబాబా దేవాలయానికి వెళ్లారు. అయితే మధ్యాహ్న సమయంలో కృష్ణమూర్తి ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. స్థానికులు వచ్చి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించగా పెద్ద ఎత్తున ఎగిసి పడటంతో సమాచారం అందుకొన్న ఒంగోలు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో కృష్ణమూర్తికి చెందిన 9 సవర్ల బంగారు ఆభరణాలు, నగదు రూ.50,000, మోపెడ్ వాహనం, ఇంట్లోని సామగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. కట్టుబట్టలతో మిగిలినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.



ర్యాలీలో ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, న్యాయవాదులు

కక్షిదారుల చేతుల్లోనే పరిష్కారం

మధ్యవర్తిత్వ ప్రయోగంతో వినూత్నంగా ముందుకు

ఒంగోలులో 1కే రన్‌ను ప్రారంభించిన జిల్లా న్యాయాధికారి భారతి

ఒంగోలు కలెక్టరేట్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : కక్షిదారులు తమ సమస్యలను తామే పరిష్కరించుకొనే అవకాశాన్ని కల్పించే వినూత్న ప్రక్రియ మధ్యవర్తిత్వం అని జిల్లా ప్రధాన న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఏ భారతి చెప్పారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం 1కే రన్‌ను భారతి ప్రారంభించారు. తొలుత న్యాయసేవాధికారి సంస్థ ఏర్పాటు చేసిన మీడియేషన్ టూ నేషన్ స్టాల్ కూడా ఆమె చేతుల మీదుగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి మాట్లాడుతూ ఒక తటస్థ వ్యక్తికి, తన ప్రత్యేక వ్యక్తికి సంధాన నైపుణ్యాన్ని ఉపయోగించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మధ్యవర్తిత్వం మీద కక్షిదారులకు, సామాన్య ప్రజలకు అవగాహన కల్పించేందుకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఏడో అదనపు జిల్లా న్యాయమూర్తి టి.రాజావెంకటాద్రి మాట్లాడుతూ జిల్లాలో 59 మంది మీడియేటర్లను నియమించామన్నారు. వీరి ద్వారా వివిధ స్థాయిల్లో ఉన్న వ్యాజ్యాల పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తారని తెలిపారు. ర్యాలీలో న్యాయవాదులతోపాటు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు. అనంతరం చర్చి సెంటర్‌లో న్యాయవాదులతో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు జిల్లా న్యాయమూర్తులు టి. రాజ్యలక్ష్మి, ఎ. పూర్ణిమ, పి. లలిత, జి. దీన, కే శైలజ, సీనియర్ సివిల్ న్యాయమూర్తులు ఎస్. హేమలత, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొడ్డు భాస్కరరావు, ఒంగోలు డీఎస్పీ ఆర్. శ్రీనివసరావు, సీనియర్ న్యాయవాదులు ఉడతా రవికుమార్, సిరిగిరి సరళ, దేవకుమారి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ బలోపేతానికి ప్రభుత్వం కృషి

నాణ్యమైన పుస్తకాలు, యూనిఫాంతోపాటు సన్నబియ్యంతో భోజనం

ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ



విద్యార్థులతో జేసీ గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు

కొత్తపట్నం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంపూర్ణ వికాసం, సంస్కారం అలవరుస్తూనే విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ చెప్పారు. మండలంలోని ఈతముక్కల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన మెగా పేరెంట్ టీచర్స్ మీట్ 2.0 కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా పాఠశాల ఆవరణలోని సరస్వతీ విగ్రహానికి పూలమాలవేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటారు. పేరెంట్-స్టూడెంట్ కోసం ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌లో ఆయన ఫొటో దిగారు. అనంతరం జరిగిన ఆత్మీయ సమావేశంలో గోపాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు పుస్తకాలు, యూనిఫాంతోపాటు సన్నబియ్యంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని కూడా వండి వడ్డిస్తున్నట్లు చెప్పారు. తాను కూడా ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రభుత్వ పాఠశాల, కాలేజీలోనే చదువుకున్నానన్నారు. పాఠశాల స్థాయిలో ఉన్నప్పుడు రోజు ఐదు కిలోమీటర్లు నడిచి వెళ్లేవాడినని ఆయన గుర్తు చేశారు. గతంతో పోల్చి చూస్తే ప్రస్తుత పరిస్థితులు ఎంతో మెరుగ్గా ఉన్నట్లు చెప్పారు. ఎలాంటి బంధుత్వం లేకపోయినా విద్యార్థుల ఉన్నతిని ఆశించేది గురువులేనన్నారు. చరిత్రలో మీకంటూ ఒక పేజీ ఉండేలా మీ జీవితాలను మీరే తీర్చిదిద్దుకోవాలని కలెక్టర్ చెప్పారు. గతవిద్యాసంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన ఆకురాతి గీతిక, ఆమె తల్లిదండ్రులను కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో కొత్తపట్నం మండల ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీ అధికారి వెంకట నాయుడు, ప్రధానోపాధ్యాయుడు చెంచుపున్నయ్య, తహసీల్దార్ కె.శాంతి, డిప్యూటీ ఎంపీడీవో గోపాలక్రిష్ణమూర్తి, ఎంఈవో పద్మావతి, స్కూలు మేనేజ్‌మెంటు కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పిల్లల నడవడికను గమనిస్తూ ఉండాలి

సింగరాయకొండ గురుకుల పాఠశాలలో ఎస్పీ ఏఆర్ దామోదర్

సింగరాయకొండ, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, నడవడికను నిత్యం గమనిస్తూ ఉండాలని ఎస్పీ దామోదర్ సూచించారు. స్థానిక గురుకుల పాఠశాలలో గురువారం నిర్వహించిన మెగా పెరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం) కార్యక్రమంలో ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యను బోధించే ఉపాధ్యాయులు విద్యార్థుల్లో నిక్షిప్తమైన ప్రతిభను గుర్తించి ఉన్నత లక్ష్యాలను సాధించే విధంగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రమాదేవి, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంటిని టార్గెట్ చేసిన దొంగలు

- బీరువా పగులకొట్టి రూ.1.10 లక్షల నగదు అపహరణ



దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఏఎస్సై శేషారెడ్డి

సింగరాయకొండ, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : తాళంవేసిన ఇంటిని దుండగులు టార్గెట్ చేశారు. ఇంటిలో ఎవరూ లేనిసమయంలో ఇంటి తలుపు తాళాలు పగలకొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువాతాళం పగలకొట్టి అందులో ఉన్న రూ.1.10 లక్షలు నగదు, రెండు జతల వెండి పట్టీలను అపహరించుకొని పోయారు. ఈ సంఘటన స్థానిక ప్రశాంతి హాలు ఎదురుగా ఉన్న బజారులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. సింగరాయకొండ ప్రశాంతి హాలు సెంటర్‌గా ఉన్న వీధిలో పఠాన్ రఫీ వెల్డింగ్ పనిచేస్తూ జీవనం గడపుతూ ఉంటారు. మోహరం సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ఈతముక్కల బంధువుల ఇంటికి వెళ్లారు. మరలా తిరిగి పఠాన్ రఫీ బుధవారం సాయంత్రం ఒక్కరే ఇంటికి వచ్చారు. అనంతరం స్నానంచేసి పనిమీద బయటకు వెళ్లారు. గురువారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చారు. గేటుకు వేసిన తాళం పగలకొట్టి ఉండటంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. లోపలివెళ్లి చూడగా ఇంటితాళం, బీరువాతాళం పగలకొట్టి అందులో ఉన్న నగదు రూ.1.10 లక్షలు, వెండి పట్టీలు దోచుకెళ్లారు. సమాచారం అందుకొన్న పోలీసులు డ్వాగ్ స్క్వాడ్, వేలిముద్రల సేకరణ బృందాలను రంగంలోకి దింపారు. పఠాన్ రఫీ ఫిర్యాదు మేరకు ఏఎస్సై శేషారెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమం.. అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు



ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న ఎరిక్షన్ బాబు, నాయకులు

ఎర్రగొండపాలెం రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సంక్షేమం అందించడం, అమరావతిని అభివృద్ధి చేసి ప్రతి కుటుంబంలో ఆనందాన్ని నింపడమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ వైపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు. మండలంలోని కాశికుంట తాండా పంచాయతీ పరిధిలోని కాశికుంట తాండా, పిల్లికుంట తాండా గ్రామాలలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎరిక్షన్‌బాబు పాల్గొన్నారు. ఆయన ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంచిపెడుతూ ఏడాదిలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. పథకాలు పొందిన లబ్ధిదారుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. పంచాయతీ భవనం, స్కూల్, విద్యుత్, నీరు, రోడ్లు, నీటి కుంటలు, తీగలేరు, వెలిగొండ తదితర సమస్యలను అర్జీల రూపంలో స్థానికులు ఎరిక్షన్‌బాబుకు అందజేశారు. వాటిపై ఆయన స్పందిస్తూ సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు, గ్రామ సర్పంచ్ ఎంసీహెచ్ పెద్ద మంత్రు నాయక్, క్లస్టర్ ఇన్‌చార్జి షేక్ మస్తాన్‌వలి, పట్టణ అధ్యక్షుడు పెరుమాళ్ల మల్లికార్జునరావు, నాయకులు కంచర్ల సత్యనారాయణ గౌడ్, వేగినాటి శ్రీను, చిట్యాల వెంగళరెడ్డి, పేరం రమణా రెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విచారణకు గడువు కోరిన ముప్పా సురేష్ భార్య

ఒంగోలు క్రైం, జూలై10(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత వీరయ్యచౌదరి హత్యకు పథకం హైదరాబాద్‌లోని ముప్పా సురేష్ ఇంట్లో జరిగిందని పోలీసులు విచారణలో వెల్లడైంది. దీంతో కుట్రకు ప్రణాళిక రూపొందిస్తున్న సమయంలో సురేష్ భార్య అనిత కూడా ఉందంటూ వీరయ్యచౌదరి కేసులో ఉన్న నిందితులు ద్వారా పోలీసులు సమాచారం సేకరించారు. ఈ నేపథ్యంలో గురువారం ఒంగోలు డీఎస్పీ కార్యాలయంలో పోలీసు విచారణకు హాజరుకావాలంటూ అనితకు నోటీసులు అందజేశారు. అయితే తాను ఈనెల 10న విచారణకు హాజరుకాలేనని ఆమె లిఖితపూర్వకంగా ఒంగోలు డీఎస్పీతోపాటుగా డీజీపీకి కూడా లేఖ రాశారు. తనకు 10 రోజులు గడువు కావాలని కోరారు. పోలీసులు తిరిగి మరోసారి నోటీసు ఇచ్చే అవకాశం ఉంది. ఇదే క్రమంలో వీరయ్యచౌదరి హత్య కేసులో ప్రధాన సూత్రధారి అయిన ముప్పా సురేష్ ఇప్పటికీ పోలీసులకు దొరకలేదు. హైకోర్టులో బెయిల్ కోసం ప్రయత్నాలు చేసుకుంటున్నట్లు సమాచారం.

ఒకే రకమైన పొగాకు బేళ్లు తెచ్చుకోవాలి

పొదిలి వేలం అధికారి గిరిరాజకుమార్



పొగాకు బేళ్లను పరిశీలిస్తున్న వేలం నిర్వహణాధికారి గిరి రాజకుమార్

తర్లుపాడు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : పొదిలి పొగాకు బోర్డుకు ఒకే రకమైన గ్రేడ్ పొగాకు బేళ్లను తెచ్చుకోవాలని రైతులకు పొదిలి వేలం నిర్వాహణ అధికారి జి.గిరి రాజకుమార్ సూచించారు. రావిపాడు, జంగంకుంట్ల, కొండేపల్లి, మాలింతపాడు, నాగులవరం, తర్లుపాడులలో పొగాకు రైతులతో ఆయన సమావేశం నిర్వహించి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. రైతులు ఒకే రకమైన బేళ్లు తెచ్చుకుంటే ప్రస్తుతం మార్కెట్ ధరలు ఆశాజనకంగా ఉన్నాయన్నారు. గతం కంటే ప్రస్తుతం మార్కెట్ పుంజుకుందని చెప్పారు. మాడులో పచ్చ కలవకుండా ఉండాలని, ప్రస్తుతం బొగులు మాడు, మొద్దు పచ్చను వేలానికి తీసుకురావద్దని గిరిరాజకుమార్ సూచించారు. అనంతరం పొగాకు బేళ్లను పరిశీలించారు. ఆయన వెంట సూపర్‌వైజర్లు హరిచంద్ర ప్రసాద్, ఎస్‌కే బాషా ఉన్నారు.



మాగుంటతో మాట్లాడుతున్న సీపీఐ రామకృష్ణ

మాగుంటను కలిసిన సీపీఐ కార్యదర్శి రామకృష్ణ

ఒంగోలు కలెక్టరేట్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డిని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక రామ్‌నగర్‌లోని మాగుంట కార్యాలయంలో గురువారం ఇరువురు కలిసి పలు అంశాలపై చర్చించుకున్నారు. ఒంగోలులో వచ్చే నెలలో జరగనున్న సీపీఐ రాష్ట్ర మహాసభల అంశాలపై మాట్లాడుకున్నారు. అనంతరం జిల్లాలోని పలు అంశాలపై వారిద్దరి మధ్య చర్చకు వచ్చాయి. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పాల్గొన్నారు.

కొండపి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఐజీ



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ

కొండపి, జూలై10 (ఆంధ్రజ్యోతి) : సాధారణ తనిఖీల్లో భాగంగా గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ గురువారం మధ్యాహ్నం కొండపి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. రెండు నెలల కిందట కార్యక్రమం షెడ్యూల్ ఇచ్చిన ఐజీ పని ఒత్తిడిలో కొండపి రాలేదు. గురువారం కొండపిలోని పోలస్ స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్‌లోని గదులు, స్టేషన్ ఆవరణను పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో పడుబడిన క్వార్టర్స్ విషయంపై ఐజీ ఆరా తీశారు. పోలీసు అధికారులకు ఈసందర్భంగా పలు సూచనలు చేశారు. ఆయన వెంటఎస్పీ ఏఆర్ దామోదర్, కనిగిరి డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్, కొండపి సర్కిల్ పరిధిలోని ఎస్సైలు అనుక్, రమేష్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

కనిగిరి, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : పక్కా ప్రణాళికతో పెండింగ్ కేసులను త్వరతిగతిన పరిష్కరించాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి అన్నారు. స్థానిక సర్కిల్ పరిధిలోని హనుమంతునిపాడు స్టేషన్‌ను గురువారం ఎస్పీ దామోదర్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఐజీ స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు, ప్రస్తుత స్థితిగతులపై ఆరా తీశారు. పలు రికార్డులను పరిశీలించారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాల కట్టడికి ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్టవేసేలా పటిష్టంగా బీట్ సిస్టమ్‌ను నిర్వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లలో నిర్వహిస్తున్న ఎఫ్ఐఆర్ ఇండెక్స్, కేసు డైరీలను, రిజిస్టర్లను, పలు రికార్డులను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ప్రతి అంశాన్ని రికార్డులలో నమోదు చేసుకోవటం తప్పనిసరిగా పాటించాలని, ఈ విషయంలో అలసత్వం వద్దని హెచ్చరించారు. స్టేషన్‌ల పరిధిలోని శాంతి భద్రతల పరిస్థితి, నమోదైన కేసుల వివరాలను తెలుసుకుని వాటి స్థితిగతులపై ఆరా తీశారు. పెండింగ్ కేసుల దర్యాప్తు, పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ ఉన్న కేసుల పూర్వాపరాలపై విచారించి వాటికి కారణాలపై సమీక్షించారు. కేసుల విచారణలో చురుకుగా వ్యవహరించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తుల యొక్క వేలి ముద్రలు సేకరించి వారి పాత నేరచరిత్రను విచారించాలన్నారు. ప్రతి పోలీస్ పరిధిలోని ప్రజలకు శక్తి యాప్ గురించి, శక్తి బృందాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పోలీస్ సహాయన్ని పొందే క్రమంలో ధైర్యంగా తెలియచేసేలా ఫ్రెండ్లీ పోలీసింగ్ అలవాటు చేసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో పల్లెనిద్ర చేస్తూ సమాచార వ్యవస్థను బలోపేతం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో అల్లర్లకు తావు లేకుండా చూడాలన్నారు. జాతరలు, ఉత్సవాల సమయంలో పర్యవేక్షణ ముమ్మరం చేయాలని సూచించారు. ఐజీ వెంట డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్, కనిగిరి, పామూరు సీఐలు ఖాజావలి, భీమానాయక్, ఎస్ఐలు టీ శ్రీరాం, ప్రేమ్‌కుమార్, అనోక్, మాధవరావు, కోటయ్య పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులు

కె.బిట్రగుంట కేజీబీవీలో జరిగిన మెగా పీటీఎంలో మంత్రి స్వామి

కొండపి జీజేసీలో పాల్గొన్న మారిటైం బోర్డు చైర్మన్ సత్య



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి స్వామి

జరుగుమల్లి, కొండపి, జూలై10 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు, మెరుగైన విద్య విద్యాశాఖామంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో అందుతున్నదని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. మండలంలోని కె.బిట్రగుంట కేజీబీవీలో గురువారం జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్‌లో పాల్గొన్ని ప్రసగించారు. పేదల విద్యార్థులు చదువులకు దూరం కాకూడదనే సదుద్దేశంతో హాస్టల్స్‌లో కూటమి ప్రభుత్వం మరిన్ని వసతులు ఏర్పాటు చేసిందన్నారు. గురుకులాలు, కేజీబీవీలు, హాస్టల్స్‌లో వీలైనంత వరకు సీట్లు పెంచి పేద విద్యార్థులకు చదువు చెప్పాలనేది లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఈసందర్భంగా స్కూల్ ఆవరణలో మంత్రి మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రి భోజనం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీఈవో కిరణ్‌కుమార్, ఎంపీపీ బెల్లం నిర్మల, మాజీ ఎంపీపీ బెల్లం సత్యన్నారాయణ, తహసీల్దార్ పి. మురళి, ప్రిన్సిపాల్ స్రవంతి, టీడీపీ మండల అధ్యక్షుడు రవీంద్రబాబు పాల్గొన్నారు.

కొండపిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



బహుమతిని అందజేస్తున్న సత్య

విద్యార్థుల విద్యా ప్రగతితోపాటు, వారి ప్రవర్తన, నడవడికపై విద్యార్థుల తల్లితండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తుండాలని ఏపీ మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. మెగా పీటీఎం కార్యక్రమం సందర్భంగా ఆయన కొండపిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు, వారి తల్లితండ్రులతో సత్య మాట్లాడారు. తల్లులకు తాడులాగుడు, కుర్చీలాట పోటీలు నిర్వహించి విజేతలకు మెమొంటోలు అందజేశారు. విద్యార్థులతో తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించారు. తూర్పు నాయుడుపాలెంలోని జడ్పీస్కూల్‌లో మెగా పీటీఎం కార్యక్రమంలో సత్య పాల్గొని సరస్వతీదేవి విగ్రహానికి పూలమాలవేశారు. ఈసందర్భంగా తల్లులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.



మాట్లాడుతున్న పీడీ ప్రసాద్

- కె.ఉప్పలపాడు జడ్పీ స్కూల్‌లో జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌లో హౌసింగ్ పీడీ పెరుగు ప్రసాద్ పాల్గొన్నారు. పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. హెచ్‌ఎం సుసన్నకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

- మర్రిపూడి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ఎంపీపీ వాకా వెంకటరెడ్డి మాట్లాడారు.

- పొన్నలూరు: విద్య విజ్ఞానాన్ని పెంచడమేకాకుండా సమాజంలో గుర్తింపు తీసుకొస్తుందని తహసీల్దార్ వి.పుల్లారావు అన్నారు. మెగా పీటీఎం కార్యక్రమాన్ని పొన్నలూరులో ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ రాజేంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించగా, తహసీల్దార్ సహా పలువురు నేతలు పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

టంగుటూరు: మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ సందర్భంగా టంగుటూరులోని వెంకటాయపాలెం రోడ్డులోని మహాత్మా జ్యోతీరావుపూలే బీసీ గురుకుల పాఠశాలలో గురువారం ఉదయం కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ పి.స్రవంతి అధ్యక్షతన జరిగిన సభలో టంగుటూరు మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు పాల్గొని మాట్లాడారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

సింగరాయకొండ: విద్యార్థుల మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ శివకుమారి సూచించారు. మూలగుంటపాడు అమృత జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన మెగా పీటీఎంలో సీఐ అవగాహన కల్పించారు. ఎక్సైజ్ ఎస్సై టి.రాజశేఖర్, ప్రిన్సిపాల్ బాలవెంకట్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య

- టూరిజం బోర్డు చైర్మన్ బాలాజీ
- పండుగలా మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్‌లు
- కళకళలాడిన పాఠశాలలు



ఒంగోలులో విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందిస్తున్న చైర్మన్ బాలాజీ



చిలకపాడులో రూ.85వేల నగదును అందిస్తున్న దాతలు



మద్దిపాడులో తాడులాగుడు పోటీని ప్రారంభిస్తున్న నాగేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నట్లు రాష్ట్ర టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ పేర్కొన్నారు. గురువారం ఒంగోలులోని పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్‌కు హెచ్‌ఎం రాజ్యలక్ష్మి అధ్యక్షత వహించారు. టూరిజం బోర్డు చైర్మన్ బాలాజీ, నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ నూకసాని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యనందించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి విద్యార్థిని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బూట్లు, నోట్ పుస్తకాలతోపాటు, బ్యాగులు, మధ్యాహ్న భోజనం అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి సర్టిఫికెట్లను బహూకరించారు.

నగరంలో ఉత్సాహంగా పీటీఎంలు

ఒంగోలు విద్య : ఒంగోలు నగరంలోని ప్రభుత్వ, మునిసిపల్, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం మెగా టీచర్స్ అండ్ పేరెంట్స్ సమావేశాలు ఉత్సాహభరితంగా సాగాయి. ఆయా పాఠశాలలను మామిడి తోరణాలతో, పూలతో అందంగా అలంకరించారు. స్థానిక పీవీఆర్ బాలుర పాఠశాలలో హెచ్‌ఎం రాధిక ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కార్పొరేటర్లు శైలజ, శాండిల్య, టీడీపీ నగర అధ్యక్షుడు బండారు మదన్‌లు పాల్గొన్నారు.

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.ఆంజనేయులు హాజరుకాగా పాఠశాలల్లో పిల్లలు తమ తల్లులకు పాదాభివనందనం చేసి పూలతో పూజించారు. తల్లులు తమ పిల్లలకు పాఠశాలలో ఏర్పాటు చేసిన వెజిటబుల్ పలావును తినిపించారు. సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.

- స్థానిక కోర్టు సెంటర్‌లోని మునిసిపల్ కార్పొరేషన్ పాఠశాలలో మెగా పీటీఎంను పండుగలా నిర్వహించారు. కమిషనర్ వెంకటేశ్వరరావు, ఎంఈవోలు టి.కిషోర్‌బాబు, వి.సరస్వతి, రిటైర్డ్ లెక్చరర్ తిప్పారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, హెచ్‌ఎం సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు.

- స్థానిక సంతపేట డీఆర్ఆర్ఎం మునిసిపల్ హైస్కూలులో హెచ్‌ఎం వెంకట్రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథులుగా టీడీపీ నగర అధ్యక్షుడు బండారు మదన్, టూటౌన్ సీఐ శ్రీనివాసరావు, రాంబాబు, పూర్వ విద్యార్థి కె.శివప్రసాద్ పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

- స్థానిక అంజయరోడ్డులోని ఏకేవీకే జూనియర్ కళాశాలలో గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు మండవ నాగేశ్వరరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెట్ చెంచురామయ్య, జయింట్ సెక్రటరీ అమృతవల్లి, డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ రామిరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటరెడ్డి, అధ్యాపకులు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: విద్యార్థుల భవిష్యత్తుకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బంగారు బాటలు వేస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మద్దిపాడు కడియాల యానాదయ్య పాఠశాలలో గురువారం జరిగిన మెగా పీటీఎంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు పలు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బచ్చు మాల్యాద్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు మండలంలో..

సంతనూతలపాడు: మెగా పీటీఎంను సంతనూతలపాడు జడ్పీహైస్కూల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేక అధికారి ఎస్.వరకుమార్ ముఖ్య అతిథిగా హాజరు కాగా ఎంఈవో వెంకారెడ్డి, హెచ్‌ఎం ప్రమోద తదితరులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఐ వి.అజయ్‌బాబు, తహసీల్దార్ నారాయణరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నీటిసంఘం అధ్యక్షుడు రంగనాయకమ్మ, ఎస్ఎంసీ చైర్మన్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

- పేర్నమిట్ట క్రిస్టియన్‌పాలెంలోని ఎంపీపీ స్కూల్‌లో మెగా పీటీఎంలో భాగంగా విద్యార్థులకు టీడీపీ నాయకులు కరిచేటి శ్రీనివాసరావు రూ.50వేల విలువచేసే నోటు పుస్తకాలను అందజేశారు.

- చిలకపాడు హైస్కూలులో జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వి.సింగయ్య, బి.మధుసూదనారావు, బీఎస్.చౌదరి, పి.వెంకటేశ్వర్లు ఉత్తమ విద్యార్థుల కింద రూ.85వేలను అందజేశారు. ఈ నగదును టెన్త్‌లో 500 మార్కులు దాటిన విద్యార్థులకు, 6 నుంచి 9వ తరగతి చదువుతున్న మెరిట్ విద్యార్థులకు అందజేయనున్నట్లు హెచ్‌ఎం స్వప్న తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, ఎంపీపీ విజయ, సర్పంచ్ కోమలి, నాయకులు కె.చెన్నారావు పాల్గొన్నారు.

- మంగమూరు జెడ్పీహైస్కూలులో జరిగే మెగా పీటీఎంలో ఎంపీడీవో డి.సురేష్‌బాబు హాజరై ఆటలో పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

సర్కారు స్కూళ్ల బలోపేతానికి కృషి

- ఎమ్మెల్యే విజయ్‌కుమార్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం హయాంలో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేస్తున్నట్లు ఎమ్మెల్యే బీఎన్‌విజయ్‌కుమార్ పేర్కొన్నారు. నాగులుప్పలపాడు జడ్పీ హైస్కులులో గురువారం జరిగిన మెగా పీటీఎం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కుమారి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే బీఎస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. అందులో భగంగా నూతన భవన నిర్మాణాలు, నిష్ణాతులైన ఉపాధ్యాయులతో చక్కని విద్య అందిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇంట్లో ఎందరు పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం పతకం కింద నగదు అందిస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. అనంతరం పాఠశాలలో మొక్కలను నాటారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రవి, తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్, ఎంఈవోలు రవి, రమణయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, సర్పంచ్ మందా హెప్సీబా, ఎంపీటీసీ మారెళ్ల మహాలక్ష్మి, నాయకులు మారెళ్ల వెంకటశేషయ్య, మారెళ్ల కిరణ్, ఎస్ఎంసీ చైర్మన్ అనూష, జనసేన నాయకులు కొంజేటి ధనుష్, సాయిచరణ్, రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు, ఎస్ఐ రజియాసుల్తానా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీ ప్రతిభలో ఘనంగా మెగా పీటీఎం



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ ఆయేషాబేగం


ఒంగోలు విద్య, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని శ్రీప్రతిభ జూనియర్ కళాశాలలో గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ ఆత్మీయ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీప్రతిభ జూనియర్ కళాశాలల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పీటీఎం సమావేశం వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య చక్కటి అవినాభావ సంబంధాలు పెరుగుతాయన్నారు. మరో ముఖ్యఅతిథి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆయేషాబేగం మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని హితువు పలికారు. చెడు వ్యసనాలకు లోనైతే శారీరకంగా, మానసికంగా కుంగిపోవడంతో పాటు వారి జీవితంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయన్నారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాల విముక్తి కోసం యువతతో ప్రతిజ్ఞ చేయించారు. 2024-25 విద్యాసంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో విద్యాసంస్థల వైస్‌చైర్మన్ నల్లూరి సీతతారామాంజనేయులు, సీఈవో జయప్రకాష్ నారాయణ, ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.లీనా, ఎస్ఐ అశోక్‌కుమార్, గీత, రావి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ వైస్ ఎంపీపీ మృతి



రంగారావు(ఫైల్)

నాగులుప్పలపాడు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఈదుమూడి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ కొండ్రగుంట రంగారావు(76) మృతి చెందారు. బుధవారం అర్ధరాత్రి రంగారావు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఒంగోలు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రంగారావుకు భార్య, అమెరికాలో స్థిరపడిన ఇద్దరు కుమారులు ఉన్నారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



పూర్వ విద్యార్థుల దాతృత్వం



కంప్యూటర్‌ను అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

నాగులుప్పలపాడు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థుల దాతృత్వం మరువలేనిదని హెచ్‌ఎం బాచిన అనిత పేర్కొన్నారు. గురువారం చేకూరపాడులోని వేణుగోపాలస్వామి ఓరియంటల్ హైస్కూల్ జరిగిన కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థులు వీవీప్రసాద్, శిరిగిరి తారక్‌నాథ్, స్వర్ణ బాబురావు, కరణం శివశంకర్, నలమోతు ఆంజనేయులు కంప్యూటర్, ప్రింటర్‌ను బహూకరించారు. అలాగే ఈ ఏడాది టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పూర్వ విద్యార్థులైన రాయపూడి కోదండపాణి, నల్లూరి అమరవాణి, తుమ్మల వీరయ్య నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్మినేని రమేష్‌బాబు, కరస్పాండెంట్ శిరిగిరి వెంకట్రావు, వడ్డెళ్ల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏకేయూ వీసీకి సత్కారం



వీసీ మూర్తిని సత్కరిస్తున్న అధ్యాపకులు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో వైస్ చాన్సలర్ డీవీఆర్.మూర్తిని గురువారం గురుపూర్ణిమను పురస్కరించుకొని అధ్యాపకులు శాలువతో సత్కరించారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ మండే హర్షప్రీతమ్‌దేవ్‌కుమార్ ఆధ్వర్యంలో వీసీ మూర్తి చేస్తున్న సేవలను కొనియాడారు. ఆంధ్రా యూనివర్సిటీలో విద్యార్థి నాయకునిగా ఉన్న కాలంలో తమకు అనేక అమూల్యమైన సూచనలు, సలహాలను అందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల పూర్వపు ప్రధానాచార్యులు రాజమోహనరావు పాల్గొన్నారు.

కూటమి పాలనపై ప్రజల్లో సంతృప్తి : ఎమ్మెల్యే బీఎన్



కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

చీమకుర్తి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే బీఎన్. విజయ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం చీమకుర్తిలోని దిన్నేపురం, తోపుబజారులో సుపరిపాలనలో తొలిఅడుగు కరపత్రాలను ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఇంటింటికి తిరిగి అందజేశారు. పలువురు మహిళలు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేయడంపై ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మన్నం రాజేశ్వరి, ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు ముప్పూరిచలమయ్య, కాట్రగడ్డ రమణయ్య, యడవల్లి రామబ్రహ్మం, గొల్లపూడిసుబ్బారావు, కోటేశ్వరరావు, రాము, నాగరాజు, సుబ్బారావు హనుమంతరావు, సురేష్, బుజ్జి, బాజీ, షకీర్ పాల్గొన్నారు.

నేడు అమ్మవారికి సారె మహోత్సవం

చీమకుర్తి, జూలై10(ఆంధ్రజ్యోతి): చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో శుక్రవారం వాసవికన్యకా పరమేశ్వరి అమ్మవారికి సారె మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయధర్మకర్తలు శిద్దా లక్ష్మీపద్మావతి, సుధావళి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు పాల్గొనాలని వారు కోరారు.

ఈకేవైసీ సమస్యలు పరిష్కరించుకోవాలి

ఒంగోలు(రూరల్), జూలై10(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ధి పొందటానికి రైతులు ఈనెల 13లోపు భూముల ఆన్‌లైన్, ఈకేవైసీ తదితర సమస్యలు పరిష్కరించుకోవాలని ఏవో రమేష్‌బాబు కోరారు. గురువారం ఎన్.అగ్రహారం, గుత్తికొండవారిపాలెం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో బైరపనేని రవిచంద్ర, నరసారెడ్డి, ఉదయకుమార్‌రెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

సాయిబాబా మందిరాలకు పోటెత్తిన భక్తులు ● పలు చోట్ల అన్నదానాలు



లాయర్‌పేటలో బాబాను దర్శించుకుంటున్న నాగసత్యలత, భక్తులు

ఒంగోలు కల్చరల్, జూలై 10(ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి వేడుకలు గురువారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఒంగోలు నగరంలోని పలు షిర్డీ సాయిబాబా దేవాలయాలకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సంవత్సరం గురుపౌర్ణమి గురువారం రావటంతో దీనికి మరింత విశిష్టత చేకూరింది. ఇక నగరంలోని లాయర్‌పేట, సంతపేట, కర్నూల్ రోడ్డులోని సాయిబాబా దేవస్థానాలు, సంతపేట శ్రీభగవాన్ వెంకయ్యస్వామి దేవస్థానం, మంగమూరు రోడ్డు శ్రీఅచలానందస్వామి ఆశ్రమం, శ్రీసత్యసాయిబాబా మందిరం మొదలైన పలు ఆలయాల్లో భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. లాయర్‌పేట సాయిబాబా మందిరం ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. సత్యసాయిబాబా మందిరంలో 300మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అన్నప్రసాద పంపిణీ చేశారు. అదేవిధంగా పలు చోట్ల గురుపూజోత్సవం సైతం జరిగింది.

- స్థానిక ఏకేవీకే కళాశాలలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దండు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురుపౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గెం శ్రీనివాసరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు జన్మనిస్తే గురువు జ్ఞానాన్ని ఇచ్చి మనిషి ఉన్నతికి అండగా నిలుస్తారన్నారు. ఈ సందర్భంగా రంగస్థల నటులు మిడసల మల్లిఖార్జున రావు, కవి కుర్రా ప్రసాద్‌బాబు, కనమాల రాఘవులును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పి.లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షుడు మాకినేని అమరసింహం, జె.రమాదేవి, కాటా రాధ, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు మండలంలో..

ఒంగోలు(రూరల్): ఒంగోలు మండలంలోని పలు శ్రీషిర్డీ సాయిబాబా మందిరాల్లో గురుపౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. సర్వేరెడ్డిపాలెం, కరవది, దేవరంపాడు, ఇక త్రోవగుంట, కొప్పోలు గ్రామాల్లోని సాయిబాబా మందిరాలలో భక్తులు ప్రత్యేక పూజలు చేయగా అనంతరం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.



పూజల్లో పాల్గొన్న దామచర్ల సత్య

సత్య పూజలు

టంగుటూరు: గురుపౌర్ణమి సందర్భంగా టంగుటూరు, కొండపి, జరుగుమల్లి మండలాల్లోని సాయిబాబా ఆలయాల్లో భక్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. జమ్మపాలెంలోని సాయిబాబా ఆలయంలో మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు మక్కెన వెంకటరావు, పూనాటి వెంకటేశ్వర్లు, పులివర్తి రాఘవేంద్రరావు, సూదనగుంట శ్రీహరిరావు పాల్గొన్నారు.

మద్దిపాడు మండలంలో..

మద్దిపాడు: మండలంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దొడ్డవరప్పాడులోని బాబా ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్ది పూజలు చేశారు. మద్దిపాడు సాయిబాబా దేవాలయంలో నవులూరి హనుమంతరావు ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. హనుమాన్ కాంప్లెక్స్ ఆవరణలో సాయిబాబా విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి బాపట్ల ప్రసాద్, పవన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం


కంభం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి


పొదిలి : పేరెంట్స్ మీటింగ్‌లో పాల్గొన్న కందుల వసంతలక్ష్మి


పెద్దారవీడు : మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయిని కనకదుర్గ


త్రిపురాంతకం : ప్రతిభావంతులకు బహుమతులను అందజేస్తున్న ఎరిక్షన్‌బాబు

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

కొమరోలు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజా ప్రభుత్వ పాలనలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టి, పూర్వవైభవానికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. కొమరోలులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సరస్వతీదేవి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. విద్యావ్యవస్థను వైసీపీ పాలకులు నిర్వీర్యం చేశారన్నారు. విలీనం పేరుతో గ్రామీణ ప్రాంతాలలో పేద విద్యార్థులకు విద్యను దూరం చేశారని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం రాగానే విద్యా శాఖ మంత్రి లోకేష్ ప్రభుత్వ పాఠశాలల పూర్వవైభవానికి ప్రణాళికలు రచించారని, నాణ్యమైన మంచి విద్యాబోధన, సన్నబియ్యంతో భోజనం, వసతులు కల్పనకు పెద్దపీట వేశారన్నారు. ముఖ్యంగా తల్లికివందనం పథకంతో పేద తల్లులక ఆర్థిక చేయూతనందిస్తున్నారన్నారు. ఈ చర్యలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు గణనీయంగా పెరగుతున్నాయని అశోక్‌రెడ్డి వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ అమూల్య, హెచ్ఎం శివనాగేశ్వరరావు, ఎంఈవోలు వెంకటేశ్వర్లు, వెంకటరత్నం, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, మండల టీడీపీ అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు, సొసైటీ బ్యాంక్ చైర్మన్ రవీంద్రరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఓబులరెడ్డి పాల్గొన్నారు.

కంభం : నాణ్యమైన విద్యను అందించడం ద్వారా విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు తోడ్పాటు లభిస్తుందని, దీనికి ప్రభుత్వం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజల సమష్టి భాగస్వామ్యం, కృషి అవసరమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పండుగ వాతావరణంలో జరిగిన మెగా టీచర్ పేరెంట్స్ మీటింగ్‌లో తల్లులకు, తండ్రులకు క్రీడలు నిర్వహించి బహుమతులను అందచేశారు. సర్వేపల్లి రాధాక్రిష్ణన్ విద్యామిత్ర లు అని పోటీ పరీక్షల మెటీరియల్, పాఠ్యపుస్తకాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సైమన్ విక్టర్, ఉన్నత పాఠశాల హెచ్ అబ్దుల్‌సత్తార్, ఎంపీపీ చేగిరెడ్డి తులసమ్మ, జడ్పీటీసీ సభ్యులు కె.జ్యోతి, శ్రీను, శ్రీను, కిశోర్, ప్రసాద్, భూపాల్‌రెడి పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో సమూల మార్పు : ఎమ్మెల్యే కందుల

మార్కాపురం వన్‌టౌన్ : విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులను తీసుకొచ్చి విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసిన ఘనత సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలలో విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో గురువారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కందుల మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని సీఎం చంద్రబాబు అనేక పథకాలు ప్రవేశపెట్టి ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి బాటలు వేస్తున్నారన్నారు. వైసీపీ పాలనలో విద్యా వ్యవస్థ అవినీతి మయంగా మారిందన్నారు. సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ మాట్లాడుతూ.. అమ్మ అంటే రెండు అక్షరాలు కాదని, మన జీవితం అని ఆమెను గుండెల్లో పెట్టుకుని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలు వినియోగించుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలల్లో విద్యార్థులకు మొక్కలు పంచి, స్కూల్ బ్యాగులను అందించారు. బాలికల ఉన్నత పాఠశాలలో ట్రిపుల్ ఐటీ సాధించిన 9 మంది బాలికలను సన్మానించారు. తల్లులకు విద్యార్థులతో పాదపూజ చేయించారు. కార్యక్రమంలో ఎంఈవోలు రామ్‌దాస్ నాయక్, శర్వాణి, ప్రధానోపాధ్యాయుడు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీదేవి, టీడీపీ నాయకులు కందుల రామిరెడ్డి, వక్కలగడ్డ మల్లికార్జున్, తాళ్లపల్లి సత్యనారాయణ, ఆలపాటి వెంకటరెడ్డి, పఠాన్ ఇబ్రహీం ఖాన్, పఠాన్ నాగూర్ ఖాన్, పఠాన్ హుస్సేన్ ఖాన్, కౌన్సిలర్ నగేశ్ పాల్గొన్నారు.


విద్యా కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కందుల, సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, ఉపాధ్యాయులు

గిద్దలూరు టౌన్ : సమాజంలో ప్రస్తుతం నెలకొన్న ప్రభావాలు విద్యార్థులపై పడుతుందని, ఆ కోవలో విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి పోకుండా దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ ఎం.జయరావ్ అన్నారు. పట్టణంలోని జూనియర్, డిగ్రీ కళాశాలలో మెగా టీచర్స్, పేరెంట్స్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ జయరావ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొదిలి : పిల్లల భవిష్యత్ కోసం వారి నడవడవకను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనించాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి కందుల వసంతలక్ష్మి అన్నారు. గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ అజీమ్‌బాషా పాల్గొన్నారు. అలాగే బాలుర, బాలికల, ఉప్పలపాడు, కేజీబీవీ పాఠశాలల్లో పేరెంట్ మీటింగ్ జరిగింది.

రాచర్ల : విద్యార్థుల శ్రేయస్సు, వారి సంక్షేమమే పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ముఖ్య ఉద్దేశమని ఎంఈవో వి.గిరిధరశర్మ అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం మెగా పీటీఎం కార్యక్రమాలను పండుగలా నిర్వహించారు. ఆదర్శ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి, ఎస్సై పి.కోటేశ్వరరావు టీడీపీ మండల అధ్యక్షుడు కటికె యోగానంద్ పాల్గొన్నారు.

తర్లుపాడు : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం పండుగ వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రధానోపాధ్యాయులు పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి గురించి పేరెంట్స్‌కు వివరించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

పెద్దారవీడు : పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రుల భాగస్వామ్యం కీలకమని ప్రధానోపాధ్యాయిని కేఎన్ కనకదుర్గ అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌ను గురువారం ఉత్సాహంగా నిర్వహించారు. ఎంఈవోలు శ్రీనివాసులు, సుబ్రమణ్యం మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ గొట్టం శివశంకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ నాగమణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన కోలాటం, జానపద నృత్యాలు అలరించాయి. సుంకేసులపాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీరాములు అధ్యక్షతన పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.రమేష్, మాజీ ఎంపీపీ చంద్రగుంట్ల నాగేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ షేక్ షఫీ, పాల్గొన్నారు. సమావేశానికి హాజరైన తల్లులకు మ్యూజికల్ చైర్స్, ముగ్గుల పోటీలు నిర్వహించారు.

విద్యార్థుల భవిష్యత్‌కు ప్రభుత్వం కృషి
టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

త్రిపురాంతకం : విద్యార్థుల భవిష్యత్‌కు ప్రభుత్వం కృషి చేస్తుందని అందులో భాగంగానే ఇచ్చిన మాట ప్రకారం ఇంటిలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం అందిస్తోందని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. గురువారం జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో దూపాడులోని గురుకుల పాఠశాలలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషిచేస్తుందని తెలిపారు. విద్యలో బాగా రాణించిన పిల్లలకు ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. విద్యార్థుల తల్లిద్రండులకు మొక్కలను పంపిణీ చేశారు.

ఎర్రగొండపాలెం : విద్యార్థుల నడతపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపినపుడే విద్యలో రాణిస్తారని మండల ప్రత్యేకాధికారి విష్ణువర్ధన్ రావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కస్తూర్బాలో గురువారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ మంజునాథరెడ్డి, ఎంపీడీవో బీ శ్రీనివాసమూర్తి, ఎంఈవో అంజనేయులు, ఎస్‌వో తిరుమలాదేవి, టీడీపీ మండల అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు మాజీ సర్పంచి కంచర్ల సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీ సభ్యుడు ఆవులయ్య, ఎస్ఎంసీ చైర్మన్ రసూల్, నాయకులు పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : తల్లిదండ్రులు తమ పిల్లల ఉన్నత విద్యకు తోడ్పడాలని ఎంఈవో మస్తాన్ నాయక్ అన్నారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం గురువారం నిర్వహించారు. కస్తూర్బాలో బాలికలు తల్లుల కాళ్లు కడిగి పాదాభివందనాలు చేశారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో నాసర్ రెడ్డి, ఎస్ఐ మహేష్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ప్రసన్నతాంజలి, కస్తూర్బా, ఏకలవ్య, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాళ్లు అనూష, భరద్వాజ్, మహాలక్ష్మమ్మ, ఈశ్వర్‌సింగ్, వసంత జూనియర్, బీఎం డిగ్రీ కళాశాలల చైర్మన్ బట్టు రమణారెడ్డి పాల్గొన్నారు.

శాకాంబరి పూజలు



గిద్దలూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీపాతాళ నాగేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం శాకాంబరి పూజలు వైభవంగా జరిగాయి. పార్వతిదేవి అమ్మవారిని కూరగాయలు పండ్లు, ఆకుకూరలతో అలంకరించి ప్రత్యేకంగా పూజ లు నిర్వహించారు. ఈసందర్భంగా సామూహిక కుంకుమార్చనలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎండోమెంట్ అధికారులు పట్టణ ప్రముఖులు ఆయా పూజ కార్యక్రమాలలో పాల్గొన్నారు.

గణపవరంలో గరంగరం

త్రిపురాంతకం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గం మొత్తం అన్ని మండలాల్లో పేరెంట్స్ సమావేశాలు పండుగ వాతావరణంలో జరిగాయి. అయితే త్రిపురాంతకం మండలంలోని గణపవరం గురుకుల పాఠశాలలో వివాదంతో ప్రారంభమై తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు వాగ్వివాదం చోటుచేసుకుంది. సమావేశ నిర్వహణపై తల్లిద్రండులకు సమాచారం లేదని కొందరు అక్కడి ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో వాగ్వివాదానికి దిగారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జరుపుతున్న ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేయటంలోనూ విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు హాజరైన తరువాత విద్యార్థులతో బెంచీలు తెప్పించి సీట్లు ఏర్పాటు చేయడంపై తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రతి కార్యక్రమంలోనూ ఈ పాఠశాలలో ఇదే తంతు అని కొందరు ఫిర్యాదు చేశారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

మార్కాపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. పూలసుబ్బయ్య కాలనీలో గురువారం తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. స్థానిక 12, 13, 14 వార్డుల పరిధిలోని టీడీపీ కార్యకర్తల కోసం ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి వార్డు పరిధిలోని నాయకులు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ముందుగా ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున్, మాలపాటి వెంకటరెడ్డి, తాళ్లపల్లి సత్యనారాయణ, పఠాన్ ఇబ్రహీం, రంగస్వామి, కొప్పుల శ్రీనివాసులు, హుసేన్ ఖాన్, గులాబ్, వార్డుల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌కు జైలు

గిద్దలూరు టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మ ద్యం తాగి లారీ నడిపిన డ్రైవర్‌కు జైలు శిక్ష విధించింది. ఇటీవల రాచర్లలో మద్యం తాగి లారీ నడిపిన డ్రైవర్‌ను పోలీసు లు అదుపులోకి తీసుకుని గురువారం కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి భరత్ చంద్ర 40 రోజుల జైలు శిక్ష విధిస్తూ 10వేల జరిమానాతో తీర్పునిచ్చారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

గిద్దలూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాత బద్వేల్ రోడ్డులో షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం తెల్లవారుజాము నుంచే భక్తుల తాకిడి మొదలైంది. ధుని ప్రదక్షిణలు చేశారు. సామూహిక వ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. దేవస్థాన ధర్మకర్త డాక్టర్ జేవీ నారాయణ, కమిటీ ప్రతినిధులు, పట్టణంలోని రాచర్ల రోడ్డులో సాయిబాబా ఆలయంలో సైతం గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి.

కంభం : కంభం, అర్ధవీడు మండలాల్లోని సాయిబాబా గుడులు భక్తులతో కిక్కిరిసాయి. పట్టణంలోని సాయిబాబా మందిరంలో నగర సంకీర్తన, కాగడ హారతి, సాయిసత్‌చరిత పారాయణం, సామూహిక విష్ణు సహస్ర నామ పఠనం, పాలాభిషేకం, అన్నదానం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.

మార్కాపురం వన్‌టౌన్ : గురు పౌర్ణమిని పట్టణంలో గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నెహ్రూ బజార్, జవహర్ నగర్ కాలనీలలోని బాబా మందిరాలలో సాయి నాథుని ప్రత్యేకంగా అలంకరించి కాకడ హారతి, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సాయి సత్య వ్రతాలలో భక్తులు పాల్గొన్నారు. అన్నసంతర్పణ నిర్వహించారు. చెన్నకేశవస్వామి ఆలయంలో జగద్గురు రామానుజాలచార్యులకు పంచామృతాభిషేకం, అర్చనలు నిర్వహించారు. శ్రీపతి అప్పనాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈవో గొలమారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.


మార్కాపురంలో ప్రత్యేక అలంకరణలో బాబా

తర్లుపాడు : తర్లుపాడులోని బాబా మందిరంలో గురపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు అలుగు బాలబ్రహ్మం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపించారు.

పొదిలి : విశ్వనాథపురం, రథంరోడ్డు, ప్రధాన రహదారిలో ఉన్న సాయిబాబా ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజులు చేశారు. తహసీల్దార్ క్రిష్టారెడ్డి దంపతులు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్ దంపతులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : సాయిబాబా మందిరంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక హోమం చేశారు. మధ్యాహ్నం అన్నసంతర్పణ గావించారు. ప్రత్యేక రథంపై బాబా విగ్రహాన్ని ఊరేగించారు.

పెద్దారవీడు : చట్లమిట్టలోని సాయినాథుని సన్నిధిలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. కాగడ హారతి, గణపతి పూజ, ప్రాత కాల పూజలు, పుణ్యాహవాచనం, అభిషేకం, క్షీరాభిషేకం, సహస్ర పుష్పార్చనలు, మంత్ర పుష్పం వంటి దేవతార్చనలు నిర్వహించారు. పరిసర గ్రామాలనుంచి భక్తులు తరలివచ్చి బాబాను దర్శించుకున్నారు. ఆధ్యాత్మిక సలహాదారులు బండి మల్లికార్జున్, పాలకమండలి సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం మహిళలు చేసిన కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది. సాయంత్రం స్వామివారిని రథంపై ప్రతిష్టించి గ్రామోత్సవం నిర్వహించారు.


పెద్దారవీడులోని సాయినాథుడు

రాజీ కోసం మధ్యవర్తిత్వం అవసరం

గిద్దలూరు టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సమాజంలో కోర్టు కేసులు త్వరగా పరిష్కరించుకోవడం కోసం మధ్యవర్తిత్వానికి చాలా ప్రాధాన్యత ఏర్పడిందని జూనియర్ సివిల్ న్యాయాధికారి, అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఏ ఓంకార్, కే భరత్‌చంద్ర అన్నారు. గురువారం దేశం కోసం మధ్యవర్తిత్వం అవగాహన వారోత్సవాలలో భాగంగా స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేయగా న్యాయాధికారులు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గిద్దలూరు కోర్టుల వద్ద ముగ్గురు మధ్యవర్తులను ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ వారు నియమించినట్లు తెలిపారు. వీరు వారికి కేటాయించిన కేసుల్లో ఇరుపార్టీలకు సత్వర పరిష్కారానికి మధ్యవర్తులు చూపించాల్సిందిగా తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని మధ్యవర్తిత్వం ద్వారా తమ కోర్టు కేసులను పరిష్కరించుకోవాలన్నారు. ఈసందర్భంగా 1కే వాక్‌ను కూడా నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీఎన్ శేషశైనారెడ్డి, ఉపాధ్యక్షుడు బి.ప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఎ.తిరుమలప్రసాద్, అసిస్టెంట్ గవర్నమెంటు ప్లీడర్ డి.సంగీతరావు, న్యాయవాదులు పిడతల రాజశేఖర్‌రెడ్డి, కె.హిమశేఖర్‌రెడ్డి, కె.పోలయ్య పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయాధికారులు ఓంకార్, భరత్‌చంద్ర, న్యాయవాదులు


డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్ రమణబాబు

కమిషనర్ ఆకస్మిక తనిఖీ

గిద్దలూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు వీధులను మున్సిపల్ కమిషనర్ రమణబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొన్ని చోట్ల మురుగు కాలువల్లో చెత్తాచెదారంతో ఎండిపోయి ఉండడాన్ని గమనించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చుట్టుపక్కల ప్రజలను పిలిచి చెత్తను రోజూ చెత్త రిక్షాలలో మాత్రమే వేయాలని సూచించారు. చెత్తను కాల్వలో వేస్తే మురుగు కదలక దోమలు పెరిగి రోగాలబారిన పడతారన్నారు. పలు చోట్ల జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. నాణ్యతతో వేయాలని సిబ్బందికి కమిషనర్ సూచించారు.

నేడు డయల్ యువర్ డీఎం

పొదిలి, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : పొదిలి ఆర్టీసీ డిపో పరిధిలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరుగుతుందని డిపో మేనేజర్ శంకరరావు గురువారం తెలిపారు. కార్యక్రమం శుక్రవారం సాయంత్రం 4గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. డిపో అభివృద్ధికి సర్వీసులకు సంబంధించిన విషయాలను తెలపాలని కోరుతున్నామన్నారు. పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి, దర్శి, దొనకొండ, కురిచేడు మండలాల ప్రయాణికులు, ప్రజలు ఆర్టీసీ ప్రయాణంలో ఉన్న సమస్యలు, సూచనలు, సలహాలు డిపో మేనేజర్ సెల్ నెంబర్ 9959225700కు ఫోన్ చేసి తెలియజేయాలని ఆయన కోరారు.

నేడు ఐటివరంలో మంత్రి గొట్టిపాటి పర్యటన

పుల్లలచెరువు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : పుల్లలచెరువు మండలం ఐటివరం గ్రామంలో శుక్రవారం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పర్యటిస్తారని టీడీపీ నాయకులు గురువారం ప్రకటనలో తెలిపారు. ఐటివరం గ్రామంలో 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేసి అనంతరం గ్రామంలో జరిగే సుపరిపాలన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ మాగుంట, టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు పాల్గొంటారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చెడు ప్రవర్తనతో కలిగే నష్టాలపై అవగాహన

త్రిపురాంతకం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు గుడ్‌టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని అలాగే విద్యార్థులు మత్తు పదార్థాలు, సైబర్ క్రైం వలలో చిక్కుకొంటే భవిష్యత్‌లో కలిగే నష్టాలను తెలుసుకోవాలని ఎస్సై శివబసవరాజు సూచించారు. మండలంలోని మేడపి ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఆయన మాట్లాడారు. బాలికలపట్ల బాలురు మర్యాదగా ప్రవర్తించాలన్నారు. విద్యారుల ప్రవర్తన పట్ల తల్లిదండ్రులు కూడా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి పరిశీలిస్తూ ఉండాలన్నారు.

బీఎల్వోలకు శిక్షణ



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సత్యనారాయణ

త్రిపురాంతకం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీఎల్వోలకు మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎన్నికల ప్రత్యేక అధికారి ఎంఈవీ సత్యనారాయణ పాల్గొని వారికి బీఎల్వోల యాప్ గురించి వివరించారు. ఆన్‌లైన్ ద్వారా వారికి పరీక్షలు నిర్వహించారు. అనంతరం సర్టిఫికెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కిరణ్ పాల్గొన్నారు.

నీటిలో ఫ్లోరిన్ తగ్గించేందుకు కృషి చేస్తాం

రాచర్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): సింగిల్ ఫేజ్ మోటార్ల ద్వారా వచ్చే నీటిలో ఫ్లోరిన్ తగ్గించేందుకు కృషి చేస్తామని ఎంపీడీవో ఎస్.వెంకటరామిరెడ్డి అన్నారు. మండలంలోని అనుమలవీడు గ్రామం ఎస్సీ కాలనీలో గురువారం సింగిల్ ఫేజ్ మోటార్ల ద్వారా వచ్చే నీటిని పరిశీలించారు. నీటిలో ఫ్లోరిన్ శాతం తెలుసుకునేందుకు ఇంజనీరింగ్ అసిస్టెంట్ పరీక్షల నిమిత్తం నీటిని సేకరించారు. నీటిలో ఫ్లోరిన్ శాతం పెద్దగా లేదని, ప్రజలు దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ఐ.వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి గణేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వినయ్ రాజ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో జూనియర్ అసిస్టెంట్ మృతి

పెద్దదోర్నాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటుతో జూనియర్ అసిస్టెంట్ అచ్యుత రమాదేవి (40) గురువారం మృతి చెందారు. పంచాయతీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రమాదేవి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నక్రమంలో మూడు రోజులుగా సెలవులో ఉన్నారు. గురువారం పరిస్థితి విషమించడంతో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించే సమయానికే ఆమె మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. రమాదేవికి భర్త, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న పంచాయతీ సర్పంచి హారిక, కార్యదర్శి శివ కోటేశ్వరరావు, ప్రధానోద్యాయుడు కిశోర్‌కిరణ్ కుమార్, సిబ్బంది మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వాహనాల తనిఖీ

గిద్దలూరు టౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఫిట్‌నెస్ లేని స్కూలు బస్సులు, ఇతర వాహనాలను గురువారం మార్కాపురం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ మాధవరావు తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో స్కూలు బస్సులను తనిఖీ చేసి ఆర్సీ, ఇన్సూరెన్స్, పీయూసీ, మెడికల్ కిట్, ఫైర్ సిలిండర్ ఉండాలని వాహనాల డ్రైవర్లకు సూచించారు. సరైన పత్రాలు లేని భారత్ గ్యాస్ కంపెనీ వాహనానికి ట్యాక్స్, ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ లేని కారణంగా రూ.26,500, మరో వాహనానికి రూ.12,600 జరిమానా విధించారు. వాహనాలకు సరియైన పత్రాలు లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భూ కమతాల ఫొటో తప్పనిసరి

పొదిలి, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : భూ కమతాల ఫొటో అప్‌లోడ్ చేయాలని తహసీల్దార్ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఈ-పంట డిజిటల్ క్రాప్ సర్వేపై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వే ఆదేశాల మేరకు సర్వే చేసిన ప్రతి భూ కమతాల ఫొటోను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలన్నారు. సాగులో ఉన్న ప్రతి పంట 100శాతం నమోదు చేయాలన్నారు. నమోదులో ఎలాంటి తప్పులు లేకుండా వీఆర్వోలు, గ్రామ సహాయకులు పూర్తి చేయాలన్నారు. రెవెన్యూ గ్రామంలో డౌన్ లోడ్ అయిన ప్రతి భూ కమతాలను జియోఫెన్సింగ్‌తో ఫీల్డ్ సర్వే చేసి ఫొటో తీయాలన్నారు. ఖరీఫ్ ఈపంట 2025లో 16 స్టెప్స్ ద్వారా డిజిటల్ క్రాప్ బుకింగ్ ప్రక్రియ పూర్తి అవుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ షాజీదా, ఆర్ఐ నరసింహారావు, వ్యవసాయాధికారి డి శ్రీనివాసరెడ్డి, వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వ ప్రాధాన్యం

మెగా పేరెంట్స్ డే వేడుకల్లో ఎంపీ మాగుంట


కనిగిరి బాలికల హైస్కూల్ పేరెంట్స్‌డే వేడుకల్లో మాట్లాడుతున్న ఎంపీ మాగుంట

కనిగిరి, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల హైస్కూల్, మండలంలోని కంచర్లవారిపల్లి హైస్కూల్‌లో గురువారం జరిగిన మెగా పేరెంట్స్ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఉపాధ్యాయులతో పాటు తల్లితండ్రులు తమ పిల్లల్లో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే ఉన్నతస్థాయికి చేరుకుంటారని అన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా కుటుంబంలో ఎంత మంది పిల్లలు చదుకుంటున్నా ఒక్కొక్కరికి రూ. 13వేలు వంతున ప్రోత్సాహకాన్ని అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అన్నారు.విద్యాశాఖమంత్రి నారాలోకేష్ విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రంలో అభివృద్ధిలో పరుగులు పెడుతుందన్నారు.ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ వివిధ కారణాలతో తల్లికి వందనం అందని వారు తమ బ్యాంకు ఖాతాను ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పారు. కనిగిరి ప్రాంతంలో పాఠశాలల అభివృద్ధికి రూ. 2.5 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు.

డీవో వసంతరావునాయక్, ఎంఈవో సాంబశివరావు, హెచ్‌ఎం వీవీ రామాంజనేయులు, ప్రిన్సిపాల్ కె. ధనుముని, టీడీపీ మండల అధ్యక్షుడు మోడి ఆంజనేయులు, నాయకులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల వసతిగృహం ప్రారంభం

స్థానిక జడ్పీ పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన బాలికల వసతీగృహాన్ని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ప్రారంభించారు. వసతిగృహంలోని అన్నీ గదులను పరిశీలించి బాలికలకు ఎటువంటి అసౌకర్యాలకు తావులేకుండా, నాణ్యమైన పౌష్టికాహారంతో, పూర్తి సౌకర్యాలతో విద్యాబోధన అందించాలని సిబ్బందికి సూచించారు.

విద్యాభివృద్ధిలో విప్లవాత్మక మార్పులు

- డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దొనకొండ : విద్యాభివృద్ధే లక్ష్యంగా ఏడాది పాలనలోనే రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పులతో టీడీపీ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి స్పష్టం చేశారు. దొనకొండలోని కేజీబీవీ, జడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో గురువారం పండుగలా నిర్వహించిన మెగా పేరెంట్స్‌డే కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యావంతుడు విద్యాశాఖ మంత్రిగా ఉంటే సరికొత్త ఆలోచనలతో విద్యార్థులు, తల్లిదండ్రుల మనోభావాలకు అనుగుణంగా పాఠశాలల అభివృద్ధి, విద్యాభివృద్ధి సాధించగలమని అన్నారు. అనంతరం జడ్పీ పాఠశాల గణిత ఉపాధ్యాయుడు గోనుగుంట్ల వెంకటేశ్వర్లు తన తల్లి శివలక్ష్మి జ్ఞాపకార్థం పదవ తరగతి ఫలితాల్లో ప్రథమస్థానం సాధించిన విద్యార్థి కోటేశ్వరరావుకు సమకూర్చిన రూ.10వేల నగదును డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చేతులమీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ


పది ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థికి ఉపాధ్యాయుడు సమకూర్చిన రూ.10వేలను అందిస్తున్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి (దొనకొండ)


పీసీపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పేరెంట్స్‌ను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంఈవో ఆర్.శ్రీనివాసులు

ప్రభుత్వ ప్రోత్సాహాన్ని వినియోగించుకోవాలి

తాళ్లూరు : ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ తెలిపారు.మండలంలోని తూర్పుగంగవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో హెచ్‌ఎం ప్రసాద్ అధ్యక్షతన జరిగినసభలో డీఎస్పీ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు మంచి నడవడికతో చెడు మార్గంవైపు వెళ్లకుండా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు, ఎంఈవో సుబ్బయ్య, వైద్యాధికారి మౌనిక, సర్పంచ్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో జరిగిన సమావేశంలో జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, నాగంబొట్లపాలెం జడ్పీహైస్కూల్‌లో జరిగిన సమావేశంలో ఎంఈవో-2 సుధాకర్‌రావు మాట్లాడారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో జరుగుతున్న కార్యక్రమాలను మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు పరిశీలించారు.

నైతిక విలువలతో కూడిన విద్యాభ్యాసం

పామూరు: పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యాబోధన ఎంతో అవసరమని పామూరు ఎస్‌ఐ టి. కిశోర్‌బాబు సూచించారు. మండలంలోని బొట్లగూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్ మీటింగ్ రెండవ విడత సమావేశం హెచ్‌ఎం బాలకృష్ణయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్‌ఐ పాల్గొని మాట్లాడారు. పాఠశాల పూర్వపు విద్యార్థి, టీడీపీ రాష్ట్ర నాయకుడు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, సర్పంచ్ వై. బాల, స్కూల్ కమిటీ చైర్మన్ చల్లా ప్రమీల, వైస్ చైర్మన్ హైమావతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే పామూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీ, విరాట్‌నగర్, అంకాలమ్మవీధి, ఉర్దూ పాఠశాలలో మెగా పీటీఎం సమావేశాలు నిర్వహించారు.

పండుగలా ఆత్మీయ సమావేశం

పీసీపల్లి: పేరెంట్స్,టీచర్స్ ఆత్మీయ సమావేశం మండలంలోని పాఠశాలల్లో గురువారం పండుగ వాతావరణాన్ని తలపించే విధంగా జరిగింది. ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాఠశాలలకు హాజరయ్యారు. పాఠశాలలకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను అధికారులు వివరించారు. ఎంపీడీవో హనుమంతరావు, మండల విద్యాశాఖాధికారులు సంజీవి, శ్రీనివాసులు, టీడీపీ మండలపార్టీ అధ్యక్షుడు వేమూరి రామయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

దర్శి :విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈవో కె రఘురామయ్య సూచించారు. మండలంలోని రాజంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అలాగే మండలంలోని అన్నీ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు పేరెంట్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ జి సుధారాణి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.


శంకరాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎస్‌ఐ కమలాకర్, పక్కన మండల టీడీపీ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు

తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి


తాళ్లూరులో మాట్లాడుతున్న దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ

ముండ్లమూరు : తల్లిదండ్రులు తమ పిల్లలపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి కలలను సాకారం చేయాలని మండల ఎస్‌ఐ కే కమలాకర్ అన్నారు. గురువారం తల్లులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం సందర్భంగా మండలంలోని శంకరాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.


మెగా పీటీఎంలో పాల్గొనడానికి వస్తున్న ఎస్‌ఐ కిశోర్‌బాబు, అధికారులు (పామూరు)

ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, సర్పంచ్ మహేశ్వరి నారాయణస్వామి, హెచ్‌ఎం అరుణ కుమారి, ఎస్ఎంసీ చైర్మన్ అంజలి పాల్గొన్నారు. ముండ్లమూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశానికి ఎంపీడీవో శ్రీదేవి, కేజీబీవీలో ఎంఈవో - 2 వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు.

కోలాహలంగా ఆత్మీయ సమ్మేళనం

కురిచేడు : తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం కురిచేడు మండలంలో కోలాహలంగా పండుగ వాతావరణంలో జరిగింది. విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించడంతో ప్రారంభమైన కార్యక్రమాలు పూర్తి అయి వందన సమర్పణ వరకు టైం ప్రకారం జరిగాయి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు విజయవంతం కావడం పట్ల మండల విద్యాశాఖాధికారి వస్రాం నాయక్ సంతోషం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న దర్శి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జాన్సన్

పారదర్శకంగా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలి

తాళ్లూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామస్థాయిలో బూత్ లెవల్ అధికారులు పారదర్శకంగా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని దర్శి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.జాన్సన్ తెలిపారు. మండలంలోని బూత్‌లెవల్ అధికారులకు ఎన్నికల కమిషన్ ఆదేశాను సారం మండలపరిషత్ సమావేశం హాలులో గురువారం శిక్షణ ఇచ్చారు.తహసీల్దార్ లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఓటర్ల జాబితాల్లో తప్పులు లేకుండా చూడాలన్నారు. ఇంటిపేర్లు, ఫొటోల మార్పుల్లో పొరపాట్లు జరుగకుండా చూడాల్సిన బాధ్యత బీఎల్‌వోలదేనన్నారు. జాబితాల సవరణ తరువాత తప్పులు వుంటే బీఎల్‌వోలపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్ల జాబితాల్లో 1200 ఓట్లు దాటితే మరొక బూత్‌లోకి షిఫ్ట్ చేయాలన్నారు. మాస్టర్‌ట్రైనర్ రవీంద్ర ఎలక్షన్ కమిషన్ సూచనలను వివరించారు.బూత్‌లెవల్ అధికారులకు ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహించి ట్రైనింగ్ ప్రోగ్రాం సర్టిఫికెట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ టి.దేవప్రసాద్, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.


చెత్త సంపద కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి

చెత్త నుంచి సంపద సృష్టించాలి

సీఎస్‌పురం(పామూరు), జూలై 10 (ఆంధ్రజ్యోతి) :రిక్షాల ద్వారా సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలించి సంపద సృష్టించాలని డీఎల్‌డీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని కంభంపాడులో చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్లాప్ మిత్రలకు పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించి కేంద్రానికి తెచ్చి గ్రేడింగ్ చేసి ఎరువుగా తయారు చేయాలని సూచించారు. అలాగే గ్రామంలోని ఓవర్‌హెడ్‌ట్యాంకును పరిశీలించారు. ట్యాంకు వద్ద పారిశుధ్య పనులు నిర్వహించిన తేదీ వేయాలని సూచించారు.


సామంతపూడిలో సుపరిపాలనలో తొలి అడుగులో పాల్గొన్న ఎంపీ మాగుంట , టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తదితరులు

సాగర్ కాలువలకు మరమ్మతులు ప్రారంభం

దర్శి, జూలై 10(ఆంధ్రజ్యోతి): దర్శి-2 సబ్ డివిజన్ పరిధిలోని సాగర్ కాలువల మరమ్మతు పనులను టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది సాగర్ కాలువలన్నీ పూర్తిస్థాయిలో మరమ్మతు పనులు చేసి అన్నీ ప్రాంతాలకు సక్రమంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం సాగర్ కాలువల మరమ్మతు పనులను పట్టించుకోకపోవటంతో చిల్లచెట్లు పెరిగి అడివిలా తయారయ్యాయన్నారు. సాగునీటి రంగాన్ని అభివృద్ధి పర్చాలని కూటమి ప్రభుత్వం ప్రధాన కాలువలతో పాటు బ్రాంచ్, మేజర్లకు అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దర్శి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కె. వెలుగొండారెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక కార్మికులతో మురుగు తొలగింపు

పామూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : పామూరు పట్టణంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రధాన కాలువల్లో పేరుకొని పోయి ఉన్న మురుగును గుంటూరు నుంచి వచ్చిన ప్రత్యేక పారిశుధ్య కార్మికులతో తొలగింపు పనులను పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందారెడ్డి ఆధ్వర్యంలో గురువారం చేపట్టారు. కాలువలపై ఉన్న శ్లాబులను ఎక్స్‌కవేటర్‌లద్వారా పగుల కొట్టి కాలువల్లో పేరుకొని పోయిఉన్న మురుగు, వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పందిటి హరీష్, మెంటా నరసింహారావు, పంచాయతీ గుమాస్తా గరికిపాటి వెంకట్రావు, సిబ్బంది ఉన్నారు.

కేజీబీవీ పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

దొనకొండ, జూలై 10(ఆంధ్రజ్యోతి): దొనకొండలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలకు టీడీపీ మండల అధ్యక్షుడు మోడి ఆంజనేయులు పేరెంట్స్ డే సందర్భంగా బహూకరించిన అధునాతన కంప్యూటర్‌ను టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి గురువారం పాఠశాల సిబ్బందికి అందజేశారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు పులిమి రమణారెడ్డి, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురు పౌర్ణమి వేడుకలు

పామూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా స్థానిక షిరిడి సాయిబాబా మందిరాల్లో భక్తులు అత్యంతభక్తి శ్రద్ధలతో వేడుకలను గురువారం జరుపుకొన్నారు. పట్టణంలోని రెండు మందిరాల్లో బాబా దర్శనం కోసం ఉదయం నుంచే భక్తులు బారులుతీరారు. పూజలు, హారతి అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని దేవస్థాన చైర్మన్ పబ్బతి వెంకటసుబ్బయ్య ప్రారంభించారు. భక్తులకు వడ్డించారు.సాయంత్రం సంధ్యా హారతి, లక్ష పుష్పార్చన, పల్లకిసేవ, సేజ్ హారతి కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.


ముండ్లమూరులో సాయి బాబాకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

దొనకొండలో

దొనకొండ : దొనకొండలోని బ్రహ్మారావుపేటలోని సాయి బాబా ఆలయంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో, అడ్డరోడ్డు సెంటర్‌లోని ఆనంద ఆశ్రమంలో ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి పర్యవేక్షణలో గురుపౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానంతో పాటు తీర్థప్రసాదాలు అందించారు.

ముండ్లమూరులో..

ముండ్లమూరు : మండలంలోని పలు సాయి బాబా దేవాలయాల్లో గురు పౌర్ణమిని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మందిరాలు సాయి నామ కీర్తనతో మారుమోగాయి. ముండ్లమూరు, నాయుడుపాలెం, పోలవరం, పులిపాడు, పసుపుగల్లు గ్రామాల్లో సాయి బాబా ఆలయాల్లో బాబాకు ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం పూట ఉత్సవ విగ్రహాలను గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయాలను విద్యుత్ దీపాలంకరణలతో తీర్చిదిద్దారు.

దర్శిలో

దర్శి :మండలంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. సాయిబాబా మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. దర్శి పట్టణంలోని పలు మందిరాలు, సామంతపూడి గ్రామంలోని మందిరంలో ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.


దర్శి : సామంతపూడిలో పూజలందుకుంటున్న సాయిబాబా

తాళ్లూరులో..

తాళ్లూరు : గురుపూర్ణమి సందర్భంగా మండలంలోని కొత్తపాలెం,నాగం బొట్లపాలెం సాయిబాబా మందిరాల్లో గురువారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాబా దర్శనం కోసంభక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 6 వేల మందికి పైగా అన్నదానం చేపట్టారు.


సాయిని దర్శించుకుని పూజలు చేస్తున్న మహిళా భక్తులు

నేటి నుంచి ప్రభుత్వ పథకాలపై కళాజాత

దొనకొండ, జూలై 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కళాజాత బృందం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం నేటి నుంచి ఈనెల 22వ తేదీ వరకు మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వసంతరావునాయక్ తెలిపారు. 11వ తేదీ ఆరవళ్లిపాడు, తెల్లపాడు, 14వ తేదీ గంగదేవిపల్లి, పెద్దన్నపాలెం, 15వ తేదీ ఇండ్లరువు, పి. వెంకటాపురం, 16వ తేదీ వద్దిపాడు, సంగాపురం, 17వ తేదీ దొనకొండ, పోలేపల్లి, 18వ తేదీ చందవరం, పి లక్ష్మీపురం, 19వ తేదీ రామాపురం, కొచ్చెర్లకోట, 21వ తేదీ మంగినపూడి, భూమనపల్లి, 22వ తేదీ మల్లంపేట, రుద్రసముద్రం గ్రామాల్లో నిర్వహిస్తారన్నారు.


విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన షేక్ కాలేషావలి

ఎంఈవో-1గా కాలేషావలి

ముండ్లమూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మండల విద్యా శాఖ అధికారి -1 షేక్ కాలేషావలి గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈయన దర్శి ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తూ ఇన్‌చార్జ్ ఎంఈవోగా నియమితులయ్యారు. ఆయనను ఎంఈవో - 2 వెంకటేశ్వర్లు, మండలంలోని ఏపీటీఎఫ్ ఉపాధ్యాయులు, నాయకులు, యూటీఎఫ్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ సుంకర సునీత అధ్యక్షతన జరుగనుందని ఎంపీడీవో ఎం. శ్రీదేవి తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని కోరారు.

ఏడాది పాలనలో ప్రజలు పూర్తి సంతృప్తి

● ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి

దర్శి జూలై 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది పాలనలో అన్నీవర్గాల ప్రజలు పూర్తి సంతృప్తితో ఉన్నారని ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మండలంలోని సామంతపూడి, తూర్పుచౌటపాలెం గ్రామాల్లో గురువారం సాయంత్రం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావులతో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగి టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లల్లో అమలు చేస్తూ ప్రజలకు సుపరిపాలన అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, మున్సిపల్ చెర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, మండల టీడీపీ అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, దర్శి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చెర్మన్ కె. వెలిగొండారెడ్డి, మాజీ సర్పంచ్‌లు పోకూరి కృష్ణయ్య, మారం ధనలక్ష్మి, మారం శ్రీనివాసరెడ్డి, పోకూరి నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ప్రజాహిత కార్యక్రమాలు

కనిగిరి : కూటమి ప్రభుత్వం ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టిందని ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. మండలంలోని తక్కెళ్ళపాడు గ్రామంలో ఏడాది సుపరిపాలన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటినీ సందర్శించి ప్రజలకు అందుతున్న పథకాలను విచారించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల మేరకు కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా ప్రజల ముంగిటకు తీసుకు వచ్చి మేలు చేకూర్చుతుందన్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధిని గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ రవిశంకర్, మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, ఎంఈవోలు సుబ్బారావు, యూవీ నారాయణరెడ్డి, ఎంఎస్ఆర్ ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, కనిగిరి జీహెచ్ హెచ్‌ఎం కలవ విజయలక్ష్మి, డీసీఎంఎస్ చైర్మన్ కాశిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దర్శిలో అన్న క్యాంటీన్ పనులు ప్రారంభం

దర్శి జూలై 10 (ఆంధ్రజ్యోతి):దర్శి పట్టణంలోని కురిచేడు రోడ్డులో నిలిచిన అన్న క్యాంటీన్ పనులను గురువారం టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆరంభించిన అన్నా క్యాంటిన్‌లను వైసీపీ ప్రభుత్వం పక్కన పెట్టిందన్నారు. దీంతోపేద ప్రజలకు ఇబ్బంది కల్గిందన్నారు. దర్శిలో అన్నా క్యాంటిన్ భవనం పూర్తి చేసి ప్రారంభించేందుకు రూ.60 లక్షలు నిధులు విడుదలైనట్లు తెలిపారు. భవనం వీలైనంత త్వరలో పూర్తిచేసి వెంటనే క్యాంటిన్‌ను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దర్శి నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వెలుగొండా రెడ్డి, దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, మాజీ అధ్యక్షుడు దారం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు విడుదల

జిల్లా రైతులకు రూ.18.24 కోట్లు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ధాన్యం విక్రయించిన రైతుల బకాయిలు రూ.24.55 కోట్లను గురువారం ప్రభు త్వం విడుదల చేసింది. రబీ సీజన్‌లో పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభు త్వం కొనుగోలు చేసింది. పల్నాడు, బాపట్ల జిల్లాలకు సంబంధించిన రైతులు ధాన్యాన్ని పెద్దఎ త్తున విక్రయించారు. ఇందుకు సంబంధించి పల్నాడు జిల్లాలో 359 మంది రైతులకు రూ.6.29 కోట్లు, బాపట్ల జిల్లాలో 1200 మంది రైతులకు సుమారు రూ.18.24 కోట్లు బకాయిలను చెల్లించాల్సి ఉంది. ఖరీఫ్ సాగు పనులు ప్రారంభించినా చేతిలో నగదు లేక.. రబీ ధాన్యం నగదు కోసం రైతులు ఎదురుచూస్తున్న తరుణంలో వారికి ప్రభుత్వం తీపికబురు అందించింది.

మదినిండుగా.. బడి పండుగ

- ఆటపాటలు నృత్యాలతో విద్యార్థుల సందడి
- పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటిన తల్లిదండ్రులు
- మొక్కల పంపిణీ.. తల్లి పేరుతో నాటిన విద్యార్థులు

ఉత్సాహంగా మెగా పీటీఎం 2.0



వలపర్ల ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్యే ఏలూరికి స్వాగతం పలుకుతున్న చిన్నారులు


రేపల్లె : మున్సిపల్ హైస్కూల్లో విద్యార్థులతో సహబంతి భోజనంలో పాల్గొన్న మంత్రి అనగాని సత్యప్రసాద్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పిల్లలతో కలిసి తల్లిదండ్రులు గురువారం పాఠశాలలకు తరలిరాగా ఉత్సాహపూరిత వాతావరణంలో మెగా పీటీఎం 2.0 జరిగింది. పచ్చని కొబ్బరి మట్టలు, మామిడి తోరణాలు, రంగురంగుల కాగితాలతో పాఠశాలలను విద్యార్థులు అలంకరించి పండుగ వాతావరణం కల్పించారు. ఆటపాటలతో విద్యార్థులు సందడి చేయగా.. పిల్లల నైపుణ్యాలను చూసి.. తెలుసుకుని పెద్దలు సంబరపడ్డారు. పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులు.. పూర్వ విద్యార్థులు.. ప్రజలు భాగస్వామ్యం పెంచి మరింత బలోపేతం చేసేందుకు విద్యాలయాల్లో నిర్వహించిన ఉపాధ్యాయులు.. తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాలు వేడుకగా జరిగాయి. మదినిండుగా బడి పండుగ కోలాహలంగా జరిగింది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పీటీఎం 2.0 వేడుకగా జరిగింది. తల్లిదండ్రులు.. అతిథిలకు విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. తల్లుల కాళ్లకు పూలతో పూజలు చేసి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. తల్లి పేరుతో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మొక్కలు నాటిన విద్యార్థులకు గ్రీన్‌కార్డులు అందజేశారు. తల్లిదండ్రులు కూడా పాఠశాలల ప్రాంగణాల్లో మొక్కలు నాటారు. ఎమ్మెల్యేల నుంచి

(మిగతా 6లో)


వేమూరు మండలం జంపని హైస్కూల్‌లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు



మేదరమెట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన పీటీఎంలో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

- రేపల్లెలోని మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన మెగా పీటీఎంలో పాల్గొని మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. దేశంలో తొలిసారిగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఒకే వేదికపై కలిపి విద్యావ్యవస్థలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన ఘనత ప్రభుత్వానిదన్నారు.
- మేదరమెట్లలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ వెంకట మురళితో కలిసి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొన్నారు. 452 సైకిళ్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. తల్లిదండ్రులు కోరినట్లు మరుగుదొడ్లు, బాలికలకు ప్రత్యేక గది, రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.
- వేమూరు మండలం జంపనిలోని జడ్పీ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆనందబాబు హాజరయ్యారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్ల మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి మెగా పీటీఎం ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు.
- పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పలపర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కెమిస్ట్రీ ల్యాబ్‌ను ప్రారంభించారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం చంద్రబాబు పాలన చేస్తున్నారన్నారు.
- బాపట్లలోని సరస్వతి మెమోరియల్ బాలికల పాఠశాలలో జరిగిన పీటీఎంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పాల్గొన్నారు. పేదరికం నుంచి కుటుంబాలను బయటపడేసే ఒకే ఒక్క ఆయుధం విద్య అని, అందుకే ప్రభుత్వం విద్యా రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు.
- చీరాలలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో నిర్వహించిన మెగా పీటీఎంలో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు. మధ్యాహ్న భోజనం పథకంలో సన్న బియ్యం వినియోగించి, విద్యార్థుల ఆకలి తీర్చడంతో పాటు వారి అవసరాలు ఏమిటో కనుక్కుని వాటిని తీర్చడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు.


చీరాలలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులతో ఎమ్మెల్యే కొండయ్య


బాపట్ల : సూర్యలంక రోడ్డులో గల సరస్వతీమెమోరియల్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులతో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

61 రోడ్లకు రూ.16.12 కోట్లు

రైతుల కోసం 58 లింకు రోడ్ల నిర్మాణం

ఆంధ్రజ్యోతితో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

వేమూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలోని 61 రోడ్ల నిర్మాణానికి రూ.16.12 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు గురువారం ఆంధ్రజ్యోతికి తెలిపారు. రైతులు, గ్రామీణుల కోసంగా రోడ్లు నిర్మిస్తామన్నారు. పొలాల్లోని దిగుబడులను రైతులు రవాణా చేసుకునేందుకు 58 లింకు రోడ్ల నిర్మాణానికి రూ.13 కోట్ల 9 లక్షలు మంజూరు అయ్యాయన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 50 కి.మీ దూరం కలిగిన మెటల్ రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. అమృతలూరు మండలంలో పది రోడ్లకు రూ.కోటి 96 లక్షలు, వేమూరు మండలంలో 13 రోడ్లకు రూ.2కోట్ల 36 లక్షలు, చుండూరు మండలంలో 27 రోడ్లకు రూ.4 కోట్ల 98 లక్షలు, భట్టిప్రోలు మండంలో నాలుగు రోడ్లకు రూ.3 కోట్ల 19 లక్షలు, కొల్లూరు మండలంలో మూడు రోడ్లకు రూ.60 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. జిల్లా మినరల్ డెవలప్‌మెంట్ నిధుల ద్వారా మూడు గ్రామాలకు సంబంధించిన పూర్తిగా దెబ్బతిన్న రోడ్ల నిర్మాణానికి రూ.3.22 కోట్లు నిధులు మంజూరు అయ్యాయన్నారు. వేమూరు మండలంలో తెనాలి, కొల్లూరు ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి బూతుమల్లి గ్రామంలోకి వెళ్లే మార్గానికి రూ.92 లక్షలు, భట్టిప్రోలు మండలంలో తాతావారిపాలెం నుంచి సూరేపల్లి వెళ్లే రోడ్డుకు రూ.కోటి, వరికూటివారిపాలెం రోడ్డుకు రూ.కోటి 30 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఆయా రోడ్ల నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు.


సభా స్థలిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు


పూర్తయిన సిట్టింగ్ ఏర్పాట్లు

నేడు వెలగపూడిలో జనాభా దినోత్సవం

హాజరుకానున్న సీఎం చంద్రబాబు.. భారీగా ఏర్పాట్లు

తుళ్లూరు(వెలగపూడి), జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పరిధిలోని వెలగపూడి రాష్ట్ర సచివాలయం సమీపంలో శుక్రవారం జరిగే ప్రపంచ జనాభా దినోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు భారీగా ఏర్పాట్లు చేశారు. ఆయా ఏర్పాట్లను గురువారం రాష్ట్ర ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ ప్రిన్సిపల్ సెక్రటరి పీయూష్‌కుమార్, జా యింట్ సెక్రటరి అనంతశంకర్, ఎస్పీ సతీష్‌కుమార్, జేసీ భార్గవతేజ పరిశీలించారు. సభా స్థలి ఏర్పాట్లు, సిట్టింగ్, వాహనాల పార్కింగ్, తాగునీరు, పారిశుధ్య పనులకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి పాల్గొనే ఈ కార్యక్రమం విజయ వంతానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రవికుమార్, సీఆర్డీఏ ఈఈ శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో జ్యోతిబసు, డ్వామా పీడీ శంకర్, డీపీవో నా గసాయికుమార్, డీఎస్‌డబ్ల్యూ ఆర్‌ఐ సురేష్, తుళ్లూరు, గుంటూరు తూర్పు తహసీల్దార్లు సుజాత, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


సాగర్‌కు జలకళ

540 అడుగులకు చేరిన నీటి మట్టం

శ్రీశైలం నుంచి 1.20 లక్షల క్యూసెక్కులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నాగార్జున సాగర్ జలాశయం జలకళ సంతరించుకుంటోంది. శ్రీశైలం నుంచి 1.20 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. రెండు రోజుల్లో 22 టీఎంసీల నీటి నిల్వ పెరిగింది. సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా గురువారం సాయంత్రానికి 541 అడుగులకు చేరింది. 189.33 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది. 122.72 టీఎంసీలు వస్తే సాగర్ జలాశయం నిండుతుంది. శ్రీశైలం జలాశయంలోకి గురువారం 1,88,745 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చింది. శ్రీశైలం గేట్లు తెరిచి, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 1,50,396 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు.


నాగార్జున సాగర్ జలాశయంకు జలకళ

వీడీఏ పాయింట్‌ల ఆధారంగా వేతనాలు పెంపు : కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ శాఖల్లోని వివిధ విభాగాలలో పనిచేస్తున్న ఎన్ఎంఆర్‌ల రోజువారి వేతనాలను వీడీఏ పాయింట్‌ల ఆధారంగా పెంచినట్లు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. వినియోగదారుల ధరల సూచిక సంఖ్య పెరుగుదల మేరకు 2025-26 సంవత్సరానికి వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఎన్ఎంఆర్‌ల రోజువారి వేతనాలను సవరించినట్లు తెలిపారు. వివిధ విభాగాల్లో అత్యంత నైపుణ్యం గలవారికి రోజువారి వేతనం గత సంవత్సరం రూ.900లు చెల్లిస్తుండగా ఈ ఏడాది వీడీఏ పాయింట్‌లు ఆధారంగా రూ.937గా నిర్ధారించినట్లు చెప్పారు. నైపుణ్యం గలవారికి రూ.850 నుంచి రూ.885, సెమీ స్కిల్డ్‌కు రూ.750 నుంచి 781, నైపుణ్యంలేని ఎన్ఎంఆర్‌లకు రూ.650 నుంచి రూ.677 రోజువారి వేతనాలను నిర్ణయించినట్లు కలెక్టర్ వివరించారు.

ఆగస్టు 15 నాటికి మార్గదర్శకులను ఎంపిక చేయాలి

బాపట్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఆగస్టు 15వ తేదీ నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే విధంగా మార్గదర్శకులను ఎంపిక చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్‌లతో పీ4, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై, ఐవీఆర్ఎస్ కాల్స్‌లో వచ్చిన ఫిర్యాదులు, సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పలు సూచనలు చేశారు. పీ-4 కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారన్నారు. రాష్ట్రంలో పేదలందరికీ ఈ కార్యక్రమం ద్వారా సంక్షేమ పథకాలు అందించడానికి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

బర్లీ పొగాకు రైతులకు బాసట

- మంత్రి గొట్టిపాటి చొరవతో కొనుగోలు

మేదరమెట్ల జూలై 10 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మూరుమూల ప్రాంతం నుంచి బర్లీ పొగాకు అమ్మేందుకు మేదరమెట్లకు వచ్చిన రైతులకు మంత్రి రవికుమార్ బాసటగా నిలిచారు. అచ్చంపేట మండలం చెరుకుంపాలేనికి చెందిన రైతులు 350 పొగాకు బేళ్లు తీసుకుని మేదరమెట్ల జీపీఐ కంపెనీ వద్దకు వచ్చారు. అయితే సదరు కంపెనీ ప్రతినిధులు కొన్ని బేళ్లు తక్కువ ధరకు కొనుగోలు చేసి మిగిలిన వాటిని తిరస్కరించారు. దీంతో రైతులు ఆందోళన చెందారు. ఈ క్రమంలో గురువారం మేదరమెట్ల పర్యటనలో ఉన్న మంత్రి రవికుమార్‌ను రైతులు కలిసి తమ గోడు వినిపించారు. స్పందించిన మంత్రి జీపీఐ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి కొనుగోళ్లకు ఒప్పించారు. దీంతో రైతులు మంత్రి రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


జీపీఐ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రాజెక్టులకు నిధులు

- నిధుల కేటాయింపునకు మంత్రి మండలి ఆమోదం
- పట్టాలెక్కనున్న వరికపూడిశెల, గోదావరి అనుసంధానం పనులు

రూ.6,399.95 కోట్లు మంజూరు

ప్రకటనలు.. శంకుస్థాపనల హడావుడితో వైసీపీ పాలకులు సరిపెట్టిన సాగునీటి ప్రాజెక్టులకు కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు అటకెక్కిన సాగునీటి ప్రాజెక్టుల పనులు ప్రస్తుతం పట్టాలెక్కనున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో కీలకమైన వరికపూడిశెల ఎత్తిపోతల పథకం, గోదావరి-పెన్నా నదుల అనుసంధానం ప్రాజెక్టులకు బుగ్గవాగు అభివృద్ధి పనులకు కలిపి మొత్తం రూ.6,399.95 కోట్లు కేటాయింపులకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. నీటి పథకాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులు పనులు పూర్తి చేస్తే సాగు, తాగునీటి సమస్యలకు పరిష్కారం లభిస్తోంది.


నకరికల్లు వద్ద గోదావరి అనుసంధానం ప్రాజెక్టుకు 2018లో సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేసిన శిలాఫలకం


వరికపూడిశెల నిర్మించే ప్రదేశం

ప్రాజెక్టు	నిధులు (రూ.కోట్లలో)
గోదావరి అనుసంధానం	6,020.15
వరికపూరిశెల	340.26
బుగ్గవాగు	39.54

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సాగునీటి కరువును శాశ్వతంగా జయించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన ప్రాజెక్టుల పనులను పట్టాలెక్కించే దిశగా నిధులు మంజూరు చేసింది. గోదావరి - పెన్నా నదుల అనుసంధానంలో తొలి విడతలో చేపట్టే గోదావరి జలాలు సాగర్ కుడి కాల్వకు తరలించే ఎత్తిపోతలు, వరికపూడిశెల పథకాలకు నిధులు మంజూరు చేసింది. బుగ్గవాగు గేట్లు పునరుద్ధరణ పనులకు నిధులు కేటాయించింది. గోదావరి పెన్నా నదుల అనుసంధానంలో భాగంగా తొలిదశలో గోదావరి జలాలను సాగర్ కుడి కాల్వకు తరలించే పథకానికి 2018లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పల్నాడు, బాపట్ల, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని 9.61 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేలా ఈ పథకాన్ని రూపొందించింది. అమరావతి మండలం వైకుంఠపురం వద్ద కృష్ణానది నుంచి నీటిని అక్కడి నుంచి 66.59 కిలోమీటర్ల పొడవునా పైపులైన్ నిర్మించి సాగర్ కాల్వ 80వ మైలు వద్దకు గోదావరి నీటిని ఎత్తిపోతల ద్వారా (మిగతా 6లో)

బల్లికురవ, సంతమాగులూరులో పునరుత్పాదక జోన్

1800 ఎకరాల భూమి అవసరం.. 2,500 మందికి ఉపాధి

ఎకరం భూమి రూ.18 లక్షలకు కొనుగోలు : కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, జూలై 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అద్దంకి నియోజకవర్గం బల్లికురవ, సంతమాగులూరు మండలాల పరిధిలో పునరుత్పాదక(రెన్యువబుల్ ఎనర్జీ మ్యాన్‌ఫ్యాక్చరింగ్) జోన్ స్థాపనకు ప్రభుత్వం ఆమోదించిందని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. పునరుత్పాదక పరిశ్రమల ఏర్పాటుకు కందూరు, మామిళ్లపల్లి, మక్కెనవారిపాలెం, గుడిపాడు గ్రామాల పరిధిలో 1800 ఎకరాల భూమి కొనుగోలుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకు ఎకరానికి రూ.18 లక్షల ధర నిర్ధారించినట్లు తెలిపారు. జోన్ ఏర్పాటుతో ఆ ప్రాంతమంతా పారిశ్రామిక కారిడార్‌గా అభివృద్ధి చెందుతుందన్నారు. 2,500 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. స్థానిక కుటుంబాల్లో అర్హత కలిగిన వారికి ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యం ఇస్తామన్నారు. భూమి ఇవ్వకపోతే ఇతరప్రాంతాలకు పరిశ్రమలు తరలి వెళ్లే అవకాశం ఉందని రైతులు దీనిని గుర్తించి సహకరించాలన్నారు. భూములు ఇచ్చేందుకు అంగీకరించిన కలెక్టర్ రైతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో చీరాల ఆర్డీవో చంద్రశేఖర్, ఉపకలెక్టర్ లవన్న, బల్లికురవ, సంతమాగులూరు తహసీల్దార్లు ఎం.రవి నాయక్, కె.రవిబాబు, రెన్యువబుల్ ఎనర్జీ మ్యాన్ ఫ్యాక్చరింగ్‌జోన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివశంకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

మార్గదర్శకులను ఆగస్టు 15లోపు గుర్తించాలి

ఒంగోలు(రూరల్), జూలై10(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించటానికి, పేదరిక నిర్మూలనకు పీ4 పథకానికి సీఎం చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారని, పేదరికంలో ఉన్న బంగారు కుటుంబాలను అభివృద్ధి చేయటానికి మార్గదర్శికులను ఆగస్టు 15వ తేదీ లోపు గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.విజయానందరావు ఆదేశించారు. గురువారం విజయవాడలోని రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో మాట్లాడారు. పేదలను ఆర్థిక అసమానతల నుంచి ఉన్నత స్థితికి చేర్చేలా చూడాలన్నారు. ఇందుకోసం మార్గదర్శకులను అధికారులు గుర్తించాలని సూచించారు. జిల్లాల్లో సీజనల్ వ్యాధుల నివారణకు వైద్యశాఖ సిద్ధంగా ఉండాలని చెప్పారు. సంక్షేమ వసతిగృహాలలో పారిశుధ్య నిర్వహణ కచ్చితంగా ఉండాలన్నారు. మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతంగా జరిగేలా చూడాలని చెప్పారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ గోపాలకృష్ణ, జడ్పీసీఈవో చిరంజీవి, డీపీవో వెంకటనాయుడు, నగర కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఈవీఎంల గోడౌన్ పరిశీలన

ఒంగోలు కలెక్టరేట్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం మామిడిపాలెంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎం)ల గోడౌన్ ను ఇన్‌చార్జి కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ గురువారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ముందుగా గోడౌన్‌కు వేసిన సీళ్లను, అక్కడి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా రొట్టెల పండుగ

ఇంకొల్లు, జూలై 10,(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగవరం నౌ షాహిద్ దర్గా వద్ద గురువారం నుంచి మూడు రోజుల పాటు రొట్టెపండుగ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఉదయం 5 గంటలకు గంధం బయలుదేరుతుందని అనంతరం రొట్టెల పంపిణీ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

సాయిబాబా మందిరాల్లో గురుపౌర్ణమి వేడుకలు

పర్చూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : గురుపౌర్ణమి వేడుకలు గురువారం పర్చూరు మండలంలో భక్తులు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆయా సాయిబాబా అలయాల్లో వేకువ జామునుండే ప్రత్యేక పూజాకార్యక్రమాలు చేపట్టారు. స్థానిక శ్రీ శిరిడి సాయిబాబా అయలంలో స్వామివార్ల పాలరాతి విగ్రహానికి భక్తులు పాలాభిషేకాలు చేసి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. కార్యక్రమంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో స్వామివార్ల వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన కోలాట భజన కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి. అనంతరం భక్తులకు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నల్లబర్లీ కొనుగోళ్లలో వేగం పెంచాలి

రైతుకు నష్టం లేకుండా చివరి ఆకువరకు కొనుగోళ్లు

పంగులూరులో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి గొట్టిపాటి

పంగులూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లలో అధికారులు వేగం పెంచాలని రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. పంగులూరు మార్కెట్‌యార్డ్‌లోని పొగాకు కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన స్థానిక రైతులతో కలిసి పరిశీలించారు. పొగాకు కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయని, రైతులు కొనుగోలు కేంద్రానికి తెచ్చిన పొగాకు బేళ్లను నాణ్యత పేరుతో వెనక్కి పంపుతున్నారన్నారు. రైతుల ఇబ్బందులను గుర్తించడం లేదని పలు గ్రామాల రైతులు తమ సమస్యలను మంత్రి గొట్టిపాటికి వివరించారు. పంగులూరు కొనుగోలు కేంద్రంలో రోజుకు ఐదు వందల పొగాకు బేళ్లను కొనుగోలు చేసేవిదంగా తక్షణ చర్యలు చేపట్టాలని మంత్రి గొట్టిపాటి అధికారులను ఆదేశించారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని మార్కెట్ యార్డ్ కార్యదర్శి సూర్యప్రకాశ్‌రెడ్డిని ఆదేశించారు. తేమశాతం విషయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి రైతులకు సూచించారు. నాణ్యత పేరుతో రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన బేళ్లను అధికారులు వెనక్కు పంపడంపై అసహనం వ్యక్తం చేశారు.

● **కొరిశపాడులో కేంద్రం ఏర్పాటు చేయండి : మంత్రి గొట్టిపాటి**

రైతుల నుంచి నల్లబర్లీ పొగాకు వేగంగా కొనుగోలు చేసేందుకు కొరిశపాడులో వెంటనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని మంత్రి గొట్టిపాటి అధికారులను ఆదేశించారు. గోడౌన్లను గుర్తించామని, కొనుగోలుకు అవసరమైన ప్లాట్‌ఫాం ఎంపిక చేసి వెంటనే ప్రారంబిస్తామని మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ తెలిపారు. పంగులూరు కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు 83 మంది రైతుల నుంచి 1250 బేళ్లను 10 రోజుల వ్యవధిలో కొనుగోలు చేసినట్లు ఆమె మంత్రికి వివరించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న సమయాన్ని బట్టి రైతుల పేర్లు నమోదు చేస్తున్నామన్నారు.

నెమ్ముశాతం, మిక్సింగ్, పట్టల నాణ్యతపై దృష్టిసారించాలి

కొనుగోలు కేంద్రానికి బేళ్లను తెచ్చే రైతులు నెమ్ముశాతం 20కి మించకుండా చూడాలని, మిక్సింగ్ లేకుండా బేళ్లను తేవడంతో పాటు పట్టల విషయంలో జాగ్రత్తలు పాటించాలని అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు.మంత్రి గొట్టిపాటి ఆదేశాలను అనుసరించి 600 బేళ్ల వరకు కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో బయ్యర్ రమేష్, తహసీల్దార్ సింగారావు, ఎంపీడీవో స్వరూపారాణి, ఏవో సుబ్బారెడ్డి, సీఈవో నాగబోయిన లక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, కేవీ సుబ్బారావు, బాలిన రామసుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, గుర్రం ఆదిశేఖర్, అల్లంనేని బ్రహ్మానంద స్వామి, ఎర్రం శ్రీనివాసరెడ్డి, జేకేసీ శింగర్, ఎనికపాటి శ్రీను, ఓబులోరెడ్డి, శ్రీనివాసరెడ్డి త్రివేణి, చౌదరిబాబు, చంద్రశేఖర్, రాచపూడి మాజీ సర్పంచ్ తలపనేని శ్రీనివాస్ పాల్గొన్నారు.



.పంగులూరులో కొనుగోళ్లను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి

నేటి విద్యార్థులే దేశ భావి సంపద: మంత్రి రవికుమార్

● ప్రభుత్వ పాఠశాలలో వసతులు కల్పిస్తున్నాం : మంత్రి ● విద్యార్థులకుసైకిళ్ల పంపిణీ

మేదరమెట్ల, జూలై 10(ఆంధ్రజ్యోతి): నేటి విద్యార్థులే భారతదేశ భావి సంపద అని, విద్యా వ్యవస్థ బాగుంటేనే దేశభవిష్యత్తు బాగుంటుందని, రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. గురువారం మేదరమెట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సమావేశానికి మంత్రి రవికుమార్‌తో పాటు బాపట్ల జిల్లా కలెక్టర్ జె. వెంకటమురళి, డీఈవో పురుషోత్తం, ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి రవికుమార్ మాట్లాడుతూ విద్యారంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధి కోసం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నిరంతరం కష్టపడుతున్నారన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేయకుండా కష్టపడి చదవాలన్నారు. రాష్ట్రం అన్ని రంగాలల్లో అభివృద్ధి చెందడానికి కూటమి ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తోందన్నారు. తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలు ఉంటే అందరికి ప్రభుత్వం తల్లులు అకౌంట్‌లలో డబ్బులు జమచేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో రూ.1.60 లక్షల మంది తల్లుల ఖతాలకు నగదు బదిలి అయ్యిందన్నారు. విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. ఆర్‌టీసీ బస్సులలో ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మొదలవుతుందన్నారు. కలెక్టర్ వెంకట మురళి మాట్లాడుతూ కష్టపడి చదువుకున్నప్పుడే మీ కలలు, లక్ష్యాలను సాధించుకోగలరన్నారు. మత్తు పదార్థాలకు, సెల్‌ఫోన్లకు బానిసలు కావదంటూ పదివ తరగతి విద్యార్థి చేసిన ప్రసంగాన్ని ఆయన ప్రశంసించారు. కార్యక్రమం ప్రారంభంలో విద్యార్థుల తల్లిదండ్రులకు పాదాభి వందనం చేశారు.

452 మందికి సైకిళ్లు పంపిణి

మేదరమెట్ల, తమ్మవరం, సోమవరప్పాడు గ్రామాలల్లోని విద్యార్థులకు మంత్రి గొట్టిపాటి రవి కుమా ర్, కలెక్టర్ జె.వెంకటమురళిలు ఉచితంగా సైకిళ్లలను అందజేశారు. అసిస్ట్ సంస్థ, మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్నేహితులు ఒకోక్కటి రూ.4500 విలువైన 452 సైకిళ్లను అందజేశారు. పాఠశాలల్లో నిర్వహించిన ఆటల పోటీలలో విజేతలైన విద్యార్థులకు మంత్రి రవికుమార్, కలెక్టర్ వెంకట మురళిలు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. తల్లి పేరుతో ఒ క మొక్కనాటే విధానాన్ని వివరించి విద్యార్థులకు మొక్కలను అందజేశారు.

మరుగుదొడ్లు, ప్రత్యేక గది నిర్మాణం

పాఠశాలలో విద్యార్థులను ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా..? అని అడిగారు. మంత్రి రవికుమార్ ప్రశ్నించినప్పుడు బాలురకు ఒకటే మరుగుదొడ్డి ఉన్నట్లు, అదనంగా మరొక మరుగుదొడ్డి నిర్మించాలని కోరారు. దీంతో పాటు బాలికలకు ఉన్న అవసరాల దృష్ట్యా ప్రత్యేక గదిని నిర్మాంచాలని వారు మంత్రిని కోరారు. దీంతో పాటు పాఠశాలకు రహదారి నిర్మాణం, సైకిల్ షెడ్ త్వరలోనే నిర్మిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అంజనాదేవి, ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, తహసీల్దార్ జీవి సుబ్బారెడ్డి, ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ఎంఈవో లాలం పున్నయ్య, టీడీపీ నాయకులు మన్నె రామారావు, మేదరమెట్ల శ్రీనివాసరావుతో పాటు పెద్దసంఖ్యలో తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న మంత్రి రవికుమార్

వలపర్లను అన్నిరంగాలలో అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మార్టూరు,జూలై10(ఆంధ్రజ్యోతి):రాష్ట్రాన్ని అన్నిరంగాలలో అభివృద్ధి చేసేందుకు, దేశంలోనే ఆంధ్రరాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చేందుకు స్వర్ణాంధ్ర విజన్-2047 ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. గురువారం ఎమ్మెల్యే ఏలూరి సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని వలపర్ల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా తొలుత గ్రామ శివారులోని ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం వద్ద గ్రామ నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం గ్రామంలో పలు కాలనీల్లో ఆయన పర్యటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందేవిధంగా చేస్తున్న కృషిని, కష్టాన్ని, ప్రభుత్వ సహకారాన్ని ప్రజలతో పంచుకున్నారు. భవిష్యత్తులో వలపర్ల గ్రామంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పథకాలను వివరిస్తూ, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు రూ.4.20 కోట్ల వ్యయంతో కోనంకి నుండి వలపర్ల మీదగా జంగమహేశ్వరపురం వరకు నిర్మించనున్న తారురోడ్డుకు ఏలూరి సాంబశివరావు శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు నిర్మాణంతో ఏళ్ల తరబడి ఉన్న వలపర్ల వాసుల కలనెరవేరినట్లేనని పలువురు గ్రామస్థులు ఏలూరికి కృతజ్ఞతలు తెలిపారు. అంతేగాకుండా గ్రామంలో రూ.90 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన రెండు సిమెంటు రోడ్లుకు, సైడు కాల్వలకు ఆయన ప్రారంభించారు. తరువాత జడ్‌పి హైస్కూల్‌లో తల్లిదండ్రులతో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఏలూరి మాట్లాడుతూ తాను ఈ హైస్కూల్‌లో చదివిన పూర్వ విద్యార్థినని,సాధారణ మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చిన తాను ఈ స్థాయికి రావడానికి ఉపాధ్యాయుల ప్రోత్సాహం, తల్లిదండ్రుల ఆశీస్సులతో పాటు కష్టపడి కాకుండా ఇష్టంతో చదవడమేనన్నారు. చదువు సంస్కారాన్ని, విజ్ఞానాన్ని, ఉపాధితో పాటు మంచి జీవితం ఇస్తుందన్నారు. అనంతరం హైస్కూల్‌లో సైన్స్ కెమిస్ట్రీ ల్యాబరేటరీలను ప్రారంభించారు. అదేవిధంగా ఎన్‌సీసీ విద్యార్థులను, వారిలో ముఖ్యంగా బాలికలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కంభంపాటి హనుమంతరావు,సర్పంచ్ తాళ్లూరి బ్రహ్మయ్య, జంజనం సుబ్బారావు, గుంటి వెంకటేశ్వర్లు, యలగా రామాంజనేయులు,వెంకట సుబ్బారావు,కొమ్మి మహేష్,షేక్ బషీర్,శేషయ్య,బలరాం, ఎంఈవో వస్రాం నాయక్ పాల్గొన్నారు.



కోనంకి వరపర్ల రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

లోపల వద్దు.. బయట తీసుకుంటా

అడ్డంగా బుక్కయిన ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్

ఏసీబీకి చిక్కిన అధికారి

గిద్దలూరులో ఒక్కసారిగా కలకలం

గిద్దలూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఎన్.కృష్ణమోహన్‌రావు ఏసీబీ వలలో చిక్కడంతో గిద్దలూరులో కలకలం రేగింది. తన తల్లి పేరు మీద ఉన్న ఇంటిని గిఫ్ట్‌డీడ్ ద్వారా తన పేరు మీదకు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు పట్టణానికి చెందిన కార్పెంటర్ షేక్ ఖాదర్ బాషా ఒక స్టాంప్ రైటర్ ద్వారా సబ్ రిజిస్ట్రార్‌ను సంప్రదించాడు. రూ.50వేలు డిమాండ్ చేయగా రూ.35వేలకు బేరం కుదిరింది. సాధారణంగా చలానాతోపాటు లంచం డబ్బును కూడా డాక్యుమెంట్ రైటర్లకే ఇస్తారు. కానీ కృష్ణమోహన్‌రావు మాత్రం లంచం మొత్తాన్ని నేరుగా తనకే ఇవ్వాలని డిమాండ్ చేసి చివరకు అడ్డంగా బుక్కయ్యాడు. గురువారం మధ్యాహ్నం 3.15 గంటలకు స్లాట్ బుక్ చేసుకుని ఏసీబీ అధికారులు సమకూర్చిన కెమికల్ నోట్లను తీసుకుని వెళ్లి కార్యాలయం లోపలికి వెళ్లారు. డబ్బులు ఇచ్చే ప్రయత్నం చేయగా ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ కృష్ణమోహన్‌రావు కార్యాలయంలో డబ్బు తీసుకునేందుకు నిరాకరించాడు. 'ముందు బయటకు వెళ్లు నేనే బయటకు వస్తాను' అంటూ చెప్పి పంపాడు. దాంతో చేసేదేమీ లేక ఖాదర్‌భాషా డబ్బుతో బయటకు రాగా ఇదేంటి కేసు అడ్డం తిరిగిందని ఆ ప్రాంతంలో నిఘా వేసిన ఏసీబీ అధికారులు కొద్ది సేపు గందరగోళానికి గురయ్యారు. సుమారు 4.30 ప్రాంతంలో కృష్ణమోహన్‌రావు కార్యాలయం నుంచి బయటకు వచ్చి వెనుక వైపునకు వెళ్ళి మూత్ర విసర్జన చేస్తూ సిగరేట్ తాగుతూ ఖాదర్‌బాషాను అక్కడికి పిలిచాడు. దాంతో అతను రూ.35వేలను కృష్ణమోహన్‌కు అందించగా వంటనే ఆ డబ్బును వెనుక పాకెట్‌లో పెట్టుకున్నాడు. ఆ ప్రాంతంలో సాధారణ ప్రజలలాగా ఉన్న ఏసీబీ డీఎస్పీ సోమన్న, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆ వెంటనే అతని చేతులకు ప్యాంటు జేబుకి కెమికల్ టెస్టులు నిర్వహించగా పాజిటివ్‌గా తేలడంతో అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. తొలి నుంచి కృష్ణమోహన్‌రావు రైటర్లతో డాక్యుమెంట్ వరకు రాయించుకోండని, పైన ఇచ్చే లంచాలు నేరుగా తనతోనే మాట్లాడుకుని తనకే ఇవ్వాలని డిమాండ్ చేసేవాడని, చాలా సందర్భాలలో ఇలాగే తీసుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. డాక్యుమెంట్ రైటర్ల ద్వారా తీసుకుంటే వారికి కూడా లంచం డబ్బులో కొంత ముట్టజెప్పాల్సి వస్తుందని, నేరుగా తీసుకుంటే ఎవరికీ ఇవ్వాల్సిన పని లేదన్న భావనతో ఆయన ఇలా వ్యవహరించేవాడని తెలియవచ్చింది. కృష్ణమోహన్‌రావు గిద్దలూరుకు బదిలీ అయి వచ్చినప్పటి నుంచి భారీ ఎత్తున లంచాలు డిమాండ్ చేసేవాడని, వారితో వీరితో చెప్పిస్తే కొంత తగ్గిస్తాడే తప్ప చివరకు పాపం పండిందని ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఐదారు నెలల్లో రిటైర్డ్ కాబోతున్న కృష్ణమోహన్‌రావు చివరన ఏసీబీ వలలో చిక్కుకోగా గత నాలుగైదు రోజులుగా సెలవులో ఉన్న ఈయన గురువారం ఉదయమే విధుల్లోకి వచ్చి చివరకు జైలు పాలయ్యాడు. ఇటీవల కాలంలోనే కృష్ణమోహన్‌రావు తాను ఇంట్లో ఉన్న సమయంలో రాత్రివేళ కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అతనిపై దాడిచేసి గాయపరిచారు. ఈ దాడికి గల కారణాలు, దాడి చేసింది ఎవరో కూడా తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలోనే తాజాగా లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడం చూస్తుంటే ఈ రెండు ఘటనలకు ఏమైనా సంబంధం ఉందా లేదా వేర్వేరు సంఘటనలా అని పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు.



మాట్లాడుతున్న డీఎస్పీ సోమన్న

● **వరుసగా 7వ కేసు**

గిద్దలూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ దాడి జరిగినట్లు వార్తలు రావడంతో గిద్దలూరు ప్రాంతంలోని అవినీతి ఉద్యోగుల గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. గతంలో ఇలాగే ఇద్దరు రెవెన్యూ సర్వేయర్లు, మున్సిపల్ మేనేజర్, టౌన్ ప్లానింగ్ అధికారి, పోలీసు శాఖలోని హెడ్ కానిస్టేబుల్, రైల్వే ఇంజనీర్ ఏసీబీ కేసుల్లో లంచం తీసుకుంటూ పట్టుబడగా తాజాగా ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ అడ్డంగా బుక్కయ్యారు. మొత్తం మీద ఏసీబీ దాడి పట్టణంలో సంచలనం సృష్టించింది.

పేరాలలో ఏసీబీ అధికారుల తనిఖీలు

పేరాల(చీరాల) : ప్రకాశం జిల్లా గిద్దలూరు సబ్ రిజిస్ట్రార్ కృష్ణమోహన్ గురువారం లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. ఈక్రమంలో ఆయన నివాసం చీరాల పరిధిలోని పేరాల కావడంతో అధికారులు ఇంట్లో కూడా సోదాలు నిర్వహిస్తున్నారు. గిఫ్ట్ డీడ్‌కు సంబంధించి రూ.30 వేలు లంచం తీసుకుని పట్టుబడటంతో అధికారులు పేరాల్లో కూడా సోదాలు నిర్వహించారు. వివరాలు అధికారులు వెల్లడించాల్సి ఉంది.



అవీఇవీ

వ్యాసపూర్ణిమ పూజలు

అద్దంకి, జూలై10 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా గురువారం లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, గోపూజ, బిందె తీర్థం పూజలు నిర్వహించారు. 5 ఆవృత్తములుగా వేదపండితులు, అర్చకులు లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. వ్యాసపూర్ణిమ సందర్భంగా వేద వ్యాస మహర్షికి షోడశక్షపచార పూజలు నిర్వహించారు. ఉభయదాతలుగా గుంటూరుకు చెందిన న్యూమార్నింగ్ స్టార్ ట్రావెల్స్ అధినేత పొనకాల శ్రీనివాసరావు, యశోద దంపతులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

పూజారులకు సన్మానం

అద్దంకి: గురు పౌర్ణమి సందర్భంగా గురు వారం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం ప్రధాన పూజారి లక్ష్మీనారాయణ ను బిజేపీ నేతలు సుబ్రహ్మణ్యంశర్మ, ఈదా చిన్న శ్రీనివాసులరెడ్డి,తిరుపతిరెడ్డి, పోతురాజు తదితరులు పాల్గొన్నారు. గురు పౌర్ణమి సందర్భంగా శింగరకొండ సమీపంలోని 72అడుగుల రామమందిరం వ్యవస్థాపకులు స్వర్ణ సుబ్బారావు, అన్నపూర్ణ దంపతులను బిజేపీ నేతలు తమ్మన శ్రీనివాసరావు, జవ్వాజి నాగమల్లి తదితరులు పాల్గొన్నారు.

అగస్తేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



శిడిమాను ఉత్సవ వేడుకలను పర్యవేక్షిస్తున్న ఎస్సై జీవీ.చౌదరి

చెరుకూరు(పర్చూరు), జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ ఆలయంగా పేరుగాంచిన పర్చూరు మండలంలోని చెరుకూరు త్రివిక్రమ అగస్త్యేశ్వర స్వామి వార్ల ఆలయంలో గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈకార్యక్రమంలో పర్చూరు ఎస్సై జి.వి. చౌదరి స్వామివార్లను దర్శించుకొని భక్తిని చాటుకున్నారు. ఈసందర్భంగా ఆలయ విశిష్టతను అర్చకులు వివరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈసందర్భంగా ఆలయాల భద్రతకు సంబంధించి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును ఎస్సై అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన శ్రీ పోలేరమ్మ అమ్మవారి శిడిమహోత్సవ ఉత్సవాల్లో పాల్గొని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ప్రాజెక్టులకు నిధులు

(5వ పేజీ తరువాయి)

తరలించేందుకు పథకాన్ని రూపొందించారు. రూ.1,016 కోట్ల వ్యయం కాగల పనులు గతంలోనే పూర్తి అయ్యాయి. వైసీపీ అధికారంలో వచ్చాక ఈ పనులను పూర్తిగా నిలిపివేసింది. ఈ క్రమంలో గోదావరి-బనకచర్ల అనుసంధానం చేసేందుకు ప్రణాళికను కూటమి ప్రభుత్వం విడుదల చేసింది. విడతల వారీగా నదుల అనుసంధానం పూర్తి చేయాలని నిర్ణయించి జలహారతి అని నామకరణం చేసింది. తొలిదశలో గోదావరి జలాలు 73 టీఎంసీలను జవహర్ కుడి కాల్వ ఆయకట్టు మళ్లించి 9.61 లక్షల ఎకరాలకు నీరు అందించాలన్నది ప్రధాన ఉద్దేశం. ఇందుకు సంబంధించి సుమారు 466 ఎకరాలు భూ సేకరణ త్వరలోనే ప్రారంభం కానున్నది. పథకం పూర్తయితే సాగర్ ఆయకట్టులో సాగు చిత్రం పూర్తిగా మారుతుంది.

వరికపూరిశెల కలకు ప్రాధాన్యం..

పల్నాడు జిల్లా పరిధిలోని మాచర్ల, వినుకొండ నియోజకవర్గాల ప్రజలకు అత్యంత ప్రాధాన్యం కలిగిన వరికపూడిశెల ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు రూ.340.26 కోట్లు మంజూరు చేసింది. అధికారంలోకి వచ్చాక మూడేళ్లలో వరికపూడిశెల నిర్మిస్తామని యువగళం పాదయాత్రలో లోకేశ్ హామీ ఇచ్చారు. అన్నట్లుగానే మొదటి దశలో వెల్దుర్తి మండలంలోని 24,900 ఎకరాలకు సాగునీరు అందించే పనులకు నిధులు కేటాయించారు. ప్రాజెక్టుకి సంబంధించిన అనుమతులు కేంద్ర ప్రభుత్వం నుంచి లభించడంతో త్వరలోనే పనులు చేపట్టేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది.

బుగ్గవాగు అభివృద్ధికి నిధులు

సాగర్ కుడికాల్వలోని బుగ్గవాగు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ గేట్లు పునరుద్ధరణ, మరమ్మతులకు రూ.39.54 కోట్లు కేటాయించింది. బుగ్గవాగు సామర్థ్యం పెంచాలని దశాబ్దాలుగా జిల్లావాసులు కోరుతున్నారు. నాడు టీడీపీ ప్రభుత్వం బుగ్గవాగు అభివృద్ధికి రూ.202 కోట్లు మంజూరు చేయగా ఆ పనులు నిలిపివేసిన వైసీపీ పాలకులు బుగ్గవాగు సామర్థ్యాన్ని 7 టీఎంసీలకు పెంచుతామని చెప్పి చతికిల పడ్డారు.

మదినిండుగా.. బడి పండుగ

(5వ పేజీ తరువాయి)

వార్డు సభ్యుల వరకు ప్రజాప్రతినిధులు, కలెక్టర్ సహా అన్ని స్థాయిల అధికారులు ఈ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. నాణ్యమైన విద్య, పథకాల అమలులో పారదర్శకత, అభివృద్ధి పనుల వేగవంతంపై నిర్ణయాలు తీసుకున్నారు. తరగతుల నిర్వహణ, విద్యార్థుల హాజరు, అభ్యాసన సామర్థ్యాలు తదితర అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు పంపిణీ చేశారు. తల్లిదండ్రులను సమావేశ పరిచి వారితో తాడాట, కుర్చీలాటలు నిర్వహించగా వారంతా కలిసికట్టుగా పాల్గొన్నారు. ముగ్గుల పోటీ, టగ్ ఆఫ్ వార్‌లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. తల్లిదండ్రులు, అధ్యాపకుల మధ్య సత్సంబంధాలు పెంపొందించి విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రజాప్రతినిధులు, అధికారులు వెల్లడించారు. కార్యక్రమం చివర్లో విద్యార్థులతో కలసి తల్లిదండ్రులు, అతిథులు భోజనం చేశారు.

రోటరీక్లబ్ అధ్యక్షులుగా కోటేశ్వరరావు



అధ్యక్షులుగా ప్రమాణస్వీకారం చేస్తున్న కోటేశ్వరరావు

ఇంకొల్లు,జూలై 10,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు రోటరీక్లబ్ నూతన అధ్యక్షులుగా బలగం కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. స్థానిక రోటరీగంగ భవనంలో గురువారం రాత్రి ఇంకొల్లు రోటరీక్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. రోటరీ 3150 జిల్లా గవర్నర్ ఎస్.వీ.రామ్‌ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. నూతన అధ్యక్షులుగా బలగం కోటేశ్వరరావు, కార్యదర్శిగా అలవల రాఘవరెడ్డి, ట్రెజరర్ గోరంట్ల నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో రొ.కొల్లా సింగారావు, శ్రీనివాసరావు, రోటరీక్లబ్ అధ్యక్షులు రఫీ, చుండి సాంబశివరావు, పేర్ని సత్యనారాయణ, హన్ను, కరి శ్రీను, మద్దినేని హనుమంతరావు, సభ్యులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

రైతు సంక్షేమం దిశగా ప్రజా ప్రభుత్వం

● మంత్రి గొట్టిపాటి


మినుమువిత్తనాలు పంపిణీ చేస్తున్న మంత్రి

పంగులూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతుసంక్షేమం దిశగా ప్రజా ప్రభుత్వం అడుగులు వేస్తోం దని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ రవికుమార్ అన్నారు. చిరుసంచులు పేరుతో ప్రభుత్వం రైతులకు నూరుశాతం రాయితీపై కేటాయించిన మినుము విత్తనాల కిట్లను మంత్రి గొట్టిపాటి రైతులకు అందజేశారు. కిట్టుకు 4 కిలోల విత్తనాలు ఉంటాయని ఒక్కో రైతుకు ఒక కిట్ వంతున పంపిణీ చేస్తున్నట్లు ఏవో సుబ్బారెడ్డి మంత్రికి వివరించారు. మండలానికి 52 క్వింటాళ్ల మినుము విత్తనాలు కేటాయించినట్లు తెలిపారు. సాగు విస్తీర్ణం ఆధారంగా విత్తన పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సింగారావు, ఎంపీడీవో స్వరూపారాణి, టీడీపీ అధ్యక్షుడు రమేష్, కేవీ.సుబ్బారావు, ఏడుకొండలు, స్వామి, సుబ్బారావు, శ్రీనివాసరెడ్డి, శేఖర్, పలువురు రైతులు పాల్గొన్నారు.

టంగుటూరి స్మారక చిహ్నం ఏర్పాటు చేయాలి

అద్దంకిటౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు స్మారక చిహ్నం ఏర్పాటు చేయాలని విశ్రాంత హెచ్‌ఎం పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి కలెక్టర్ వెంకట మురళిని కలిసి గురువారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం దృష్టి తీసుకెళ్తామని కలెక్టర్ వెంకట మురళి తెలిపారు.

15 లోపు బీమా ప్రీమియం చెల్లించాలి

బల్లికురవ, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో రైతులు వెంటనే తమ పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని ఏవో పి.శ్రీనివాసరావు కోరారు. గురువారం మండలం లోని ఉప్పుమాగులూరు, రాజుపాలెం గ్రామాలలో పంటల బీమా పథకంపై రైతులకు గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పత్తి పంటకు ఎకరాకు రైతులు ఈ నెల 15వ తేదీ లోపు రూ.1900 చెల్లించాలన్నారు. ఏదైన ప్రకృతి వైపరీత్యాలు జరిగి పంటనష్టం వాటిల్లితే బీమా ద్వారా ఎకరాకు రూ.38 వేల వరకు నష్ట పరిహారం వస్తుందన్నారు. పంటలు సాగు చేసిన రైతులు వెంటనే గ్రామాలలో ఉన్న రైతు సేవా కేంద్రాలను సంప్రదించి బీమా పథకం వివరాలను రైతులు తెలుసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈవో మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

రెండు మోటారు సైకిళ్ల చోరీ

అద్దంకి,జూలై10(ఆంధ్రజ్యోతి):రెండు మోటారు వాహనాలు (బుల్లెట్) చోరీపై గురువారం అద్దంకి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది.సీఐ సుబ్బరాజు కథనం మేరకు అద్దంకి పట్టణంలోని పాత ఆంధ్రబ్యాంక్ ఎదురు నివాసం ఉండే కనమర్లపూడి గణేష్‌కుమార్, గానుగపాలెం కు చెందిన బూదాటి మల్లిఖార్జునరావు లకు చెందిన రెండు రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ లు సుమారు రెండు నెలల క్రితం చోరీ అయ్యాయి. బాధితులు గణేష్ కుమార్, మల్లికార్జునరావు లు గురువారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సిఐ సుబ్బరాజు తెలిపారు.

పారిశుధ్య కార్యక్రమాల పరిశీలన


హెల్త్ క్లినిక్‌ను పరిశీలిస్తున్న సుధీర్

పంగులూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమంజులూరు గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీలలో పారిశుధ్య కార్యక్రమాలను కేంద్రబృందం ప్రతినిధి జి.సుధీర్ పరిశీలించారు. గ్రామంలోని వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, వాటి నిర్వహణ, వంటి అంశాలను పరిశీలించారు. గ్రామీణ ప్రాంతంలో శానిటేషన్ వినియోగంపై ర్యాంకింగ్ కోసం చేపట్టిన ఈ సర్వే ప్రక్రియలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు, డిప్యూటీ ఎంపీడీవో సుమంత్, ఏఈ శివయ్య, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు సహదేవుడు పాల్గొన్నారు.

ప్రయాణికులకు నాణ్యమైన సేవలు అందించండి

● జిల్లా ప్రజారవాణా అధికారి సామ్రాజ్యం


డీపీటీవో సామ్రాజ్యంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎం

చీరాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులకు నాణ్యమైన రవాణా సేవలు అందిస్తూ, రాష్ట్రంలో ఉన్నత స్థానంలో చీరాల డిపో నిలిచేందుకు సిబ్బంది కృషి చేయాలని డీపీటీవో (జిల్లా ప్రజా రవాణా అధికారి) సామ్రాజ్యం పేర్కొన్నారు. గురువారం జిల్లా అధికారి చీరాల డిపోను పరిశీలించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ శ్యామల ఆధ్వర్యంలో సాదర స్వాగతం పలికారు. మరుగుదొడ్ల పరిశుభ్రత, తాగు నీరు, ప్రయాణికులకు అందిస్తున్న సౌకర్యాలు పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే గ్యారేజీలో ఏర్పాటు చేసిన సమావేశంలో హాజరై ఆర్టీసీకు ఆదాయం అందించడంతో మెళకువలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకొల్లు పీఏసీఎస్ చైర్మన్లు వీరే

ఇంకొల్లు, జూలై 10,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు మండలంలో నాలుగు పీఏసీఎస్ చైర్మన్లను నియమిస్తూ జిల్లా సహకార సంఘం నుంచి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇంకొల్లు పీఏసీఎస్ చైర్మన్‌గా కరి శ్రీనివాసరావు, కొణికి పీఏసీఎస్ చైర్మన్‌గా గంగవరానికి చెందిన బోడెంపూడి సుబ్బారావు, భీమవరం పీఏసీఎస్ చైర్మన్‌గా రావిపాటి వెంకట్రావు, పావులూరు పీఏసీఎస్ చైర్మన్‌గా నారిశెట్టి రాంబాబును నియమించినట్లు ఉత్తర్వులు అందాయి.

దేవాలయానికి ఫ్యాన్లు బహూకరణ


ఫ్యాన్లు బహూకరిస్తున్న ఆర్‌ఎస్ఎస్ కార్యకర్తలు

ఇంకొల్లు, జూలై 10,(ఆంధ్రజ్యోతి) : హరిహర ధార్మిక సేవాసమితి ఆధ్వర్యంలో ఇంకొల్లులోని పద్మాలంకమ్మ అమ్మవారి దేవాలయానికి ఫ్యాన్లు బహూకరించారు. రూ.20వేల విలువైన 10 ఫ్యాన్‌లను గురువారం అర్చకులు మధుబాబుకు అందజేశారు. దాతలను దేవాలయ కార్యనిర్వాహణాధికారి మీనిశెట్టి శ్రీనివాసరావు అభినందించారు. కార్యక్రమంలో హరిహర ధార్మిక సేవాసమితి అధ్యక్షులు నార్నె సోమేశ్వరరావు, సభ్యులు వంకాయలపాటి సతీష్, కోట హనుమంతరావు, కరి సునీల్‌కుమార్, రావి సుబ్బారావు, నార్నె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ప్రగతికి ప్రభుత్వం చక్కని బాటలు

● మెగా పేరెంట్ - టీచర్ సమావేశంలో ఎమ్మెల్యే ● ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో తల్లిదండ్రుల ఆత్మీయ సమ్మేళనాలు



చీరాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.ఎం.కొండయ్య

చీరాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలోని పిల్లల ప్రగతికి రాష్ట్రప్రభుత్వం చక్కని బాటలు వేస్తున్నట్లు స్థానిక శాసనసభ్యులు ఎంఎం కొండయ్య అన్నారు. మండల పరిధిలోని జాండ్రపేట ఉన్నత పాఠశాల, పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నిర్వహించిన మెగా పేరెంట్ - టీచర్ 2.0 కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశచరిత్రలో తొలిసారిగా ఒకేరోజు 44 వేల ప్రభుత్వ విద్యాలయాల్లో పండుగ వాతావరణంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే సామాజిక కార్యకర్త డొక్కా సీతమ్మ, విద్యావేత్త సర్వేపల్లి రాధాకృష్ణన్ పేర్లతో ప్రభుత్వ పథకాలు అందించి, రాజకీయ నేతల ఫోటోలు, రంగులు లేకుండా పారదర్శకమైన సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో యువనాయకులు గౌరీ అమర్నాథ్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరకీ సంక్షేమాలు

నియోజకవర్గంలో అర్హులు అందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే కొండయ్య తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని మున్సిపల్‌పరిధిలోని 3వ వార్డులో నిర్వహించారు, అలాగే మండల పరిధిలోని ఈపూరుపాలెంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయా ప్రాంత ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

బల్లికురవ : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం మెగాపేరెంట్స్ టీచర్ మీటింగ్ పండగలా నిర్వహించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమాలలో ఎంపీడీవో కుసుమకుమారి, ఎంఈవో రమేష్, హెచ్‌ఎం హనుమంతురావు, శ్రీనివాసరావు, దూళిపాళ్ల శేషగిరి, పాఠశాలల పేరేంట్స్ కమిటీ చైర్మన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్చూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని పర్చూరు ప్రాంతీయ విద్యాభివృద్ధి సంఘం ప్రతినిధి పాబోలు ఉదయ భాస్కర్ అన్నారు. మెగా పేరెంట్స్ మీటింగ్‌లో భాగంగా గురువారం పర్చూరులోని భవనం అంజిరెడ్డి అండ్ తులాబంధుల అర్జునయ్య జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్.శేషకుమారి అధ్యక్షతన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నేతృత్వంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉదయభాస్కర్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థను పటిష్ట పరిచాలన్న సంకల్పంతో ప్రభుత్వం తల్లిదండ్రులను భాగస్వాములను చేసిందన్నారు. కార్యక్రమానికి హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాబోలు గిరిజా కుమారి, కేఎస్‌ఆర్‌కే ప్రసాద్, కొల్లా పద్మ, చాగంటి రాంబాబు, సిరిగిరి పాపయ్య చౌదరి, తన్నీరు రాంబాబు పాల్గొన్నారు.

మండలంలోని పలుగ్రామాల్లోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో మేగా పేరెంట్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంకొల్లు : మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు ఎయి డెడ్ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో మెగా ఆత్మీయ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఇంకొల్లులో జరిగిన కార్య క్రమంలో ఎంఈవో శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి వాటి బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమం లో విద్యాకమిటీ చైర్మన్ తిమోతి, పి.హనుమయ్య, మురళీ, వాసు, యడ్లూరి ప్రసాద్, ఎం.సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు బాలకృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చినగంజాం : మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులను ఆకట్టుకున్నాయి.

పంగులూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమంజులూరు ఉన్నత పాఠశాలను ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి గురువారం పర్యవేక్షించారు. పాఠశాలలో హోలిస్టిక్ ప్రగతి నివేదిక పత్రాల పంపిణీ, ఫోటో బూత్, పవర్ పాయింట్ ప్రజంటేషన్ కార్యక్రమాలను నిశితంగా పరిశీలించారు. గత విద్యా సంవత్సరంలో షైనింగ్‌స్టార్‌గా ఎంపికైన విద్యార్థిని వై.సుమనశ్రీతో పాటు ట్రిబుల్ ఐ.టి.లో సీట్లు సాధించిన వేదశ్రీ, భవ్యశ్రీల తల్లిదండ్రులతో ముఖాముఖి మాట్లాడారు. పాఠశాల రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అనిత, ఎంఈవో వీరాంజనేయులు, సహదేవుడు, వీరనారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ సంధ్యారాణి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంతమగులూరు :మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈవో వేమవరపు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.






కొప్పెరపాడులో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, పర్చూరులో మాట్లాడుతున్న ఉదయభాస్కర్, ఇంకొల్లులో మాట్లాడుతున్న ఎంఈవో, పంగులూరులో పాల్గొన్న ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి

అనధికార రిసార్ట్స్ నిర్వహణపై అధికారుల విచారణ

● అధికారుల హెచ్చరికలు ధిక్కరించి అక్రమ నిర్మాణాలు ● రెండింటికి నోటీసులు ● కలెక్టర్‌కు నివేదిక అందజేత



తనిఖీ చేస్తున్న అధికారులు

చీరాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : ఒకవైపు తీరంలో అనధికార నిర్మాణాలు చేపట్టవద్దని అధికారులు చెబుతూనే ఉన్నా, అక్రమార్కులు వారి మాటలు పెడ చెవిన పెడుతున్నారు. ఇష్టారీతిగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టి జేబులు నింపుకుంటు న్నారు. దీంతో ఇటీవల పలుమార్లు విషయం అధికారుల దృష్టికి వచ్చింది. దీంతో గురు వారం డీపీవో ప్రభాకరరావు, ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, పొల్యూషన్ బోర్డు ఈఈ రాఘవ రెడ్డి తీరంలో పర్యటించి రిసార్ట్‌లు పరిశీలించారు. ఈ క్రమంలో వారు పరిశీలించిన రెండు నిర్మాణాలు అక్రమంగా చేపట్టినట్లు గుర్తించారు. అలాగే వారికి నోటీసులు కూడా జారీ చేశారు. నివేదికను కలెక్టర్ వెంకట మురళీకి పంపినట్లు చెప్పారు. అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాలను తొలగించనున్నట్లు చెప్పారు.

గొర్రెల పెంపకం షెడ్లు ఏమయ్యాయి ?

అధికారులు అక్రమ నిర్మాణంగా గుర్తించిన వాటిల్లో ఒక దానికి సంబంధించిన నిర్మాణం అధికారులను వెక్కిరించేదిగా ఉంది. ఇటీవల తీరంలో సీఆర్‌జెడ్(కోస్టల్ రెగ్యులేషన్ జోన్) నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టవద్దని అధికారులు అవగాహన కల్పించారు. ఈక్రమంలో ఆ పరిసరాల్లో ఏదైనా నిర్మాణం చేపట్టాలంటే అధికారులు అన్ని విధాలుగా పరిశీలన సాగిస్తున్నారు. అయితే ఇటీవల ఓ వ్యక్తి తీరంలో గొర్రెల పెంపకం కోసం షెడ్డు నిర్మాణానికి అనుమతి కోరాడు. దీంతో పంచా యతీ అధికారులు కూడా గుడ్డిగా నమ్మి అనుమతి ఇచ్చేశారు. ప్రారంభ సమయంలో షెడ్లు ప్రారంభించి గొర్రెల పెంపకమంటూ బోర్డు కూడా ఏర్పాటు చేశారు. నెల తిరిగే సరికి ఆ షెడ్డు కాస్త రూములుగా మారింది. ఆ షెడ్డును ఆకర్షణీయంగా సిద్ధం చేసి రిసార్ట్‌గా బోర్డు మార్చేశాడు. దీంతో అధికారులు సైతం నివ్వెర పోయారు. దీనిపై కొంతకాలంగా అధికారులకు, నిర్వాహకులకు మధ్య కోల్డ్ వార్ నడిచింది. ఎట్టకేలకు నిర్వాహకులకు నోటీసులు అందజేశారు. అలాగే వాటిని త్వరలోనే తొలగించనున్నట్లు అధికారులు తెలిపారు.

అంగరంగ వైభవంగా ప్రారంభాలకు ఏర్పాట్లు

మరొక రిసార్ట్ నిర్వాహకుడు అనధికార నిర్మాణం చేపట్టడంతో పాటు అధికారులు చూపు మరల్చేందుకు పెద్దఎత్తున ప్రజా ప్రతినిధులకు ఆహ్వానం అందించాడు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు కూడా చేశాడు. అయితే జిల్లా అధికారుల జోక్యంతో అప్రమత్తమైన ప్రజాప్రతినిధులు ప్రారంభానికి గైరుహాజరై జాగ్రత్త పడ్డారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు



నక్కబొక్కలపాడు, రావినూతలలో పూజలందుకుంటున్న సాయిబాబా

మేదరమెట్ల, జూలై 10(ఆంధ్రజ్యోతి): గురు పౌర్ణమి సందర్భంగా మండలంలోని అన్ని సాయిబాబా దేవాలయాలల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం నుండే బాబా మందిరాలు ప్రత్యేకంగా అలకరించడంతో పాటు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని రావినూతల, దైవాలరావూరు గ్రామాలల్లో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు సాయిబాబా దేవాలయాలకు హజరై ప్రత్యేక పూజలల్లో పాల్గొన్నారు.

బల్లికురవ : మండలంలోని నక్కబొక్కలపాడు హనుమాన్‌సాయి మందిరం, ఉప్పుమాగులూరు సాయిబాబా దేవాలయంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా సాయిబాబా దేవాలయాలను భక్తులు పెద్దఎత్తున దర్శించుకొని ప్రత్యేక హారతులు నిర్వహించారు. నక్కబొక్కలపాడు దేవాలయంలో మృత్యుంజయ హోమం, అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో పలు గ్రామాలకు చెందిన సాయి భక్తులు పాల్గొన్నారు.

మార్టూరు :గురుపౌర్ణిమ వేడుకలు గురువారం మండలంలోని సాయిబాబా దేవాలయాల్లో భక్తులు ఘనంగా నిర్వహించారు. మార్టూరులో బొడ్డురాయి కూడలి సమీపంలోని బాబా దేవస్థానంలో భక్తులు స్వామి వారికి హారతులు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అదేవిధంగా స్వామి వారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఇంకా పడమర బజారున వాటర్ ప్లాంటు సమీపంలోని దేవస్థానంలో కూడా ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు, భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం మార్టూరు గ్రామంలో అర్చకులు కొండకావూరి హరి బాబు పర్యవేక్షణలో స్వామి వారిని ఉత్సవ మూర్తిని ట్రాక్టరుపై ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు గ్రామోత్సవాన్ని తిలకించి, స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. యద్దనపూడి మండలంలోని గన్నవరం గ్రామంలో సాయిబాబా దేవస్థానంలో భక్తులు గురుపౌర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించారు.


మార్టూరు తూర్పుబజారులో బాబా గ్రామోత్సవం

పంగులూరు : మండలంలోని ముప్పవరం, పంగులూరు గ్రామాలలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముప్పవరం గ్రామంలోని శ్రీలక్ష్మీ గణపతి షిర్డీ సాయిబాబా ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారికి హారతి, పంచామృత అభిషేకాలు, చతుర్వేదపారాణం, ఉత్సవమూర్తికి పంచామృతంతో అభిషేకం, సామూహిక సత్య వ్రతములు, విశేష పూజలు నిర్వహించారు. వేలాదిమంది భక్తులు తరలిరాగా వారందరికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సర్వేపల్లి దివ్యరూపాచారి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు జరిగాయి.

అద్దంకి: గురుపౌర్ణమి సందర్భంగా గురువారం పలు దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అద్దంకి పట్టణంలోని సాయిబాబా దేవాలయం, దత్తపాదుకా క్షేత్రం, శింగరకొండలోని సాయిబాబా దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

చినగంజాం, జూలై 10(ఆంధ్రజ్యోతి) : స్థానిక హనుమసాయి కుటీరంలోని షిరిడి సాయి మందిరంలో, మున్నంవారిపాలెం రైల్వే గేటు కూడలిలోని షిరిడి సాయిబాబా మందిరంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. షిరిడి సాయి మందిరాల్లో గురుపౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో సాయినాథునికి ఉదయం సుప్రభాతసేవ, కాకడహారతి అనంతరం బాబావారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. మందిరాల్లోని సాయిబాబాని నూతన వస్త్రాలు, ఆభరణాలు, పలు రకాల పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి, విశేషపూజలు నిర్వహించారు. భక్తులు సాయినాథునికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు ధునిలో కొబ్బరికాయలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం హారతి తదనంతరం ఆలయాల ప్రాంగణాల్లో భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. రాత్రి సంధ్యాహారతి అనంతరం బాబాకి పుష్పాభిషేకం, శేషహారతి కార్యక్రమాలను నిర్వహించారు. అంకిత సాయి భక్తుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉద్యోగ నైపుణ్యాల కోర్సులను సద్వినియోగపర్చుకోండి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు

అద్దంకిటౌన్, జూలై 10(ఆంధ్రజ్యోతి): కళాశాల విద్యాశాఖ, బెంగుళూరుకు చెందిన ఉన్నతి ఫౌండేషన్ కురుద్చుకున్న ఒప్పందంలో భాగంగా నూతనంగా ఉద్యోగ నైపుణ్యాలపై ప్రతే ్యక శిక్షణ కోర్సులను అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు అన్నారు. గురువారం కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు నూతనంగా ఏర్పాటు చేసిన కోర్సు ఇతర కోర్సులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 30 రోజుల పాటు రోజు ప్రతి రోజు మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఇ వ్వనున్నట్లు తెలిపారు. ఉన్నతి పౌండేషన్ ప్రతినిధి డి.సృజన్ మాట్లాడుతు ఉన్నతి ఫౌండేషన్ ఎటువంటి లాభాపేక్షలేని స్వచ్ఛంద సంస్థ అని, ఈ సంస్థ దేశ వ్యాప్తంగా ఒక మిలియన్ యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తోందన్నారు.. ఎంప్లాయిబిలిటి స్కిల్స్‌పై డిగ్రీ చివరి సంవత్సరం చదవుతున్న విద్యార్థులకు శిక్షణ నిర్వహించి ఈ-సర్టిపికేట్ అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాల సమన్వకర్తలు అధ్యాపకులు వి.సత్యనారాయణ, షేక్ మస్తాన్‌వలి, షర్మిల రాణి, ఏ.శికామణి, వినుకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళామండలిలో ఆరోగ్య పరీక్షలు


చీరాల, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మహిళమండలిలో గురువారం హైరిస్క్ ఉన్న వ్యక్తులకు హెపటైటిస్ బి, సి పరీక్షలు నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం, మెడికల్ అండ్ హెల్త్ వారు సంయుక్తంగా నిర్వహించిన పరీక్షల్లో ప్రతినిధులు మాట్లాడుతూ హెచ్‌ఐవితో పాటు ఇతర వైరల్ ఇన్‌ఫెక్షన్స్ తగ్గించేందుకు ఇది తొలి అడుగని వివరించారు. (ఏపిఎస్ఏసిఎస్)స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు పరీక్షలు నిర్వహిచినట్లు చెప్పారు. కారయక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ వెంకటరావు, ఏఎన్ఎం సీయోను కుమారి, జ్యోతి, సంధ్యారాణి, దానమ్మ, దివ్యభాను, విజయ్, శిరీష, గీత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రాతపుస్తకాలు, అట్టల అందజేత


అద్దంకిటౌన్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో బొమ్మనంపాడు ప్రాథమిక పాఠశాలలో గురువారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం హెచ్‌ఎం బీ.చంద్రశేఖరరావు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామా నికి చెందిన ఎస్‌బీఐ విశ్రాంత ఉద్యోగి యరమోతు నాగేశ్వరరావు విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పలకలు అందజేశారు. గ్రామ మాజీ సర్పంచ్ యర మోతు అచ్చమ్మ జ్ఞాపకార్థం కుమారుడు ఉపాధ్యాయుడు ఆదినారాయణ పాఠ శాలకు సీలింగ్ ప్యాన్‌ను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ యరమోతు శ్రీను, వైస్ చైర్మన్ యరమోతు మనిషా, ఉపాధ్యాయుడు షేక్ మస్తాన్‌వలి, చెన్నుపాటి రామారావు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం, తాగునీటిపై దృష్టి సారించండి

● ఎంపీడీవో స్వరూపారాణి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

పంగులూరు, జూలై 10 (ఆంధ్ర జ్యోతి):గ్రావ ాల్లో పారిశుధ్యం, తాగునీరు ప్రధాన అంశాలుగా అధికారులు, సిబ్బంది పనిచేయాలని ఎంపీడీవో స్వరూపారాణి అన్నారు. పంగులూరు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం గురువారం ఎంపీపీ తేళ్లనాగమ్మ అధ్యక్షతన నిర్వహించారు. రీసర్వే జరిగిన గ్రామాలలో పలుచోట్ల జాయింట్ ఎల్‌పీఎంలు నమోదయ్యాయని, వాటిని విడగొట్టేందుకు రైతులు సమష్టిగా ముందుకు రావాలని తహసీల్దార్ సింగారావు కోరారు. దివ్యాంగులు 60 ఏళ్లుదాటిన వృద్ధులకు ఇంటివద్దనే రేషన్ అందజేయనున్నట్లు తెలిపారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు బీమా సౌకర్యం పొందేందుకు ప్రీమియం చెల్లించాలని ఏవో సుబ్బారెడ్డి సూచించారు. మండలంలో నూతనంగా రోడ్ల నిర్మాణానికి అలవలపాడు నుండి రేణంగివరం వరకు రూ.2.80 కోట్లు, చందలూరు నుంచి గంగవరం రోడ్డు పునర్నిర్మాణానికి రూ.2 కోట్లు, కొండ మంజులూరు కొండపైకి ఘాట్‌రోడ్డు నిర్మాణానికి కోటి రూపాయల నిధులు మంజూరయినట్లు పీఆర్‌ఏఈ హనుమంతరావు తెలిపారు. గత విద్యా సంవత్సరంలో 11 మంది విద్యార్థులకు ట్రిబుల్ ఐటీ సీట్లు లభించాయని ఎంఈవో వీరాంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏఈ ఆంజనేయులు డాక్టర్ బాల రాజేశ్వరి, పశువైద్యాధికారి మురళీకృష్ణ, ఉద్యానాధికారి దివ్య, జడ్పీటీసీ సభ్యురాలు. రాయిణి ప్రమీల, మండల ఉపాధ్యక్షులు ఎర్రం శ్రీనివాసరెడ్డి, ఏపీఎం. కోటేశ్వరరావు, ఏపీవో సంతోషం, హౌసింగ్ ఏఈ కిషోర్, రాంబాబు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.





పొదలకూరులో తల్లులకు పాదాభివందనం చేస్తున్న విద్యార్థులు

పాఠశాలల్లో సంబరం

ఉత్సాహంగా మెగా పీటీఎం 2.0

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడంతోపాటు సహృద్భావ వాతావరణం కల్పించేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలల్లో నిర్వహించిన సంబరాలు అంబరాన్నంటాయి. పాఠశాలల్లో ఉత్తమ విద్య అందించేందుకు, అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేసేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను కలిపి ఒకే వేదికపైకి చేర్చడంతో విద్యాసంస్థల్లో పండుగ వాతావరణం నెలకొంది. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి తల్లిదండ్రులతో విద్యా పరమైన అంశాలను చర్చించడంతో పాటు ఆటపాటలు, సహపంక్తి భోజనాలు చేసి పిల్లల ప్రగతి నివేదికలు అందచేశారు. గురువారం జిల్లాలోని 4,422 పాఠశాలల్లో, కళాశాలల్లో నిర్వహించిన మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ 2.0 కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయి. విద్యార్థులందరికీ తల్లిపేరుతో మొక్కలను పంపిణీ చేశారు.

● కళాశాలల్లో సమావేశాలు ఏవీ!?

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లోనూ మెగా పీటీఎం నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినా కళాశాలల్లో ఎక్కడా ఈ కార్యక్రమాలు నిర్వహించలేదు. నగరంలోని డీకే జూనియర్ కళాశాల, కేఏసీ, జీవీఆర్ఆర్ కళాశాలల్లో మాత్రం సమావేశాలు నిర్వహించారు. వీటిలో కూడా ఇంటర్ బోర్డు అధికారులెవరూ పాల్గొనక పోవడం విశేషం. ప్రైవేట్ కళాశాలల్లో అయితే ఇలాంటి సమావేశాలు నిర్వహిస్తున్నామన్న సమాచారం కూడా తల్లిదండ్రులకు, విద్యార్థులకు ఇవ్వలేదని పలువురు తల్లిదండ్రులు తెలిపారు.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)



నెల్లూరు : వైవీఎం స్కూలులో లెమన్ స్పూన్ పోటీలో తల్లులు



ఉదయగిరిలో తల్లిపేరుతో మొక్క అందుకుంటూ..



నెల్లూరు : బాలాజీనగర్ సాయిదర్బార్‌లో ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

శ్రీగురుభ్యో నమః

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా గురుపౌర్ణమి వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. శైవ ఆలయాల్లో గురు దక్షిణామూర్తికి, వైష్ణవ ఆలయాల్లో హయగ్రీవునికి, వ్యాస మహర్షికి విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. షిరిడీ సాయిబాబా మందిరాల్లో విశేష పూజలు, భారీ స్థాయిలో అన్నదానం జరిగాయి. భక్తులతో సాయి మందిరాలు కిటకిటలాడాయి. నాలుగు పూటల షిరిడీ హారతులు, సాయి సచ్చరిత్ర పారాయణం జరిగాయి. కొన్ని వైష్ణవ ఆలయాల్లో గురుపౌర్ణమి సందర్భంగా సత్యనారాయణ వ్రతాలు జరిగాయి. పలు పాఠశాలల్లో గురువులను పూజించారు.

నేటి నుంచి రెవెన్యూ క్రీడలు

నెల్లూరు (హరనాథపురం), జూలై 10 (ఆంధ్రజ్యోతి) రెవెన్యూ క్రీడల నిర్వహణకు రెవె న్యూ యంత్రాంగం, ఏపీఆర్ఎస్ఏ సిద్ధమయ్యాయి. శుక్రవారం నుంచి ఈనెల 13వ తేదీ వరకు ఈ క్రీడలు నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరుగనున్నాయి. పోటీలను జిల్లా జడ్జి జీ శ్రీనివాస్ ప్రారంభిస్తారు. కలెక్టర్ ఆనంద్ పాల్గొంటారు. ఉద్యోగుల మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించడం, ఉద్యోగుల మధ్య స్నేహభావనకు ఈ క్రీడలు దోహదపడతాయి. క్రికెట్, క్యారమ్స్, చెస్, లెమన్ స్పూన్, టగ్ ఆఫ్ వార్, వాలీబా ల్, జావెలిన్ త్రో తదితర అంశాల్లో పోటీ లు నిర్వహించనున్నారు. నగరంలోని ఏపీఆర్ఎస్ఏ కార్యాలయానికి చేరిన క్రీడా దుస్తులను డివిజన్ల వారీగా ఉద్యోగులు, అధికారులకు పంపిణీ చేశారు.

ఖరీఫ్ పంటలకు బీమా

నెల్లూరు(వ్యవసాయం), జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటల బీమా పథకాన్ని ప్రభుత్వం రైతులకు అందుబాటు లోకి తీసుకొచ్చిందని జిల్లా వ్యవసాయాధికారి పీ సత్యవాణి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద దిగుబడి ఆధారంగా వరి, వేరుశనగ పంటలను నోటిఫై చేసినట్లు పేర్కొన్నారు. ఎకరా వరి పంటకు రూ.840, వేరుశనగ పంటకు రూ.700 చొప్పున రైతులు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. వరికి ఆగస్టు 15, వేరుశనగ పంటకు జూలై 31వతేదీ వరకు గడువు ఇచ్చినట్లు తెలిపారు. వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద పత్తి, నిమ్మ పంటలను నోటిఫై చేసినట్లు పేర్కొన్నారు. పత్తికి రూ.2వేలు, నిమ్మకు రూ.2400 ప్రీమియం చెల్లింపునకు ఈ నెల 17వతేదీ వరకు గడువు ఇచ్చినట్లు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, దిగుబడి తగ్గిన సమయాల్లో ఈ బీమా పథకాలు రైతులకు ఉపయోగపడతాయని వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉచిత ప్రయాణం సాఫీగా సాగేలా...

బస్సుల కండీషన్స్‌పై ఉన్నతాధికారుల దృష్టి

సర్వీసులు బ్రేక్‌డౌన్ కాకూడదని స్పష్టత

డిపోల వారీగా అవసరాల గుర్తింపు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జూలై 10 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ఆగస్టు 15 నుంచి ప్రారంభించనుంది. ఈ క్రమంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు జిల్లాల వారీగా ప్రాంతీయ రవాణాధికారులతో సమీక్షించారు. రీజియన్‌లో బస్సుల సంఖ్య, షెడ్యూల్స్ ఓఆర్, బస్సుల కండీషన్స్, ఓఆర్ పెరిగితే ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏం చేయాలి? స్పేర్ పార్ట్సు అన్ని ఉన్నాయా.. ఇంకా ఏం కావాలి? ఇలా పలు అంశాలపై చర్చించారు. నెల్లూరు ఆర్ఎం షేక్ షమీమ్ జిల్లాకు కావాల్సిన అవసరాలను రాష్ట్ర అధికారులకు తెలిపారు.

అన్ని చర్యలు తీసు కుంటున్నాం!

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన మంగళగిరిలో జరిగిన ఆర్టీసీ బోర్డు మీటింగ్ పలు అంశాలపై విస్తృతంగా చర్చించి నట్లు తెలిపారు. ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులకు వసతుల కల్పనకు త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయన్నారు. ఆగష్టు 15 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. అందుకు సంబంధించి రద్దీ ప్రాంతాల్లో అద్దె బస్సులను తీసుకునేలా ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు.

● డిపోల వారీగా అవసరాలు

జిల్లాలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాక బస్సులు బ్రేక్‌డౌన్ కాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్ఎంను ఆదేశించారు. రీజియన్‌లో ఎన్ని డిపోలు ఉన్నాయి.. ఏ డిపోలో ఎన్ని బస్సులు ఉన్నా యి... వంద శాతం ఓఆర్ వస్తే బస్సులు నడిచే పరిస్థితులు ఉన్నాయా, డిపోలోని గ్యారేజ్‌లలో మీకు బస్సుల రిపేర్లకు కావాల్సిన వస్తువులు, మరేవైనా అవసరాలు తెలపండి అంటూ ఆర్ఎంను కోరారు. దీంతో ఆర్ఎం డిపోల వారీగా ఉన్నవాటి వివరాలు, అవసరాలను ఉన్నతాధికారులకు తెలియజేశారు.

● స్పేర్‌పార్టులు పంపండి

రీజియన్‌లోని ఏడు డిపోల పరిధిలో పలు స్పేర్‌పార్టులు కావాలని అధికారులకు విన్నవించుకున్నారు. కందుకూరు డిపోలో బీఎస్-6 టూల్స్ కావాలని, ఎలక్ట్రికల్ కేబుల్స్ రీప్లేస్‌డ్ చేయాలని, టవర్ లైట్స్ కావాలని, ఆయిల్ బంకు, వాషింగ్ ప్లాంట్ ఏరియాల్లో సెక్యూరిటీ గార్డులు కావాలని కోరారు. కావలి డిపో పరిధిలో స్ప్రింగ్ యు క్లాంప్ బిట్స్, పైప్ రించ్‌లు కావాలని, నెల్లూరు-1వ డిపో పరిధిలో స్ప్రింగ్ క్యాంబరింగ్ మిషన్ ఉంచేందు రూమ్, నైట్ పెట్రోలింగ్ సెక్యూరిటీ పర్సన్, అడిషనల్ సూపర్‌వైజర్ కావాలని, నెల్లూరు-2వ డిపో పరిధిలో స్ప్రింగ్ క్యాంబెరింగ్ మిషన్ కావాలని, గ్యారేజ్‌లో కొందరు సిబ్బంది కావాలని కోరారు. రాపూరు డిపో పరిధిలో టామి రోడ్స్ ఈ15 స్పేర్స్ కావాలని, గ్యారేజ్‌లో లైటింగ్‌కు సంబంధించి, ఇతర అవసరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.





ఇక సెలవ్.. మళ్లీ వస్తాం!

చివరి రోజు కూడా భక్తులతో రద్దీగా ఉన్న స్వర్ణాల చెరువు ఘాట్

● నెల్లూరులో ముగిసిన రొట్టెల పండుగ ● ఐదు రోజుల్లో 11 లక్షల మందికిపైగా భక్తుల రాక

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మత సామరస్యానికి ప్రతీకగా నెల్లూరులో జరుగుతున్న రొట్టెల పండుగ గురువారం రాత్రి ముగిసింది. ఈ నెల 10వ తేదీన పండుగ ప్రారంభమవగా ఐదు రోజులపాటు 11 లక్షల మందికి పైగా భక్తులు హాజరైనట్లు అధికారుల అంచనా. ఉభయ తెలుగురాష్ట్రాలతోపాటు హరియానా, ఒడిశా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కేరళా, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి భక్తజనం తరలివచ్చి, వరాల రొట్టెలను అందుకుంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా అధికార యంత్రాంగం, కార్పొరేషన్ సిబ్బంది విస్తృత సేవలు అందించారు. కాగా, గురువారం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కుటుంబంతో కలిసి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధిలో అగ్రగామిగా నిలవాలని కోరుతూ సంక్షేమం రొట్టెను పట్టుకున్నారు.

● అందరి సహకారంతోనే..

అందరి సహకారంతోనే రొట్టెల పండుగ విజయవంతమైందని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. గురువారం సాయం త్రం దర్గా ఆవరణలోని ఏపీ టూరిజం పార్కులో వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో రొట్టెల పండుగత ముగింపు సభలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితో కలిసి అజీజ్ పాల్గొని మాట్లాడారు. దర్గాలో మసీదు, ఈద్గా నిర్మాణాలకు టెండర్లు త్వరలోనే పిలవనున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో దర్గా అభివృద్ధికి మరింత కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నగర కమిషనర్ నందన్, ఆర్డీవో అనూష, డీఎస్పీ సింధుప్రియ, మైనార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ముగింపు సభలో మాట్లాడుతున్న అబ్దుల్ అజీజ్

● పటిష్ఠ బందోబస్తు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : రొట్టెల పండుగలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు అధికారులు 1700 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. రద్దీలో తప్పిపోయిన 200 మంది చిన్నారులను తల్లిదండ్రులకు అప్పగించారు. ఐదుగురు జేబుదొంగలను అదుపులోకి తీసుకుని వారి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించారు. బందోబస్తు విధులను సమర్థవంతంగా నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ కృష్ణకాంత్, ఏఎస్పీ సౌజన్య అభినందించారు.

యూరియా... ఏదయ్యా!

● దూరప్రాంతాలకు వెళుతున్న రైతులు

● రెట్టింపు ధర చెల్లించి కొనుగోళ్లు

● చోద్యం చూస్తున్న వ్యవసాయ అధికారులు

ఉదయగిరి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అడపాదడపా కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్‌లో పంటల సాగు జోరందుకుంది. ఈ సమయంలో యూరియా దొరక్క రైతులు ఆందోళన చెం దుతున్నారు. దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాలు, సహకార సంఘాలు, ఎరువుల దుకాణాల్లో యూరి యా దొరకడం లేదు. దీంతో కొంతమంది రైతులు దూరప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. ఇదే అవకాశంగా భావించి కొంతమంది వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తూ రైతులను దోచుకుంటున్నారు.

● కాంప్లెక్సు ఎరువులు కొంటేనే...

ఎరువుల కంపెనీలవారు కాంప్లెక్సు ఎరువులు కొంటేనే యూరియా విక్రయిస్తామని చెబుతుండడంతో డీలర్లు వెనుకంజ వేస్తున్నారు. రైతుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని కొంతమంది డీలర్లు యూరియాతోపాటు కాంప్లెక్సు ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. అయితే కొంతమంది డీలర్లు రైతులకు కూడా ఇదే షరతు పెట్టడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 45 కిలోల యూరియా బస్తా మార్కెట్ ధర రూ.1,457.29లు కాగా కేంద్ర ప్రభుత్వం రూ.1,190.79 రాయితీ ఇవ్వడంతో రూ.266.50లకు విక్రయిస్తున్నారు. కానీ కొంతమంది అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అక్కడ బస్తా రూ.420 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. అయినా వ్యవసాయ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. ఇప్పటికైనా యూరియాను అందుబాటులోకి తీసుకు రావాలని రైతులు కోరుతున్నారు.

కలిగిరిలో 'బ్లాక్'!

కలిగిరి : ప్రభుత్వ దుకాణాల్లో యూరియా కొరత ఏర్పడింది. దీంతో ప్రైవేటు దుకాణదారులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తుండటంతో అన్నదాత ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కలిగిరి మండలంలో వరి 25.49 హెక్టార్లు, వేరుశనగ 120.59 హెక్టార్లు, నువ్వులు 46.53 హెక్టార్లు, మొక్కజొన్న 68.79హెక్టార్లు, మినుము 19 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పైరు సాగుచేయాలంటే సేంద్రియ ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రసాయనిక ఎరువులే దిక్కుగా మారాయి. మండలంలోని కలిగిరి, కుడుములదిన్నెపాడు, సిద్ధనకొండూరులలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నా అవసరం మేరకు యూరియా అందుబాటులో లేదు. దీంతో ప్రైవేటు వ్యాపారుల కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరకు విక్రయిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గరిష్ఠ ధర రూ.266 ఉండగా ప్రైవేటు దుకాణాల్లో రూ.390 నుంచి 420 వరకు విక్రయిస్తున్నారు. కొనుగోలు రశీదు కూడా ఇవ్వడం లేదని వాపోతున్నారు. వ్యవసాయ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవనే విమర్శలు ఉన్నాయి.



కలిగిరి : యూరియా బస్తాలను ఆటోలో తీసుకెళుతున్న రైతు



ఉదయగిరి ప్రాంతంలో పసుపు విత్తుతున్న కూలీలు (ఫైల్)

అధిక ధరకు కొనుగోలు చేస్తున్నాం

స్థానికంగా యూరియా అందుబాటులో లేకపోవడంతో వేరే మండలానికి వెళ్లి బస్తా రూ.420ల చొప్పున కొనుగోలు చేస్తున్నాం. ఇటీవల వర్షం కురిసింది. ప్రస్తుతం పంటలకు యూరియా వేయాల్సి ఉంది. ఈ తరుణంలో యూరియా ఎంతో అవసరం.

- దేవసాని చెంచురామిరెడ్డి, కృష్ణారెడ్డిపల్లి

ఎన్నడూ ఈ పరిస్థితి లేదు

యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడడం ఎన్నడూ చూడలేదు. ప్రస్తుతం పంటల సాగు జోరందుకోవడంతో యూరియా అవసరం. ఇప్పటికైనా అధికారులు స్పందించి యూరియాను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలి.

- కొండా రమణారెడ్డి, రైతు, బిజ్జంపల్లి

అధిక ధరలు భారంగా ఉన్నాయి

10 ఎకరాల్లో వరి పండిస్తున్నాను. ప్రభుత్వ దుకాణాల్లో ఎరువులు అందుబాటులో లేవు. దీంతో ప్రైవేటు దుకాణాల వద్ద అధిక ధరలు పెట్టి ఎరువులు కొనాల్సి వస్తోంది. దీంతో పెట్టుబడులు అధికమవుతున్నాయి. అధికారులు స్పందించి యూరియా కొరత తీర్చాలి.

- తిరుణమల్లి గోపి, అగ్రహారం

యూరియా కొరత లేదు

జిల్లాలో యూరియా కొరత లేదు. ఇటీవల జిల్లాకు 2,600 టన్నుల క్రిబ్‌కో యూరియా వచ్చింది. ప్రస్తుతం వెయ్యి టన్నుల యూరియా అందుబాటులో ఉంది. అక్కడి అధికారులతో చర్చించి రైతుసేవా కేంద్రాలు, సహకార సంఘాలకు సరఫరా చేస్తాం.

- పవన్, మార్క్‌ఫెడ్ డీఎం

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	121
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	242

కోడిగుడ్ల ధర (100): 540

ఉపాధి పనుల్లో బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు

లింగసముద్రం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు తీసుకుంటామని మండల ఏపీవో షేక్ సమీర్‌బాషా తెలిపారు.గురువారం లింగసముద్రం లోని వాకమళ్లవారిపాలెంలో పంట కాలువల పూడికతీతను ఆయన తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ బోగస్ మస్టర్ల కారణంగా పని చేసినవారికి తక్కువ డబ్బులు వస్తాయని ఆయన తెలిపారు.ఈ విషయాన్ని శ్రామికులు గమనించాలని చెప్పారు.ఒకరి బదులు మరొకరు పనులకు రావద్దని చెప్పారు.శ్రామికులు ఉదయం 6 గంటలకే పనులకు వచ్చి 10 గంటల వరకు పనిచేసి వెళ్లాలన్నారు.



శ్రామికుల మస్టర్లను తనిఖీ చేస్తున్న ఏపీవో సమీర్‌బాష

న్యూస్ బాక్స్

అగ్రికల్చరల్ అసిస్టెంట్‌కు సన్మానం



నాగరాజును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు మోహన్‌కుమార్

వలేటివారిపాలెం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంకభూపాలపురం సచివాలయంలో అగ్రికల్చరల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ కనిగిరి సచివాలయానికి బదిలీ అయిన నాగరాజుకు ఆ గ్రామ టీడీపీ నాయకులు ప్రగడ మోహన్‌కుమార్ గురువారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రగడ బలరామయ్య, చెంచు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకానికి ప్రోత్సాహకాలు



సాగులో ఉన్న నిమ్మ

వలేటివారిపాలెం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మెట్ట భూముల్లో పండ్ల తోటల పెంపకానికి కూటమి ప్రభుత్వం భారీ ప్రోత్సాహకాలు ప్రకటించింది. మండలంలోని చుండి, అయ్యవారిపల్లె, పోలినేనిచెరువు, గరుకుపాలెం, వీరన్నపాలెం, పెదఅమ్మపాలెం, కాకర్లపాలెం, వలేటివారిపాలెం, అంకభూపాలపురం, రామచంద్రాపురం, గ్రామాల్లోని మెట్ట భూముల్లో పండ్లతోటలు సాగు చేసుకునేందుకు అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వం రాయతీలు ప్రకటించడంతో మళ్లీ పండ్ల తోటల సాగుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆయా గ్రామాల్లో నిమ్మ, జామ, మామిడి, డ్రాగన్ తదితర పండ్ల తోటలతో పాటు పూలతోటలు సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. వీటి సాగుపై ఆసక్తి కలిగిన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, వన్‌బీ పత్రాలు, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌పుస్తకం, సన్నచిన్నకారురైతు ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని ఉపాధి హమీ ఏపీవో దయాసాగర్ తెలిపారు.

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

అల్లూరు, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కావలిలో శుక్రవారం నిర్వహించనున్న ప్రత్యేక విద్యుత్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ ఏఈ మస్తాన్ షరీఫ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విశ్రాంత న్యాయాధికారి శ్రీనివాస అంజనేయమూర్తి ఆధ్వర్యంలో చేపట్టే ఈ అదాలత్‌లో వినియోగదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కావలి విద్యుత్ ఆపరేషన్ డివిజన్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

త్వరలో పాలిటెక్నిక్‌కు స్పాట్ అడ్మిషన్లు

కావలి రూరల్, జూలై10(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్‌లో చేరేవారికి త్వరలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కావలి మండలం రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుశీల్‌కుమార్ ప్రియ గురువారం ఒక ప్రకటన లో పేర్కొన్నారు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా తొలిదశ అడ్మిషన్ల పూర్తయ్యాయని, సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో ఖాళీగా ఉన్న 61 సీట్లకు, ఎలక్ట్రికల్‌లో ఖాళీగా ఉన్న 49 సీట్ల కు రెండవదశ అడ్మిషన్లు ప్రారంభమవుతాయన్నారు. స్పాట్ అడ్మిషన్ల దరఖాస్తులు ప్రిన్సిపాల్ రూంలో అందుబాటులో ఉన్నాయన్నారు. పూర్తి సమాచారం కోసం 94403 94524, 79813 07400, 99129 83434, 73822 19762, 93980 95597 నెంబర్లను సంప్రదించాలన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

కొండాపురం, జూలై10(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బొడ్డు అనూరాధ అధ్యక్షతన సాదాసీదాగా జరిగింది. ఆరోగ్య, విద్య, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్, పారిశుధ్యం, పశుసంవర్ధకశాఖ, ఇరిగేషన్, హౌసింగ్ తదితర అంశాలపై గత మూడునెలల కాలంలో జరిగిన అభివృద్ధి పనులపై ఎంపీడీవో ఆదినారాయణరావు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈకార్యక్రమంలో పలుశాఖల అధికారులు, పంచాయతీకార్యదర్శులు, ఎమ్‌పీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ అనూరాధ

విద్యార్థుల భవిష్యత్‌కు పునాదులు తల్లితండ్రులు, ఉపాధ్యాయులే!







కావలి : కేజీబీవీ పాఠశాలలో తల్లితండ్రులకు మొక్క అందిస్తున్న ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి, కలిగిరి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్, పాలూరు దొండపాడు పాఠశాలో జరిగిన సరస్వతీపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టరు శ్రీపూజ

పీటీఎంలో వక్తలు
స్కూళ్ల అభివృద్ధిపై చర్చ
తల్లిదండ్రులకు క్రీడా పోటీలు

కావలి/కావలి(టౌన్), జూలై10(ఆంధ్రజ్యోతి) విద్యార్థుల భవిష్యత్‌కు పునాదులు తల్లితండ్రులు ఉపాధ్యాయులేనని ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. పీటీఎంను గురువారం ముసునూరులోని కేజీబీవీ ఉన్నత పాఠశాల, కావలి రూరల్ మండలం రుద్రకోటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖారాలు అధిరోహించాలన్నారు. అనంతరం తల్లితండ్రులకు మొక్కలు పంపిణీ చేసి ప్రాంగణంలో మొక్కలు నాటారు. కేజీబీవీ పాఠశాలలో నీటిసౌకర్యంలేదని తల్లితండ్రులు ఎమ్మెల్యే దృష్టికి తేగా వెంటనే సొంత నిధులతో బోరు వేయిస్తానని హమీ ఇచ్చారు. రుద్రకోట పాఠశాలలో తాగునీటికి ఇబ్బందులు పడతున్నా మని చెప్పగా, వాటర్‌ప్లాంట్ కోసం రూ.35వేలు అందచేస్తానని చెప్పారు. కార్యక్రమాలలో డిప్యూటీ డీఈవో హరిప్రసాద్, ఎంఈవో-2 వెంక టసుబ్బయ్య, కేజీబీవీ ప్రిన్సిపాల్ సంధ్యారాణి, రుద్రకోట ఎస్ఎంసీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, ప్ర ధానోపాధ్యాయుడు చాగంటి మురళి, సోమశిల ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ మధుబాబునా యుడు, జ్యోతి బాబురావు, బీమా రంగారావు తదితరులు పాల్గొన్నారు.

● కావలి జడ్పీ పాఠశాల ప్రాంగణంలోని భవిత సెంటర్‌లోని విద్యార్థి మనోహర్ పదిలో ఉత్తీర్ణత సాధించి ఆదర్శంగా నిలవడంతో డిప్యూటీ డీఈవో హరిప్రసాద్ చేతుల మీదుగా మెరిట్ స్కాలర్‌షిప్ అందించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 వెంకటసుబ్బయ్య, జేవీవీ బాధ్యులు హరనాథ్ సుబ్బరామశర్మ, పీడీ చిరంజీవి, రమణయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

● **కలిగిరి :** పిల్లల భవిష్యత్ లో ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు కూ డా భాగస్వాములేనని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. స్థానిక ఏపీమోడల్ స్కూల్‌లో గు రువారం పీటీఎంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు పాఠశాలలకు వచ్చి తమ పిల్లల చదువు, క్రమశిక్షణ తదితర అంశాలపై ఉపాధ్యాయులతో చర్చించాలని పే ర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఏ శ్రీను, అధ్యాపక సిబ్బంది టీడీపీ, జనసేన నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు, కాగా కలిగిరి మండలంలోని తూర్పుమాలపాలెం ప్రాథమిక పాఠశాలలో జైగౌడ ఉద్యమం ని యోజకవర్గ అధ్యక్షుడు పంది మాల్యాద్రి గురు వారం సుమారు 40మంది విద్యార్థులకు అవస రమైన పలకలు, నోటుపుస్తకాలు, పెన్సిల్, పె న్నులను అందజేశారు. పీటీఎంను పురస్క రించుకొని వీటిని అందచేశారు. అనంతరం తల్లిదండ్రులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యుడు మహేష్, మాల్యాద్రి మిత్ర బృందం, పొన్నం చిన్నా, ఎస్కే జిలాని తదిత రులు పాల్గొన్నారు.

● **కందుకూరు :** మెగా పీ టీఎంను గురు వారం కందుకూరు పట్టణం, రూ రల్ మండలాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పండుగ వాతావరణంలో నిర్వహించారు. మండలంలోని పాలూరు దొండపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టరు శ్రీపూజలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సరస్వతీదేవికి పూజలు చేసి, తల్లిదండ్రులు, విద్యార్థులతో ముఖాముఖి నిర్వ హించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా అకడమిక్స్‌లో, సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తల్లికివందనం పథకం కింద ఐదుగురు పిల్లల తల్లి ఉమామహేశ్వరికి రూ. 65వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో అదనపు తరగతి గదికి ఉలవపాడుకు చెందిన ఎన్నారై భోగినేని చెంచురామానాయుడు ఆర్థికసహాయం ప్రకటించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లావణ్య, డిప్యూటీ డీఈవో నరసింహరావు, ఎంఈవోలు అజయ్‌బాబు, సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి, కంద్రా మా ల్యాద్రి, తల్లపనేని రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.



అల్లూరు : విజ్ఞాన జ్ఞాపికను అందుకుంటున్న బీద గిరిధర్ తదితరులు

●**కొండాపురం :** మండలం లోని ప్రభుత్వ, ప్రైవేటు, జూనియర్ కళాశాలల్లో గురువారం పీటీఎం 2.0ను నిర్వహించారు. ఎంఈవోలు కే. రవికుమార్, ఆనందరావు పా ల్గొన్నారు. మొక్కలు పంపిణీచేసి వాటిని నాటి సంరక్షించు కోవాల్సిందిగా ఉపాధ్యాయులు సూ చించారు. ఈ కార్యక్రమాలలో ప్రధానోపాధ్యా యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● **అల్లూరు :** పిల్లల క్రమశి క్షణలో తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని కె రీర్, మెంటల్ హెల్త్ కౌన్సిలర్ ఎ.మధు అన్నారు. పీటీఎంలో భాగంగా ఇస్కపల్లి జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆ యన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సోమ శిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిదర్, సర్పంచి పాటి రంజిత్, పాఠశాల కమిటీ చై ర్మన్ బుచ్చింగారి బాబు, మాజీ ఎంపీటీసీ గం గపట్నం శీనయ్య, నాయకులు దానం రజిని, హెడ్‌మాస్టర్ మాల్యాద్రి తదితరులు పాల్గొన్నా రు. నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపా ధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. పట్టణ ప రిధిలోని ఆర్‌డీఆర్ కాలనీలోని బీసీ బాలికల గురుకుల పాఠశాలను, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన పీటీఎం లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణచైతన్య, దయాకర్, ఇస్మాయిల్, నజీర్‌బాషా, రాజశేఖర్‌బాబు, ప్రిన్సిపాల్ కె.లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

● **లింగసముద్రం :** పాఠశాలల అభివృద్ధికి విద్యార్థుల తలిదండ్రులు కృషి చేయాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథ మికోన్నత, ఉన్నత పాఠశాలలు, ప్రైవే టు పాఠశాలల్లో పీటీఎం నిర్వ హించారు.మండలంలోని పెంట్రాల, వాకమళ్లవారిపాలెం, వెంగళాపురం పాఠశాలల్లో జరిగిన పీటీఎంలో ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఈవో-2 ఎంవీ శివకుమార్ పాల్గొన్నారు. అంగి రేకులపాడు హెచ్‌పీ పాఠశాలలకు మాజీ సర్పంచు టీడీపీ నాయకుడు ముప్పరాజు వెంకటేశ్వర్లు రూ.2 వేలు విరాళం అందజేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కిలారి కొండయ్య, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

● **ఉలవపాడు :** మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో గురువారం మెగా పీటీఎం ఉత్సాహభరితంగా జరుపుకున్నారు. ఆయా పాఠ శాలల విద్యా కమిటీ చైర్మన్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాలలు నిండిపోయాయి. తల్లిదండ్రులకు టగ్ ఆఫ్ వార్, ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు.

● **వలేటివారిపాలెం :** విద్యాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి గొట్టిపాటి హరికష్ణ తెలిపారు. మండలంలోని వలేటివారిపాలెం, పోకూరు, నలదలపూరు, శాఖవరం, అయ్యవారిపల్లె, చుండి మోడల్‌స్కూల్, కేజీబీవీ ప్రభుత్వ పాఠశాలలో గురువారం మెగా పీటీఎం పండుగలా జరిగింది.

వాడవాడలా వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

భక్తులతో కిక్కిరిసిన సాయిబాబా మందిరాలు ● ప్రత్యేక పూజలు

● అల్లూరు, (ఆంధ్రజ్యోతి) : గురుపూర్ణిమను పురస్కరించుకుని గురువారం మండలంలో వే డుకలు ఘనంగా నిర్వహించారు. అల్లూరు పే టలోని షిరిడి సాయినాథుడి ఆలయం, దత్తసా యి మందిరం, కలుగోళమ్మ ఆలయం వద్ద సాయి ఆలయం, తూర్పువీధిలోని సాయినాథుడి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఉద యం నుంచి అభిషేకాలు, లక్ష మల్లెలపూజను నిర్వహించారు.

● **లింగసముద్రం :** మండ లంలో గురుపౌర్ణమి వేడుకలు గురువారం వైభ వంగా జరిగాయి. చినపవని, పెదపవని తది తర గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో పం డుగను భక్తులు ఘనంగా నిర్వహించారు. చి నపవని సాయిబాబా ఆలయంలో భక్తులు సా యిబాబా విగ్రహాన్ని పూలతో ప్రత్యేకంగా అలం కరించారు.ఈ సందర్భంగా గ్రామస్థుల సహకా రంతో అన్నదానం నిర్వహించారు.



కలిగిరి : సాయినాథుడి పూజలో భక్తులు

● **కావలి :** ప్రతిఒక్క రూ యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం తో ఉంటారని యోగా గురువులు గోపాల్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, సావిత్రి తెలిపారు. పట్టణంలోని కొ త్తబజారు కన్యకాపరమేశ్వరి ఆలయంలో గురు పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం యో గా కేంద్రాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా యోగా గురువులు యోగా ఆవశ్యకతను గు రించి వివరించారు. ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ మన నిత్య జీవితంలో ఒక సాధనంగా యోగాను ప్రతి ఒక్కరూ అలవ ర్చుకోవాలన్నారు. అనంతరం దేవస్థానకమిటీ వారు ఎమ్మెల్యేను సత్కరించారు.

● **కలిగిరి :** స్థానిక సాయిబాబా ఆలయంలో గురువారం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నిర్వాహకులు అన్నసంతర్పణ చేశారు. సాయంత్రం ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.



కావలి : బాబా సేవలో మహిళా సేవకులు

● **కావలి(టౌన్) :** గురుపూర్ణిమ గురువారం పట్టణంలో వైభవంగా జరిగింది. ముసునూరు శ్రీసాయి క్షేత్రంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పొట్టేపాలెం నాగేశ్వరరావు పర్యవేక్షణలో పూజా కార్యక్ర మాలు జరిగాయి.అనంతరం ప్రాంగణంలోని వరసిద్ధి గణపతి స్వామి, సుబ్రమణ్యస్వామి, ఆంజనేయస్వాములకు చందనాలంకరణ చేసి, పూజలు నిర్వహించారు. పేదలకు వస్త్రాలు అం దచేశారు. విజయగణపతి భజన సమాజం వారి బాబా నామ సం కీర్తన, భజన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నసం తర్పణ చేశారు. అటవీ కార్యాలయం వీధిలోని బాబా మంది రంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని బాబాను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ బాధ్యులు టంగుటూరు ప్రసాద్, పోతుగంటి అలేఖ్య సభ్యుల పర్యవేక్షణలో భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

● **కందుకూరు :** గురుపౌర్ణమి సందర్భంగా గురువారం పట్టణంలోని కోవూరు రోడ్డులో ఉన్న సాయిబాబా ఆ లయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటుచేశారు. ప్రత్యేక పూజలకు ఎమ్మెల్యే ఇం టూరి నాగేశ్వరరావు హాజరయ్యారు. మండలంలోని మోపాడు వద్ద ఉన్న సాయి మందిరం లోనూ భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

● **బిట్రగుంట :** బోగోలు మండలంలోని షిరిడీసాయిబాబా మందిరాల్లో గురుపౌర్ణమి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. బోగోలు, విశ్వనాథరావుపేట, పాతబిట్రగుంట, కడనూతల, బిట్రగుంట ద్వారకానగరులోని సాయిబాబా మందిరాల్లో అన్నసంతర్పణ నిర్వహించారు.



లింగసముద్రం : చినపవనిలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా విగ్రహం



అల్లూరు : సాయినాథుడికి హారతి ఇస్తున్న అర్చకుడు

మందుబాబులకు అడ్డాగా పశువైద్యశాల ఆవరణ

● ఇబ్బందులు పడుతున్న పశువైద్యులు, సిబ్బంది

వలేటివారిపారిపాలెం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోకూరు పశువైద్యశాల ఆవరణ మందుబాబులకు అడ్డాగా మారింది. పశువైద్యులు, సిబ్బంది వైద్యశాల నుంచి ఇళ్లకు వెళ్లాక మందుబాబులు రాత్రివేళల్లో అక్కడ మద్యం సేవిస్తున్నారు. అంతే కాక మద్యం సీసాలు, సిగిరెట్లు, గుట్కాలు, బిర్యానీ ప్యాకెట్లు అక్కడే పడేస్తున్నారు. దీంతో పశువైద్యశాల భవనం ముందు అపరిశుభ్రత ఏర్పడుతుంది. పశువైద్యశాల బస్టాండు సెంటరులోనే ఉండడంతో మందుబాబులకు మద్యం తాగేందుకు అనువుగా ఉంది. దీంతో పశువైద్యులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మందుబాబులపై చర్యలు తీసుకోవాలి.



పశువైద్యశాల ఆవరణలో లోపించిన పారిశుధ్యం

ఆదిమూర్తిపురంలో ఇసుక డంప్

కొండాపురం, జూలై10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆదిమూర్తిపురంలో వైసీపీ నేత నల్లమోతు తిరుపతిస్వామి పెద్దఎత్తున ఇసుకను డంప్ చేశారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ కోటేశ్వరావు పోలీసులతో కలసి గురువారం గ్రామంలో పరిశీలనకు వెళ్లారు. ఇంతమొత్తంలో ఇసుకను ఎందుకు డంప్ చేశావని ఆయన్ను ప్రశ్నించగా, నూతనంగా ఇంటిని నిర్మించుకునేందుకు తెచ్చుకున్నానని చెప్పారు. ఇంటి నిర్మాణానికి ఉచితంగా ఏసమయంలోనైనా సరిపడినంత ఇసుకను తెచ్చుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తుంటే ఈవిధంగా డంప్ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. డంప్ చేసిన ఇసుక సుమారు 110 ట్రాక్టరు ట్రక్కులు ఉన్నట్లుగా గుర్తించామన్నారు. అక్రమంగా అమ్ముకునేందుకు ఇసుకను డంప్ చేశాడని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. విచారించి కేసు నమోదు చేయవలసినదిగా పోలీసులను ఆయన ఆదేశించారు.



ఇసుక డంప్ చేసిన వ్యక్తితో మాట్లాడుతున్న తహసీల్దార్ కోటేశ్వరరావు, పోలీసులు

విశిష్ట వ్యక్తులకు సన్మానం

కందుకూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): గురుపూజోత్సవం సందర్భంగా గురువారం స్థానిక బీజేపీ కార్యాలయంలో విశిష్ట వ్యక్తులకు సన్మానం నిర్వహించారు. ఉపాధ్యాయులుగా, సంఘ్ సేవకులుగా, బీజేపీ నాయకత్వ బాధ్యతల్లో సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న పలువురిని పట్టణ బీజేపీ అధ్యక్షుడు మన్నేపల్లి వరప్రసాదరావు ఆధ్వర్యంలో సత్కరించారు. సన్మానం అందుకున్న వారిలో మువ్వల భూషయ్య, బుర్రా కోటేశ్వరరావు, పల్లపోతు లక్ష్మీనారాయణ, కవర్తపు మల్లికార్జున, తానికొండ కోటయ్య, వాకాని శేషాచార్యులు ఉన్నఆరు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జొన్నాదుల రాఘవులు, వైకుంఠం, సురేష్, చుండి మురళీధర్, పాణ్యం గాంధీ, పాలూరు మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గురుపూజోత్సవం సందర్భంగా విశిష్ట వ్యక్తులను సత్కరించిన బీజేపీ నాయకులు

నాగులవరం పీఏసీఎస్ అధ్యక్షుడిగా చిలకపాటి



బిట్రగుంట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం నాగులవరం పీఏసీఎస్ అధ్యక్షుడిగా చిలకపాటి వెంకటేశ్వర్లును గురువారం ఎంపిక చేశారు. త్రీమెన్ కమిటీ ఏర్పాటుకు సంబంధించిన తీర్మాన మినిట్‌బుక్‌లో సంతకాల అనంతరం చిలకపాటి, ఎమ్మెల్యే వెంకటక్రిష్ణారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందచేసి శాలువాతో సన్మానించారు. త్రీమెన్ కమిటీలో వాయిల సుధా, లక్కాకుల మాధవరావులను డైరెక్టర్లుగా ఎన్నుకున్నారు.

మూడు జోన్లుగా స్ట్రీట్ వెండర్స్

కావలి,జూలై10(ఆంధ్రజ్యోతి) పట్టణ పరిధిలో ఉన్న స్ట్రీట్ వెండర్స్‌ను మూడు జోన్లుగా విభజించినట్లు మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. కమిషనర్ చాంబరులో గురువారం సాయంత్రం స్ట్రీట్‌వెండింగ్ కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్ట్రీట్ వెండర్లను గ్రీన్‌జోన్, రెడ్‌జోన్, ఆరంజిజోన్‌లుగా మూడు కేటగిరీలుగా విభజించి స్ట్రీట్ వెండర్స్‌కు అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ సమావేశంలో పట్టణ ప్రణాళికాధికారి వివేకానంద్ పాల్గొన్నారు.

కరేడు రైతులకు అన్యాయం

కందుకూరు, జూలై 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంలో ఉన్న టీడీపీ, ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ కలిసి కరేడు రైతులకు అన్యాయం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ నేతి మహేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. కరేడు రైతుల కన్నీటి గాథ చూస్తుంటే బాధ కలుగుతోందని, ఈ ఉపద్రవం నుంచి బయట పడాలంటే పార్టీలు ఆడే ఆటలో పావులు కాకుండా రైతులు తమ ప్రయోజనాల కోసం ఐక్యంగా ఉద్యమించాలని అయన పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వలేటివారిపాలెం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈఈ తాటికొండ మధుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో చెట్లను తొలగించే క్రమంలో సరఫరా నిలిపివేస్తునట్లు తెలిపారు.

సుపరిపాలనలో తొలిఅడుగు

వలేటివారిపాలెం, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రోళ్లపాడు, చుండి, వీరన్నపాలెం, వలేటివారిపాలెం, అంకభూపాలపురం తదితర గ్రామాల్లో గురువారం టీడీపీ నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాకుమాను అంజనేయులు, వలేటి నరసింహం, వలేటి మధుసూదన్ రావు, వీరమోసు అంజయ్య, చొప్పర రాఘవులు, మార్తాల వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీలో టీడీపీ నాయకులు


● కందుకూరు, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి, పేదప్రజల సంక్షేమం రెండు కళ్లుగా సీఎం చంద్రబాబు పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని పాలూరు దొండపాడులో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రభుత్వ ఏడాది పాలనపై కరపత్రాలు పంపిణీచేశారు. కార్యక్రమంలో బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, సూరె వినోద్‌కుమార్‌రెడ్డి, కంద్రా మాల్యాద్రి, తల్లపనేని రవీంద్ర, బుస్సారెడ్డి వెంకటేశ్వరరెడ్డి,ఆళ్ల హరికృష్ణారెడ్డి, రామాల శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు. కందుకూరులోని పలు వార్డుల్లోనూ గురువారం స్థానిక టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

పంచాయతీ కార్యదర్శిపై విచారణ వాయిదా

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): బోగోలు పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ జహీర్ అవినీతిపై విచారణ చేయాలని కలెక్టర్ గ్రీవెన్స్‌లో మాజీ ఉప సర్పంచు వీరరఘు కోరారు. ఈ క్రమంలో గురువారం విచారణ జరపాల్సి ఉండగా వాయిదా పడినట్లు డీఎల్పీవో వెంకటరమణ తెలిపారు.

అర్హుల జాబితా ప్రకటన

ఉలవపాడు, (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించిన అర్హుల జాబితాలు ప్రతి రైతుసేవా కేంద్రంలో ప్రదర్శనకు ఉంచినట్లు మండల వ్యవసాయ అధికారి విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.


అబ్బో.. ఈ కాలనీ ఎంత బావుందో...! కొనదిన్నె గిరిజనకాలనీలో రోడ్డుపై కొండముచ్చు


మీ వెనుకే నేనుంటా..!


ఈ చిన్నారికి పేలు దువ్వి జడ వేస్తా...

ఆ కాలనీ నేస్తం... కొండముచ్చు !


బాలికకు కొండముచ్చుకు స్నేహం ఎలా కుదిరిందో...? ఆసక్తిగా చూస్తున్న కాలనీవాసులు

జంతు ప్రేమికులను అబ్బుర పరుస్తూ.. చిన్నారులపై ప్రేమ చూపుతూ ఓ కొండముచ్చు కావలి కొనదిన్నె గిరిజనకాలనీకి కాపలాగా ఉంటోంది. ఎక్కడ తప్పిపోయిందో తెలియదు కానీ, కాలనీవాసులు పెట్టే పండ్లు, అన్నం తినడంతోపాటు కాలనీలోని టెంకాయచెట్లపై రాత్రిళ్లు నిద్రిస్తూ అక్కడకి కోతులు రాకుండా చూస్తున్నది. కాలనీవాసులు ప్రతి రోజూ కూలి పనులకు వెళ్తున్నా, ఇంటి వద్ద ఉండే చిన్నాపెద్దా ఎవరో ఒకరు దానికి ఆహారం అందిస్తున్నారు. ఇక అది చిన్నారులకు తోడుగా నిలవటంతోపాటు వారి తలలో పేలు చంపుతూ కాలనీలో అటూఇటూ తిరుగుతూ రాజసం ప్రదర్శిస్తున్నది. కొండ ముచ్చుకు స్నానాలు చేయించటంతోపాటు అది కనిపించకపోతే దానికోసం చిన్నారులు ఏడుస్తూ వీధుల వెంట తిరగడం విశేషం. ఈ విషయాలు గమనించనివారు 'ఈ నాటి బంధం... ఏనాటిదో... అంటూ వ్యాఖ్యానించడం గమనార్హం.

- కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి)

ఎవరిదీ పాపం!

ఆంధ్రజ్యోతి విచిత్రం

జగనన్న విద్యా కానుకలు అడవిపాలు



గత ప్రభుత్వం జగనన్న విద్యా కానుకల పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు బూట్లు, బెల్టులు అందజేసింది. అయితే అవన్నీ ఇప్పుడు ఉదయగిరి శివార్లలోని సీతారామపురం మార్గం లోని అటవీ ప్రాంతంలో గురు వారం దర్శనమిచ్చాయి. అప్పట్లో పంపిణీ చేయకపోవడం, ప్రభుత్వం మారడంతో వందల సంఖ్యలో బూట్లు, బెల్టులను గోతాల్లో మూట గట్టి ముళ్లపొదల్లో పడేశారు. అయితే గోతాలపై మర్రిపాడు మండలం కేజీబీవీ పాఠశాల అని రాసి ఉండడంతో ఎవరో వాహనంలో తీసుకొచ్చి ఇక్కడ పడేసి ఉంటారని పలువురు చర్చించుకుంటున్నారు. అటు గా వెళుతున్న కొందరు వాహనదారులు కవర్లు కూడా తీయని బూట్లు, బెల్టులను చూసి చేతపట్టుకుని వెళుతున్నారు.

- ఉదయగిరి (ఆంధ్రజ్యోతి)


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

సమర్థవంతంగా పీ-4 అమలు: కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), జూలై 10(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పీ-4 కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ ఆనంద్ తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి పీ-4పై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ శంకరన్ హాల్ నుంచి కలెక్టర్ ఆనంద్ పాల్గొన్నారు. సీఎం ఆదేశాల మేరకు జిల్లాలో బంగారు కుటుంబాలు, మార్గదర్శులను ఎంపిక చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే జిల్లాలో పలు కంపెనీల పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహించామని, అందరినీ సమన్వయం చేసుకుంటూ జిల్లాలో పీ-4 కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని వివరించారు. ఈ సమావేశంలో నెల్లూరు నగర కమిషనర్ నందన్, సీపీవో నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరువ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే రైతులకు వ్యక్తిగతంగా వ్యవసాయ పరికరాలను రాయితీపై అందించింది. అంతేగాక రసాయనిక మందుల పిచికారీకి అవసరమైన డ్రోన్లను 80 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తోంది. ఇప్పటికే 13 గ్రూపులకు డ్రోన్లు అందజేయగా, ఇంకా మరిన్ని డ్రోన్లను జిల్లాకు కేటాయిస్తోంది.

- నెల్లూరు (వ్యవసాయం, ఆంధ్రజ్యోతి)


కోవూరులో ఓ రైతు గ్రూపునకు అందించిన డ్రోన్ (ఫైల్)

మరో 23 డ్రోన్ల పంపిణీకి సిద్ధం



వ్యవసాయంలో డ్రోన్ల పాత్ర కీలకం కాబోతోంది. కూలీల ఖర్చులు, ఎరువులు, పురుగు మందులు ఆదా చేసుకునే అవకాశం ఎంతో ఉంది. జిల్లా అవసరాలను బట్టి 41 డ్రోన్లను కేటాయించారు. ఇప్పటికే 13 గ్రూపులకు డ్రోన్లను పంపిణీ చేయడం జరిగింది. మరో రెండు, మూడు రోజుల్లో 23 డ్రోన్లను గ్రూపులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. పైలెట్లుగా శిక్షణ పూర్తి చేసుకుని బ్యాంకు డిపాజిట్లు చెల్లించిన వారికి పంపిణీ జరుగుతోంది.

- పి.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

డ్రోన్.. సేద్యంలో డాన్!

కూలీల సమస్య, అదనపు ఖర్చులకూ చెక్! • 80 శాతం రాయితీపై పంపిణీ

ఐదుగురు సభ్యులు గల రైతులకు అందజేత • ఇప్పటికే 13.. భవిష్యత్తులో మరిన్ని...

కూలీల కోసం ఎదురు చూడకుండా సాగుకు అవసరమైన నూతన సాంకేతికతను రైతులకు అందించి వారిని ఆర్థికంగా నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఎరువులు, పురుగు మందుల పిచికారీకి కూలీల అవసరం లేకుండా 80 శాతం రాయితీపై డ్రోన్లు అందిస్తోంది. ఈ మేరకు జిల్లాకు 41 డ్రోన్లను కేటాయించింది. ఐదు గురు సభ్యులతో కూడిన బృందాలకు ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు దాదాపు 38 దరఖాస్తులు అందగా, ఇప్పటి వరకు 13 గ్రూపులకు డ్రోన్లను పంపిణీ చేశారు. గ్రూపులో ఒకరు డ్రోన్ పైలట్‌గా వ్యవహరిస్తారు. ఇంటర్మీడియట్ చదివి పాస్ పోర్టు కలిగి వారికి శిక్షణ కూడా ఇచ్చిన అనంతరం డ్రోన్లను అందజేస్తున్నారు.

● 80 శాతం రాయితీ..

రైతులకు ఎంతగానో ఉపయోగపడే డ్రోన్లను ప్రభుత్వం 80శాతం రాయితీపై అందిస్తోంది. డ్రోన్ ఖరీదు రూ.9.8 లక్షలు కాగా ఇందులో 80శాతం రాయితీ పోను రైతు వాటా కింద దాదాపు రూ.2లక్షలు చెల్లించాలి. అయితే మొదటగా డ్రోన్ ఖరీదులో దాదాపు 50శాతం వరకు గ్రూపు చెల్లించాల్సి ఉంటుందని, ఆ తర్వాత సబ్సిడీ నగదు గ్రూపునకు చెందిన బ్యాంకు ఖాతాలో జమవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే డ్రోన్లు తీసుకున్న గ్రూపులకు అతి త్వరలో సబ్సిడీ నగదు జమ అవుతుందని అధికారులు అంటున్నారు.

● డ్రోన్‌తో ఉపయోగాలివే..

ఎరువులు, పురుగు మందుల పిచికారీకి ఇప్ప టివరకు కూలీలపై ఆధారపడేవారు. సమయం ఎక్కువ తీసుకోవడంతో పాటు ఖర్చులు ఎక్కువే. అయితే డ్రోన్లతో ఎన్ని ఎకరాల్లో అయినా నిమిషాల్లో ఎరువులు, మందులు చల్లుకోవచ్చు. ఎకరా పొలంలో పిచికారీకి సరాసరి 7 నుంచి 9 నిమిషాలు సరిపోతుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ పద్ధతిలో మందులు పిచికారీ చేయడం వల్ల మందులు వృథా కాకుండా ఉంటాయంటున్నారు. పంట దిగుబడులు పెరుగుతాయి. ముఖ్యంగా రైతులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవు. అదేవిధంగా పైలెట్లకు ఉపాధి దొరికినట్లు అవుతుంది.


కసుమూరు దర్గాలో భక్తుల రద్దీ

కసుమూరులో భక్తుల రద్దీ

వెంకటాచలం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు బారాషాహిద్ దర్గా వద్ద జరుగుతున్న రొట్టెల పండుగ సందర్భంగా చివరి రోజు కావడంతో గురువారం కసుమూరు మస్తాన్ వలి దర్గాలో భక్తుల రద్దీ నెలకొంది. దర్గా పూజారులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. దర్గాను పూలు, విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. రొట్టెల పండుగ గురువారంతో ముగియడంతో కసుమూరుకు వచ్చే భక్తుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోయింది. వసతి ఏర్పాట్లను విజయవాడ వక్ఫ్‌బోర్డు అధికారులు సయ్యద్ రావూఫ్, మొహమ్మద్ రియాజ్ ఖాన్, షేక్ అలీషా, దర్గా ఈవో షేక్ షరీఫ్, కేర్ టేకర్ పఠాన్ అస్లాం ఖాన్ పర్యవేక్షించారు. పోలీస్ బందోబస్తు కొనసాగించారు.

సైనిక సంక్షేమ కార్యక్రమాలపై బ్రిగేడియర్ చర్చ


జిల్లా సైనిక సంక్షేమ శాఖ కార్యాలయంలో బ్రిగేడియర్ వెంకటరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), జూలై 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సైనిక సంక్షేమశాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ వీ వెంకటరెడ్డి, ఏడీ కెప్టెన్ సత్యప్రసాద్ గురువారం జిల్లా సైనిక సంక్షేమశాఖ కార్యాలయాన్ని సందర్శించారు. మాజీ సైనికులకు అందించే సంక్షేమ కార్యక్రమాలు, భవిష్యత్‌లో అమలు చేసే కార్యక్రమాలపై మాజీ సైనికులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ వింగ్ కమాండర్ శ్యాంప్రసాద్, పంచాయతీరాజ్ డీఈ కృష్ణారెడ్డి, జిల్లా సైనిక సంక్షేమాధికారి హరికృష్ణ, నాయకులు రత్నయ్య, బీజే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పోటీలో బండ లాగుతున్న ఎడ్లు

బిట్రగుంటలో రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు

బిట్రగుంట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం బిట్రగుంటలో వెలసి ఉన్న షిరిడీ సాయినాథుడి మందిర రజతోత్సవాల సందర్భంగా గురువారం రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలను మందిర వ్యవస్థాపకుడు కే బ్రహ్మానందం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. బాబామందిరంలో ప్రత్యేక పూజల అనంతరం బిట్రగుంట జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన ఎడ్ల బండలాగుడు కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుంచి ఆరు జతల ఎడ్లు పాల్గొన్నాయి. మార్కాపురానికి చెందిన బోడిచర్ల వీరాంజనేయస్వామి ఎడ్లు మొదటి స్థానం, బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన ఎడ్లు రెండవ స్థానం, బాపట్లకి చెందిన పావులూరి వీరాస్వామి చౌదరి ఎడ్లు మూడవ స్థానం సాధించాయి. వారికి ప్రోత్సాహక నగదు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం టీడీపీ నేత మాలేపాటి నాగేశ్వరరావు, బీజేపీ నేత వీరాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

'రసంలో బల్లి' నమూనాల సేకరణ

నెల్లూరు రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో మద్రాసు బస్టాండ్ సమీపంలోని ఓ ప్రముఖ హోటల్లో రసంలో బల్లి ఉండటాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు ఆహార భద్రత సహాయ కంట్రోల్ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన గురువారం తన కార్యాలయం నుంచి ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. సదరు హోటల్లో రసంలో బల్లి వచ్చినట్లు ఫిర్యాదు అందిన వెంటనే తమ సిబ్బందిని పంపామని, అక్కడ రసం సమూనాలను సేకరించి ల్యాబొరేటరీకి పంపినట్లు వెల్లడించారు. అక్కడ్నుంచి వచ్చే ఫలితాలను బట్టీ కేసు నమోదు చేసి నిందితులను జేసీ కోర్టులో హాజరుపరుస్తామని వెల్లడించారు. ఇదే హోటల్లో గతంలో ఇడ్లీలో బొద్దింక వచ్చినట్లు ఫిర్యాదులు న్నాయని తెలిపారు.

సోమశిలలో నీటి నిల్వ

అనంతసాగరం జూలై 10 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి గురువారం 165 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా 28.870 టీఎంసీలు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 375, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 2,650 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.


కన్యకాపరమేశ్వరి ఆలయంలో 102 గోత్ర నామాలతో ప్రదర్శించిన చలిమిడి, సారె

కన్యకాపరమేశ్వరికి చలిమిడి, సారె సమర్పణ

కావలి కొత్తబజారులోని శ్రీకన్యకాపరమేశ్వరికి గురువారం మహిళలు 102 గోత్ర నామాలతో చలిమిడి, సారె సమర్పించారు. స్థానిక శ్రీప్రసన్న వేంకటేశ్వర భజన మండలి మహిళలు 102 గోత్రనామాలతో సలిమిడి, సారె తట్టలు పట్టుకుని బృందా వనం బజారు నుంచి కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు శోభయాత్రగా తరలివచ్చారు. అనంతరం అమ్మవారికి సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో లలితా సహస్రనామాలు, అన్నమాచార్య, పురందరదాసు కీర్తనలు ఆలపించారు.

- కావలి, (ఆంధ్రజ్యోతి)

హత్య కేసులో నిందితుడికి జైలు, జరిమానా

పలేటివారిపాలెం, జూలై 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయ్యవారిపల్లెకి చెందిన ఆవుల వెంగయ్య హత్య కేసులో నిందితుడు తాడిబోయిన చిరంజీవికి గురువారం ఒంగోలు ఏడీజే, ప్యామిలీ కోర్టు 10 ఏళ్ల కఠిన కారాగార జైలు శిక్షతోపాటు రూ 5 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ మరిదినాయుడు తెలిపారు. ఈ హత్య కేసులో అడ్డొచ్చిన ఫిర్యాది రమణమ్మను గాయపరిచిన కేసులో అదే నిందితుడు చిరంజీవికి అదనంగా ఏడాది జైలుశిక్ష రూ 2 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.ఎస్ఐ కథనం మేరకు, మండలంలోని అయ్యవారిపల్లెలో 2018 అక్టోబరు 28న ఆవుల రమణమ్మ తన మేనల్లుడు మంచాల మాలకొండ్రాయుడిని చంపుతున్నారని పెద్దగా కేకలు వేసింది. దీంతో ఇంట్లో నిద్రిస్తున్న ఆమె భర్త ఆవుల వెంగయ్య రోడ్డుపైకి వెళ్లి చూడగా తాడిబోయిన చింజీవితో పాటు మరో ఆరుగురు మాలకొండ్రాయుడును రోడ్డుమీద పడేసి సిమెంటు రాళ్లతో తల మీద కొడుతున్నాడు. అడ్డు తీయడానికి వెళ్లిన వెంగయ్యను చిరంజీవి కాళ్లతో మర్మావయాలపై తన్నగా స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే ఆయన్ను చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. వెంగయ్య భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి కందుకూరు సీఐ వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేసి చార్జిషీట్ వేశారు. ఈ కేసులో గురువారం ఒంగోలు ప్యామిలీ కోర్టు చిరంజీవికి 10 ఏళ్ల జైలుశిక్ష, రూ 5 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు. ఆయనతో పాటు కుమ్మరి వీరయ్య, మంచాల కొండయ్య, చీమల రమాదేవి, కాకర్ల రత్తమ్మ, కుమ్మరి ధనమ్మ, మంచాల జయమ్మలకు వెయ్యి రూపాయలు జరిమానా చెల్లించని పక్షంలో రెండు నెలలు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి

ఉదయగిరి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ.అయ్యవారిపల్లి గ్రామంలో కుక్కలు దాడి చేయడంతో చుక్కల దుప్పి మృతిచెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సమీప అటవీ ప్రాంతం నుంచి తాగునీటి కోసం గ్రామ శివారులోకి వచ్చిన దుప్పిపై ఒక్కసారిగా కుక్కలు దాడి చేశాయి. గమనించిన స్థానికులు కుక్కలను తరిమి దుప్పిని రక్షించారు. అయినా దుప్పి తీవ్రంగా గాయపడడంతో మృతిచెందింది. గ్రామస్థులు ఎస్ఐ శ్రీనుకు సమాచారం అందించడంతో ఆయన రేంజ్ అధికారి కుమారరాజాకు తెలియజేశారు. రేంజర్ ఆదేశాల మేరకు కొత్తపల్లి ఇన్‌చార్జి ఎఫ్‌బీవో గౌతమ్ తన సిబ్బందితో గ్రామానికి చేరుకుని మృతిచెందిన దుప్పిని ఉదయగిరి అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. శుక్రవారం దుప్పికి పోస్టుమార్టం నిర్వహించి రిజర్వు ఫారెస్టులో దహనం చేయనున్నట్లు వారు తెలిపారు.

గాంధీ జనసంగంలో బాలిక మృతి

కోవూరు, జూలై10 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోవూరు చెరువు కట్ట పక్కన ఉన్న గాంధీ జనసంగంలో ఓ బాలిక గురువారం ప్రమాదవశాత్తు నీటి గుంటలో పడి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. బాలిక మృతి విషయమై కోవూరు పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మధ్యవర్తిత్వంపై శిక్షణ

నెల్లూరు (లీగల్), జూలై 10 (ఆంధ్రజ్యోతి) మధ్యవర్తిత్వం చేసుకుంటే ఒనగూడే ఉపయోగాల గురించి జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ అధ్వర్యంలో గురువారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్ భవన్‌లో శిక్షణ ఇచ్చారు. 27 మంది మీడియేటర్స్, అడ్వకేట్స్‌కి శిక్షణ తరగతులు నిర్వ హించారు. మధ్యవర్తిత్వం చేసుకుంటే వ్యాజ్యాల ఖర్చు తగ్గుతుందని, ఇరు పార్టీల మధ్య సామరస్యం లభిస్తుందని, అంతేగాకుండా కోర్టు ఫీజులు సంబం ధిత పక్షాలకు వాపసు వస్తుందని, డబ్బు అదా అయి అందోళన తగ్గుతుందని తెలిపారు. తొలుత ఈ కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయాధికారి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సీనియర్ ట్రెండ్ మీడియేటర్ అరుణాచలం ప్రసంగించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరి కే వాణి తదితరులు పాల్గొన్నారు.




ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి

దోస రైతుల ఘోష !


పొలాల్లోనే కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

ఉదయగిరి రూరల్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతాల్లో వరి తరువాత పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపుతుంటారు. ఈ నేపథ్యంలో ఇటీవల దోస సాగుకు అధికశాతం రైతులు పూనుకున్నారు. తొలుత ధరలు ఆశాజనకంగా ఉన్నా, క్రమేణా పెట్టుబడులు కూడా అందే పరిస్థితులు కనిపించడం లేదని సాగుదారులు వాపోతున్నారు.

● గిట్టుబాటు ధర కోసం...

నియోజకవర్గ పరిధిలోని ఉదయగిరి, వరికుంటపాడు, వింజమూరు, కలిగిరి, సీతారామపురం తదితర మండలాల్లో ఈ ఏడాది దోస సాగు చేసిన రైతులు గిట్టుబాటు ధర కోసం ఎదురు చూస్తున్నారు. అయినా ఫలితం లేకపోవడంతో చేసేదేమిలేక వ్యాపారులు చెప్పిన ధరనే వేదంగా భావించి పంటను అమ్ముకుంటున్నారు. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటను అతి తక్కువ ధరకే అమ్మి కొని మరింత అప్పుల భారం మోయాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రైతుల వద్దకు వెళ్లిన వ్యాపారులు కేవలం కిలో రూ. 2కు మాత్రమే కొనుగోలు చేసి, మార్కెట్లో మాత్రం వినియోగ దారుల నుంచి సుమారు రూ. 25 వసూలు చేస్తున్నారు. కొంతమంది రైతులు ఎంతో ఆశతో పంటను వాహనాల్లో మార్కెట్‌కు తరలించినా ఫలితం లేకుండా పోతున్నది. అక్కడి వ్యాపారులు తాము చెప్పిందే ధర నిర్ణయిస్తుం డడంతో తిరిగి రవాణా ఖర్చులు భరించి వెనక్కు వెళ్లలేని రైతులు వారి చెప్పిన ధరకే అమ్ము కుంటున్నారు. ఇంచు మించు ప్రస్తుతం మార్కెట్లో 60కేజీల బస్తా కాయ రకాన్ని బట్టి రూ. 250 దాటడం లేదంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీంతో పెట్టుబడుల సంగతి అటుంచితే కనీసం కోత కూలీల ఖర్చు కూడా చేతికి అందడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● గిట్టుబాటు ధర కల్పించాలి

తొలుత ఆశాజనకంగా ఉన్న ధరను చూసి తాము ఆశతో పంటల సాగుకు పూనుకున్నామని రైతులు తెలిపారు. వ్యాపా రులు ఇష్టానుసారంగా వ్యవహరించి తమను నట్టేట ముంచు తున్నా పట్టించుకునే నాథుడే కనిపించడం లేదని మండిపడు తున్నారు. దీంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయ పరిస్థితుల్లో వారున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి దోసకాయలకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.